www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 12-1-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 268 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి తె. 5.03 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: మృగశిర ఉ.11.24 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.7.31-9.04; దుర్ముహూర్తం: సా.4.26-5.10; అమృతఘడియలు: రా.12.57-2.30; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం:6.51; సూర్యాస్తమయం: 5.55 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మహా కుంభ మేళాకు వేళాయె!



ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమ ప్రాంతంలో పవిత్ర స్నానమాచరిస్తున్న భక్తులు

- రేపటి నుంచే అతి పెద్ద హిందూ ఉత్సవం
- 144 ఏళ్లకొకసారి వచ్చే ఆధ్యాత్మిక సమ్మేళనం
- 45 రోజులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు
- 40 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- ప్రయాగ్‌రాజ్‌లో ఆధ్యాత్మిక శోభ

(ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

మహా కుంభమేళా..! ప్రపంచంలోనే అతి పెద్ద హిందూ ఉత్సవం! ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే మహోత్తర సమ్మేళనం! ఆహ్వానం లేకుండానే కోట్లాదిమంది హాజరయ్యే వేడుక! భారతీయ ఆధ్యాత్మికతకు, ఆత్మకు ప్రతిరూపంగా భావించే 'మహా కుంభమేళా'కు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమైంది. సోమవారం నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజులపాటు

మిగతా 2వ పేజీలో...

టెంట్ సిటీ.. ప్రయాగ్‌రాజ్

అయోధ్యలో అపురూప ఘట్టం

- ఘనంగా రామమందిరం తొలి వార్షికోత్సవాలు
- ప్రారంభించిన యూపీ సీఎం
- నేడు, రేపూ వేడుకలు.. భారీగా భక్తుల రాక
- దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు

2



అయోధ్యలో శనివారం బాలరాముడి దివ్యరూపం

మా వాళ్లే వదిలేయ్!

'రాష్ట్రంలో అక్రమ మైనింగ్ జరగడానికి వీల్లేదు. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం. పీడీ యాక్ట్ పెట్టి అక్రమార్కుల వెన్నులో భయం పుట్టిస్తాం'... ఇదీ సీఎం చంద్రబాబు హెచ్చరిక.

ముఖ్యమంత్రి హెచ్చరిక టీడీపీ కార్యకర్తలకు మాత్రమే వర్తిస్తుంది.. వైసీపీ నేతలకు కాదు అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇలాగే ఉంది.

వైసీపీ అక్రమార్కులకు మంత్రి అండ

ఉమ్మడి కృష్ణాలో విచిత్ర బంధం

జగన్ జమానాలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైసీపీ నేతలు అక్రమంగా కొండలు, భూములు తవ్వి మట్టిని ఎత్తుకెళ్లిపోయారు. కూటమి సర్కారు వచ్చాక ఫిర్యాదులు రావడంతో గనుల శాఖ అధికారులు అక్రమాలను గుర్తించారు. వైసీపీ నేత వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు కె.సతీష్ మట్టి మైనింగ్‌పై రూ.35 కోట్లు, మాజీ మంత్రి కొడాలి అనుచరుడి మైనింగ్‌పై రూ.40 కోట్లు పెనాల్టీ వేయాలని నివేదికలు సిద్ధం చేశారు. అయితే గనుల శాఖతో సంబంధం లేని ఓ టీడీపీ మంత్రి వారికి నోటీసులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వల్లభనేని వంశీ అనుచరుడు కె.సతీష్ అక్రమ మైనింగ్ ఆగడం లేదు. తవ్వకాలు జరిపేది తిరువూరు నియోజకవర్గంలో అయితే... ట్రాన్సిట్ పర్మిట్లు చూపుతోంది నూజివీడు నియోజకవర్గంలో..! దీనికి కూడా తెరవెనుక సారథి సదరు మంత్రి గారే. అధికారులు అక్రమ మైనింగ్ లారీలను పట్టుకుంటే వెంటనే మంత్రి రంగంలోకి దిగిపోతారు. స్వయంగా ఫోన్ చేసి లారీలను విడిపిస్తున్నారు.



- నాడు అడ్డగోలుగా మట్టి దందా
- వల్లభనేని, కొడాలి అనుచరుల పాత్ర
- కూటమి ప్రభుత్వం వచ్చాక వెలుగులోకి
- 75 కోట్లు జరిమానా వేయాలని నివేదిక
- నోటీసులు ఇవ్వకుండా అడ్డుకుంటున్న మంత్రి
- కూటమి ప్రమాణ స్వీకార సభకూ వల్లభనేని అనుచరులు మట్టి తరలింపు
- 4.8 కోట్ల బిల్లులు చేయించిన మంత్రి
- ఇప్పటికీ వంశీ అనుచరుడి అక్రమ మైనింగ్
- 18 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపు
- లారీలు సీజ్ చేస్తే.. విడిపించిన మంత్రి

గన్నవరం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకార సభకు వల్లభనేని వంశీ అనుచరులు కె.సతీష్, రఘు మట్టి, ఇతర వనరులు సమకూర్చారు. ఇందుకుగాను వారికి రూ.4.8 కోట్ల బిల్లులు మంజూరు చేయించారు. ఈ ఘనత కూడా సదరు మంత్రి గారిదే.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ అక్రమార్కులు చేసిన, చేస్తున్న మట్టి మాఫియాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్వయానా ఓ టీడీపీ మంత్రి అండదండలు అందిస్తున్నారు. బిల్లులు ఇప్పించే దగ్గరి నుంచి, దొంగ రవాణా బిల్లుల జారీ వరకు సకలం మంత్రిగారే స్వీయ పర్యవేక్షణ చేస్తున్నారు. అక్రమ మైనింగ్ వాహనాలను రెవెన్యూ, గనుల శాఖ విజిలెన్స్ విభాగాలు సీజ్ చేస్తుంటే మంత్రి

మిగతా 2వ పేజీలో...



శనివారం టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ సందర్భంగా చిన్నారితో సీఎం చంద్రబాబు

10 లక్షల కోట్ల పెట్టుబడులు

హరిత ఇంధన రంగంలోకి వస్తున్నాయి

- 1. 85 లక్షల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ హబ్
- పూడిమడకలో ఏర్పాటుచేస్తున్న ఎన్టీపీసీ
- రాష్ట్రంలోని అన్ని ఇళ్లకూ సౌర ఫలకాలు
- 5 వేల విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ శ్వాపింగ్ సదుపాయాల ఏర్పాటు
- త్వరలో 'హ్యాపీ సండే': చంద్రబాబు

సెమీకండక్టర్ పరిశ్రమ

14 వేల కోట్లతో ఓర్వకల్లులో ఏర్పాటు చేయనున్న ఇండిచిప్

14

"పొరుగింటిలో ఎవరున్నారో కూడా తెలియనంతగా మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయి. ఆ లోపాన్ని భర్తీ చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా హ్యాపీ సండేలను ఏర్పాటు చేయబోతున్నాం. వెల్త్... హెల్త్... హ్యాపీ ఏపీ అనేది ఈ కార్యక్రమం లక్ష్యం. ప్రజల్లో ఆనందకరమైన భావాలు పెంపొందించి నలుగురు కలిసి పాల్గొనే కార్యక్రమాలను పెంచాలని భావిస్తున్నాం. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాలు, పెద్ద గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్య ప్రదర్శనలు, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తాం. వాటిలో పాల్గొనడానికి... చూడటానికి వచ్చేవారిలో ఈ కార్యక్రమాలు ఆనందం నింపుతాయి"

\- సీఎం చంద్రబాబు

13

భయ భక్తులు ఉన్నాయా?



.. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆరుగురు చనిపోవడం తిరుమల-తిరుపతి చరిత్రలో ఇదే ప్రథమం! దీంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది.

..తిరుపతిలో జరిగిన విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి అంత్యక్రియలు కూడా పూర్తి కాకముందే రాజకీయాలు రంగప్రవేశం చేశాయి. సందట్లో సడేమియా అన్నట్టుగా జగన్ రెడ్డితో పాటు ఆయన రోత మీడియా యథావిధిగా విష ప్రచారం మొదలుపెట్టింది.

..తొలిసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన జగన్ వద్దనే భయభక్తులు ప్రదర్శించిన అధికారులు పద్నాలుగేళ్లకు పైగా ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చంద్రబాబు వద్ద ఎలా మెలగాలి? ముఖ్యమంత్రి అంటే లెక్కలేనట్టుగా వ్యవహరించడమేమిటి?

..పాలక మండలిలో కూడా తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు చెందిన సభ్యులు ఉన్నారు. ఈ కారణంగా వారు అవసరానికి, పరిమితికి మించిస్వేచ్ఛను తీసుకుంటున్నారు.

...పవన్ జనసేన అధినేత కనుక ఆయన చంద్రబాబుకు విధేయుడిగా ఉండాలని భావించలేని పరిస్థితి. ప్రస్తుతం తలెత్తిన ఈ సున్నితమైన సమస్య మున్ముందు కూటమి సఖ్యతపై ప్రభావం చూపకూడదనుకుంటే ప్రస్తుత దశలోనే పరిష్కారం కనుగొనాలి.

..మృతుల కుటుంబాలకు పాలక మండలి క్షమాపణలు చెప్పాలని పవన్ కల్యాణ్ కోరడం ముమ్మాటికీ సమర్థనీయమే. అయితే పవన్ కల్యాణ్ ఈ ప్రకటనను ముఖ్యమంత్రి సమక్షంలో చేసి ఉంటే బాగుండేది. విషయాలు స్వల్పమే అయినప్పటికీ అవి భవిష్యత్తులో ముదిరే ప్రమాదం ఉంటుంది. కూటమిలో చిచ్చు పెట్టడానికి జగన్ అండ్ కో కాచుకొని ఉన్నారు.

..జగన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రారు అన్న భరోసా ఇవ్వగలరా? అని పెట్టుబడులు పెట్టేవారు అడుగుతున్నారని మంత్రి లోకేశ్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం-జనసేన మధ్య, ముఖ్యంగా చంద్రబాబు-పవన్ కల్యాణ్ మధ్య మరింత సమన్వయం అవసరం.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

రాళ్ల సీమలో పవర్ ప్రాజెక్టు..

అద్భుతం

సీఎం చంద్రబాబు విజన్‌కు నిదర్శనం

- ఐటీ తర్వాత గ్రీన్ ఎనర్జీకే అధిక ప్రోత్సాహం
- దేశానికి ఐఆర్ఈపీ తలమానికం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 12 వేల మందికి ఉపాధి
- 'అటవీ వివాదం' త్వరలోనే తొలగిపోతుంది
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి
- ప్రాజెక్టు ప్రాంతంలో ఏరియల్ వ్యూ
- స్వయంగా కారు నడుపుతూ టన్నెల్ పనుల పరిశీలన



కర్నూలులోని గ్రీన్ కో ఎనర్జీ ప్రాజెక్టులోని టన్నెల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కర్నూలు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో వ్యవసాయానికి పనికిరాని బీడు భూముల్లో సమగ్ర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు (ఐఆర్ఈపీ) పెట్టాలనే ఆలోచనే అద్భుతమని, సీఎం చంద్రబాబు విజన్‌కు ఇది నిదర్శనమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఐటీ తర్వాత గ్రీన్ ఎనర్జీకే ప్రభుత్వం అధిక ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుమ్మటంతండా, నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామాల మధ్య గ్రీన్‌కో కంపెనీ ఐఆర్ఈపీని

మిగతా 14వ పేజీలో...

రూ.3 లక్షల పుస్తకాల కొనుగోలు

పుస్తక మహోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



రిజిస్ట్రేషన్లకు 'బ్లాక్ చెయిన్'

సాంకేతికత

- వ్యవస్థల ఏకీకరణతో సురక్షిత లావాదేవీలు
- భూముల సమాచారం కోసం మొబైల్ యాప్
- ఫిబ్రవరి చివరి నాటికి అందుబాటులోకి
- నకిలీల బెడద తగ్గుతుందని సర్కారు అంచనా

3

బకాయిలు క్లియర్!

- రూ. 6,700 కోట్ల చెల్లింపునకు సీఎం ఆమోదం
- ఇందులో ఒక్క ఉద్యోగులకే రూ. 1,300 కోట్లు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 788 కోట్లు
- చిన్న కాంట్రాక్టర్ల బిల్లులకు రూ. 586 కోట్లు
- ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌కు రూ. 400 కోట్లు
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి

14

కొక్కొరో.. కో

కాలు దువ్వుతున్న కోళ్లు.. సిద్ధమైన బరులు



కాకినాడ జిల్లా అచ్చంపేట ఏడీబీ రోడ్డులో సిద్ధమైన కోడి పందేల బరి



కాకినాడ జిల్లా వెంకట కృష్ణాపురం గ్రామంలో పందేలకు సిద్ధమైన కోడిపుంజులు

- కోస్తా జిల్లాల్లో సంక్రాంతికి ఏర్పాట్లు పూర్తి
- ఇతర రాష్ట్రాల నుంచీ వస్తున్న పందెంరాయుళ్లు
- చిన్న పట్టణాల్లోనూ హోటల్ రూమ్‌లన్నీ ఫుల్
- బరుల వద్ద విందు, వినోద కార్యక్రమాలు
- ప్రత్యేక ఆఫర్లతో ఆకట్టుకునే ప్రయత్నాలు
- కరపలో పందెం కొట్టినోళ్లకు థార్ జీప్
- వందల కోట్లు చేతులు మారతాయని అంచనా

13

సంక్రాంతికి సొంతూళ్లకు

- రాష్ట్రానికి తరలిన జనం
- హైదరాబాద్ నుంచి ఒకేరోజు 4 లక్షల మంది రాక
- టోల్‌ప్లాజాల వద్ద కార్ల బారులు
- హైవేలపై గంటల తరబడి నిరీక్షణ



చెన్నై-కోల్‌కతా హైవేపై ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద బారులుదీరిన వాహనాలు



మహా కుంభ మేళాకు వేళాయె!


అక్షయ్ వట్

(మొదటి పేజీ తరువాయి)

గంగా, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో మహా కుంభమేళా జరగనుంది. జనవరి 13న పుష్య పౌర్ణమి స్నానంతో ప్రారంభమయ్యే ఈ బృహత్తర క్రతువు ఫిబ్రవరి 26 మహా శివరాత్రి నాడు ముగుస్తుంది. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే అరుదైన వేడుక కావడంతో యూపీ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాగ్‌రాజ్‌ను యోగి సర్కార్ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. పట్టణంలో అడుగు పెట్టిన చోటు నుంచే ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. దాదాపు ప్రతి కూడలిలో గజ్జెలు, ఢమరుకం వంటి చిహ్నాలను ఉంచింది. గోడలకు పెయింటింగులు వేయించింది! విద్యుత్తు, ఇతర స్తంభాలకు త్రినేత్రం తదితర సొబగులను అద్దింది. నెలన్నరపాటు పుణ్య స్నానాలు ఆచరించేందుకు దాదాపు 40 కోట్ల మంది భక్తులు, యాత్రికులు వస్తారని యూపీ సర్కారు అంచనా వేస్తోంది. త్రివేణి సంగమానికి ఇరువైపులా దాదాపు 4 వేల హెక్టార్లలో సౌకర్యాలు కల్పిస్తోంది.

ఏఐ టెక్నాలజీ సాయంతో నిఘా

కోట్లాదిమంది భక్తులు హాజరయ్యే మహా కుంభమేళా కోసం ప్రభుత్వం అంతే స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టింది. ఇప్పటికే సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 2,750 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తోంది. అత్యంత కీలక, సమస్యాత్మక ప్రాంతాల్లో ఏఐ ఆధారిత కెమెరాలను బిగిస్తోంది. భక్తులకు సమాచారాన్ని అందించడానికి 80 వీఎండీ టీవీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తోంది. '1920' పేరిట హెల్ప్‌లైన్‌తోపాటు 50 మందితో కాల్ సెంటర్‌నూ ఏర్పాటు చేస్తోంది. వేలాది సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించనుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠమైన నిఘా కోసం డ్రోన్లు, ఏఐ సాయంతో కెమెరాలను వినియోగించనుంది. నీటిలోనూ నిఘా ఉంచే డ్రోన్లు అందుబాటులో ఉంచుతోంది. సైబర్ మోసాలకు తావు లేకుండా 56 మంది సైబర్ సెక్యూరిటీ నిపుణులను రంగంలోకి దింపుతోంది.

కుంభమేళాలు నాలుగు..

హిందూ పురాణాల ప్రకారం.. దేవతలు, రాక్షసులు పాల సముద్రాన్ని మథిస్తారు. అప్పుడు ఒక కుండ (కుంభం)లో అమృతం బయటకు వస్తుంది. దానిని రాక్షసులకు అందకుండా చేయడం కోసం మోహినీ రూపం ధరించిన విష్ణువు ఆ కుండను తీసుకుని వెళుతూ ఉంటాడు. ఆ సమయంలోనే నాలుగు అమృతం చుక్కలు నేలపై పడతాయి. ఆ నాలుగు ప్రాంతాలే ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్. అందుకే, వాటిని పవిత్ర పుణ్య క్షేత్రాలుగా భావిస్తూ కుంభమేళాలు నిర్వహిస్తారు. వీటిలో ఒక్కో కుంభమేళాను ఒక్కో చోట నిర్వహిస్తారు. మాఘ మేళాను ఏటా మాఘ మాసంలో ప్రయాగ్‌రాజ్‌లో; అర్ధ కుంభ మేళాను ప్రతి ఆరేళ్లకు ఒకసారి హరిద్వార్, ప్రయాగ్‌రాజ్‌ల్లో నిర్వహిస్తారు. పూర్ణ కుంభమేళాను ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి మొత్తం నాలుగు క్షేత్రాల్లోనూ అట్టహాసంగా నిర్వహిస్తారు. మహా కుంభ మేళా మాత్రం 144 ఏళ్లకు ఒకసారి వస్తుంది. దీనిని ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే నిర్వహిస్తారు.

ముఖ్యమైన రోజులు ఇవే..

- *జనవరి 13:* పుష్య పౌర్ణమి స్నానం (ప్రారంభ రోజు)
- *జనవరి 15:* మకర సంక్రాంతి స్నానం
- *జనవరి 29* మౌని అమావాస్య స్నానం
- *ఫిబ్రవరి 3:* వసంత పంచమి స్నానం
- *ఫిబ్రవరి 12:* మాఘ పౌర్ణమి స్నానం
- *ఫిబ్రవరి 26:* మహా శివరాత్రి స్నానం (ముగిసే రోజు)

అంకెల్లో మహా కుంభమేళా

45 రోజులు కుంభమేళా జరిగే మొత్తం రోజులు	**1250 కిలోమీటర్లు** 50 వేల నీటి కనెక్షన్లకు మంచినీటి పైప్‌లైన్లు
12 కిలోమీటర్లు తాత్కాలిక ఘాట్ల నిర్మాణం	**400 కిలోమీటర్లు** ప్రయాగ్‌రాజ్‌లో తాత్కాలిక రోడ్ల నిర్మాణం
40 కోట్లు 45 రోజుల్లో కుంభమేళాకు వస్తారనుకుంటున్న భక్తులు	**1800 హెక్టార్లు** ప్రయాగ్‌రాజ్‌లో పార్కింగ్ స్థలం
దాదాపు 2 లక్షలు ప్రయాగ్‌రాజ్‌లో తాత్కాలిక టెంట్లు	
15 వేలు పారిశుద్ధ్య సిబ్బంది నియామకం	


ఏం చేస్తారంటే..

త్రివేణీ సంగమంలో స్నానం చేసి అక్కడే ఉన్న మాధవుడిని దర్శించుకుని, అక్షయ్ వట్ (మర్రిచెట్టు)ను దర్శించుకోవడాన్ని మహా కుంభమేళాలో భాగంగా భావిస్తారు. ఆ తర్వాత బడే హనుమాన్ ఆలయాన్ని సందర్శిస్తారు. దీపంతోపాటు ఇతర దానాలు చేయడాన్ని పవిత్రంగా భావిస్తారు. సంకీర్తనలు, భజనలు, యోగా, మెడిటేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. తొలుత, నాగ సాధువులు వచ్చి పుణ్య స్నానాలు చేయడాన్ని కుంభమేళాకు ఆరంభంగా భావిస్తారు. ఆ తర్వాత అఖాడాలకు నిర్దిష్ట సమయం కేటాయిస్తారు. ఆ తర్వాతే సామాన్య భక్తులు స్నానాలు చేయడానికి అనుమతిస్తారు.

పుణ్య స్నానాలకు ముఖ్యమైన రోజులు

నెలన్నరపాటు జరిగే మహా కుంభమేళా సమయంలో గంగా, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో స్నానం చేస్తే పాపాలు తొలగిపోయి మోక్షం లభిస్తుందని హిందువులు విశ్వసిస్తారు. 'షాహీస్నాన్'గా పిలిచే పుణ్య స్నానాన్ని ఆచరించడం ద్వారా ఆత్మ శుద్ధి అవుతుందని, పాపాల నుంచి విముక్తి చెందుతామని నమ్ముతారు.









యుద్ధ క్షేత్రం నుంచి శాంతి కోసం!

రష్యా, ఉక్రెయిన్ నుంచి ప్రయాగ్‌కు

సత్యాన్వేషణకు వచ్చామని వెల్లడి

(ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

పుణ్య స్నానాలు ఆచరించేందుకు కొందరు..! పర్యాటక అనుభూతి కోసం మరికొందరు..! సత్యాన్వేషణలో ఇంకొందరు..! ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళాకు తరలి వచ్చే విదేశీయులు ఎందరో!! ఎప్పట్లాగే, ఈసారి కూడా పెద్ద ఎత్తున విదేశీయులు కుంభ మేళాకు తరలి వస్తున్నారు. ముఖ్యంగా, యుద్ధ క్షేత్రాలైన రష్యా, ఉక్రెయిన్ నుంచి పలువురు ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. వారిలో ఒకరు జెహెనియా! ఆయన రష్యాలో యోగా శిక్షకుడు. మూడేళ్ల కిందట భారత దేశానికి వచ్చేశారు. ప్రస్తుతం ఆయన ప్రయాగ్‌రాజ్‌లో చిన్న టెంట్ వేసుకుని కనిపించారు. ఉక్రెయిన్ నుంచి ఏడాది కిందట వచ్చిన మరో ముగ్గురు కూడా ఆయనతోపాటు ఇక్కడే ఉన్నారు. వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉండడం విశేషం. మీరంతా కుంభమేళాకు ఎందుకు వచ్చారని ప్రశ్నించినప్పుడు 'సత్యాన్వేషణ'కు అని జవాబిచ్చారు. యుద్ధాలతో రష్యా, ఉక్రెయిన్ అల్లకల్లోలంగా మారాయని, శాంతి, ఆధ్యాత్మిక భావాలను అన్వేషించడానికే తాము ఇక్కడికి వచ్చామని వివరించారు. ఇక, క్రియా యోగాను నేర్చుకోవడానికి కొందరు, మానసిక శాంతి కోసం మరికొందరు ప్రయాగ్‌రాజ్‌కు తరలి వస్తున్నారు.

టెంట్ సిటీ.. ప్రయాగ్‌రాజ్!

దాదాపు 2 లక్షల వరకూ టెంట్ల ఏర్పాటు

(ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)


హెచ్‌డీపీఈ కంటైనర్లతో తేలియాడే జెట్టి

ప్రయాగ్‌రాజ్.. ఇప్పుడు టెంట్ సిటీ! నదిలో.. నదీ తీరంలో.. ఖాళీ స్థలాల్లో.. త్రివేణీ సంగమం నుంచి దాదాపు పది కిలోమీటర్ల పరిధిలో కనుచూపు మేరలో ఎక్కడ చూసినా టెంట్లే! వీటిలో కనీస సదుపాయాలతో కూడిన మామూలు టెంట్ల నుంచి టీవీలు, సీసీటీవీ కెమెరాలతో కూడిన అత్యంత విలాసవంతమైన టెంట్లు కూడా ఉన్నాయి. గంగా నదిలో దాదాపు లక్ష టెంట్లతో ఏకంగా ఓ టెంట్ సిటీనే ఏర్పాటు చేశారు! ఇందుకు ఏకంగా 68 లక్షల కర్రలు, పైకప్పుల కోసం ఏకంగా 250 టన్నుల సీజీఐ షీట్లు ఉపయోగించారని అంచనా. ప్రయాగ్‌రాజ్‌లో ప్రస్తుతం 2లక్షలకుపైగా టెంట్లను ఏర్పాటు చేశారని అంచనా! వీటిలో ఏకకాలంలో 20 లక్షల మందికి వసతి కల్పించవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి. కొన్ని ఉచితంగా ఇచ్చేవి కాగా.. మరికొన్ని అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తూ రూ.80 వేల నుంచి లక్ష వరకూ వసూలు చేసేవి!

టెంట్లు.. అనేక రకాలు..!

ఉచిత టెంట్లు కొన్ని.. విలాసవంతమైన టెంట్లు కొన్ని! సిబ్బందికి ఒక రకం! అధికారులకు మరో రకం! రాజకీయ నాయకులకు ఇంకో రకం! వీటిలో కొన్ని మామూలు టెంట్లు.. మరికొన్ని అగ్ని ప్రమాదం జరిగినా చెక్కుచెదరని ఫైర్ ప్రూఫ్ టెంట్లు! ఇలా.. వివిధ వర్గాల వారికి ప్రయాగ్‌రాజ్‌లో టెంట్లు ఏర్పాటు చేశారు. ఉదాహరణకు, ప్రయాగ్‌రాజ్‌కు చెందిన సర్వోదయ మండలి రెండు టెంట్లను ఏర్పాటు చేసింది. ఎక్కడా వసతి దొరకని వారికి ఇక్కడ ఉచితంగానే.. ఒక్కో టెంట్‌లో 30 మందికి వసతి కల్పిస్తామని దాని బాధ్యులు చెప్పారు. భక్తులకు ఉచితంగా వసతి కల్పించేందుకు కొందరు సేవాభావంతోనే వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు, మరికొందరు టెంట్లలో వసతితోపాటు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం, మాధవుడు, బడే హనుమాన్, అక్షయ్ వట్ దర్శనం తదితరాలతో కూడిన ప్యాకేజీలనూ అందిస్తున్నారు. డిమాండ్, సౌకర్యాలను బట్టి ఈ ప్యాకేజీలు రూ.3 వేల నుంచి లక్ష రూపాయల వరకూ పలుకుతున్నాయి.


సర్వోదయ మండలి టెంట్


నిఘా వర్గాల సిబ్బందికి డబుల్ బెడ్‌రూం టెంట్లు

ఇక, ఐఆర్‌సీటీసీ కూడా వాణిజ్య ప్రాతిపదికన సూపర్ లగ్జరీ టెంట్లు, విల్లాలను ఏర్పాటు చేసింది. వీటికి రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకూ వసూలు చేస్తోంది. అలాగే, ప్రయాగ్‌రాజ్‌లో భద్రతను పర్యవేక్షించే పోలీసులు, ఐబీ, ఇంటెలిజెన్స్, ఇతర అధికారులు కూడా తమ తమ అవసరాల మేరకు ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేసుకున్నారు. కొన్నిచోట్ల దాదాపు 80 గజాల స్థలంలో డబుల్ బెడ్‌రూం టెంట్లు ఏర్పాటు చేశారు. వీటిలో ముందు భాగంలో చిన్న సోఫాతో ఆఫీసు రూం.. వెనక బాత్‌రూం మధ్యలో రెండు బెడ్ రూంలు వరుసగా ఏర్పాటు చేశారు. మరికొన్నిచోట్ల 40-50 గజాల చిన్న టెంట్‌లోనే దాదాపు 15-20 మంచాలను ఏర్పాటు చేసి దాదాపు 40 మంది వరకూ ఉండేలా వసతి కల్పిస్తున్నారు.

అయోధ్యలో అపురూప ఘట్టం

» ఘనంగా రామమందిరం తొలి వార్షికోత్సవాలు

అయోధ్య, జనవరి 11: భారీగా తరలి వచ్చిన భక్తజనసందోహం మధ్య అయోధ్యలోని రామమందిరం తొలి వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ వేడుకలను ప్రారంభించారు. బాలరాముడి విగ్రహానికి ఆదిత్యనాథ్ హారతి ఇచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యజుర్వేద పారాయణంతో వేడుకలు మొదలయ్యాయి. ఈ వేడుకలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూలు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. తొలిరోజు ఆలయ సముదాయంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామ మంత్ర జపంతో పాటు రామ రక్ష స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలి వస్తుండటంతో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలను సాధారణ ప్రజలు తిలకించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేశారు. 110 మంది వీఐపీలను కూడా ఆహ్వానించారు. నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న 2 లక్షల మందికి పైగా భక్తులు బాలరాముడిని దర్శించుకున్నట్టు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. 380 అడుగుల పొడవు, 250 అడుగుల వెడల్పు, 161 అడుగుల ఎత్తుతో ఆలయాన్ని నిర్మించారు. మొత్తం 392 స్తంభాలు, 44 ద్వారాలు ఉన్నాయి. కాగా అయోధ్య రామమందిరం తొలి వార్షికోత్సవాలను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

22కు బదులు 11నే ఎందుకంటే...

గతేడాది జనవరి 22న అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ కేలండర్ ప్రకారం పుష్య మాసంలో శుక్ల పక్ష ద్వాదశి నాడు (జనవరి 22) ఈ పవిత్రమైన కార్యక్రమం నిర్వహించారు. దీన్ని కూర్మ ద్వాదశిగా కూడా పిలుస్తారు. అయితే ఈ ఏడాది శుక్ల పక్ష ద్వాదశి ముందుగానే జనవరి 11న వచ్చింది. దీని ప్రకారం రామాలయం తొలి వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నారు.

దళిత క్రీడాకారిణిపై 62 మంది అత్యాచారం

» కేరళలో అయిదేళ్లుగా దారుణం.. 15 మంది అరెస్టు

పథనంథిట్ట, జనవరి 11: కేరళకు చెందిన ఓ దళిత క్రీడాకారిణిపై పలువురు అత్యాచారం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. 18 ఏళ్ల ఆ జిల్లా స్థాయి క్రీడాకారిణిపై గత అయిదేళ్లుగా కనీసం 62 మంది ఈ దారుణానికి పాల్పడినట్టు శనివారం పోలీసు వర్గాలు తెలిపాయి. ఇప్పటికే 15 మంది నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్టు పేర్కొన్నాయి. ఇందులో 40 మందిపై పోక్సో చట్టం కింద కేసులు పెట్టారు. ఆ బాలిక 13 ఏళ్ల వయసు ఉన్నప్పుడే ఆమెపై లైంగిక దాడి జరిగింది. పొరుగింటి వ్యక్తి ఒకరు బలవంతంగా ఆమెను కొండ పక్కన ఉన్న ఇంటి తీసుకువెళ్లి బూతు చిత్రాలు చూపించాడు. అనంతరం అతడు, అతని స్నేహితులు అత్యాచారం చేశారు. పోటీల నిమిత్తం వివిధ ప్రదేశాలకు వెళ్లినప్పుడు తోటి ఆటగాళ్లు, కోచ్‌లు కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. అయితే దీనిని ఇంతవరకు ఆమె తల్లిదండ్రులకు చెప్పలేదు. తండ్రి మద్యానికి బానిస కావడంతో పెద్దగా పట్టించుకోలేదు. ఆమె తన తండ్రి సెల్‌ఫోన్‌నే ఉపయోగించుకునేది. ఆ ఫోన్‌లోని కాంటాక్టు లిస్టులో ఉన్న వ్యక్తులే ఈ దారుణానికి పాల్పడినట్టు తేలింది. కేరళ మహిళా సమాఖ్య సొసైటీ వాలంటీర్లు ఇటీవల క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న క్రమంలో ఈ నేరం వెలుగులోకి వచ్చింది. దీనిపై జిల్లా శిశు సంక్షేమ కమిటీ కమిటీ చైర్మన్, న్యాయవాది ఎన్.రాజీవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నివేదిక ఇవ్వాలని మహిళా కమిషన్ రాష్ట్ర అధికారులను ఆదేశించింది.

మా వాళ్లే వదిలేయ్!

(మొదటి పేజీ తరువాయి)

ఆగమేఘాల మీద కదిలిపోతున్నారు. అవి తమ మనుషుల వాహనాలేనని, వాటిని వదిలేయాలంటూ స్వయంగా ఫోన్లు చేస్తున్నారు. ఇక ఆయన పేషీ అయితే మట్టి మాఫియా సేవలో తరించిపోతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో చిచ్చురేపుతున్న మట్టి మాఫియాకు సారథిగా సదరు మంత్రి వ్యవహరిస్తుండటం కలకలం రేపుతోంది.

విజిలెన్స్ విచారణకు మోకాలడ్డు

జగన్ జమానాలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైసీపీ నేతలు రెచ్చిపోయి అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. కొండలు, సాగు భూములు ఏవీ వదల్లేదు. ఇటు పర్యావరణానికి హాని చేయడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. వైసీపీ మాజీ మంత్రి కొడాలి నాని, గన్నవరం వైసీపీ నేత వల్లభనేని వంశీ ప్రధాన అనుచరులు ఈ మట్టి మాఫియాలో కీలకమని ప్రజలే బాహాటంగా చెబుతున్నారు. వీరి అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా నాడు తెలుగుదేశం పార్టీ ఎన్నో పోరాటాలు చేసింది. ఈ క్రమంలో ఎందరో టీడీపీ కార్యకర్తలు, నేతలు.. వైసీపీ నేతల చేతుల్లో దారుణమైన భౌతికదాడులకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నాడు వల్లభనేని వంశీ అనుచరులు కె.సతీష్, ఎల్.కిశోర్, కొడాలి నాని అనుచరులు భారీగా అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని ఫిర్యాదులు అందాయి. దీంతో అక్రమ మైనింగ్‌పై గనుల శాఖ విజిలెన్స్ దాడులు కొనసాగాయి. భారీగా మట్టి తవ్వకాలు జరిగాయని, ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు నష్టం చేకూర్చారని గనుల అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కె.సతీష్ మట్టి మైనింగ్‌పై రూ.35 కోట్లు.. కొడాలి నాని అనుచరుడి మైనింగ్‌పై రూ.40 కోట్లు పెనాల్టీ విధించేలా గనుల శాఖ నివేదికలు సిద్ధం చేసింది. అంతే.. సదరు మంత్రి వారిని కాపాడుతానని వైసీపీ నేతలకు అభయం ఇచ్చారు. విజిలెన్స్ విచారణను ముగించకుండా పెండింగ్‌లో పెట్టాలని, డిమాండ్ నోటీసులు తయారు చేయవద్దని గనుల అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నారు. దీంతో గత ఆరు నెలలుగా విచారణ సా..గుతూనే ఉంది. అది ఎప్పటికి పూర్తవుతుందో తెలియనంతగా మంత్రి ఒత్తిళ్ల పర్వం కొనసాగుతోంది.

విడదీయరాని బంధం

గన్నవరం నియోజకవర్గంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార సభ జరిగిన సంగతి తెలిసిందే. ఇందుకోసం పెద్ద ఎత్తున సభావేదికను ఏర్పాటు చేశారు. దీనికి వల్లభనేని వంశీ అనుచరులు కె.సతీష్, రఘు మట్టి, ఇతర వనరులు సమకూర్చిపెట్టారు. రఘు అనే వ్యక్తి రైల్వే వర్క్‌లకు మాత్రమే గ్రావెల్ తరలించాలి. అలాంటిది సీఎం ప్రమాణ స్వీకార సభకు ఆయనతో మట్టి తరలింపచేశారు. ఆ తర్వాత టీడీపీ మంత్రి తన పలుకుబడి ఉపయోగించి అందరికంటే ముందుగా ఈ ఇద్దరికి కలిపి రూ.4.8 కోట్ల బిల్లులు విడుదల చేయించారు. ఇదీ మంత్రి ఘనత. ఒకవైపు సతీష్ చేసిన అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ విచారణ కొలిక్కి రాకుండా చేయడంతో పాటు ప్రభుత్వంలో ఆయనకు రావాల్సిన బిల్లులు సత్వరమే విడుదల చేయించడం గమనార్హం.

తెరవెనుక సారథి ఆయనే..

కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు కె.సతీష్ అక్రమ మైనింగ్ ఆగడం లేదు. తిరువూరు నియోజకవర్గంలోని కొండపరలో 28 ఎకరాల భూమిలో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. దానికి గనుల శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదు. పర్యావరణ అనుమతులు కూడా లేవు. జగన్ జమానా నుంచి అప్రతిహతంగా మైనింగ్ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గత ఆరు నెలలుగా దర్జాగా మట్టి దోపిడీ సాగుతోంది. దీనికి కర్త, కర్మ, క్రియ సతీష్ అయితే, ఆయన్ను తెరవెనుక నడిపిస్తున్న సారథి టీడీపీ మంత్రినే. తిరువూరు నియోజకవర్గం కొండపర గ్రామంలో 28 ఎకరాల్లో అక్రమ మైనింగ్ చేస్తూ, నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలం చిల్లబోయినపల్లి గ్రామంలో మట్టితవ్వకాలు చేస్తున్నట్లుగా వాటికి ట్రాన్సిట్ పర్మిట్లు ఇప్పించారు. అంటే.. అక్రమంగా తవ్వుతున్నది కొండపరలో.. దానికి ట్రాన్సిట్ పర్మిట్లు చూపిస్తోంది చిల్లబోయినపల్లిలో. ఇటీవలి కాలంలో ఈ విషయం రచ్చకెక్కడంతో టీడీపీలోని కొందరు నేతలు అక్రమ మైనింగ్ వాహనాలను అడ్డుకొనే ప్రయత్నాలు చేశారు. గనుల శాఖ విజిలెన్స్ విభాగం కొన్ని వాహనాలను నిలిపివేసింది. రెవెన్యూ అధికారులు కొన్ని లారీలను సీజ్ చేశారు. వెంటనే సదరు మంత్రి రంగంలోకి దిగారు. 'ఆ లారీలు మా వాళ్లవే. వాటిని వదిలేయండి' అని రెవెన్యూ అధికారులకు మంత్రి నేరుగా ఫోన్ చేసి ఒత్తిడి చేశారు. 'అక్రమంగా మైనింగ్ చేసి తప్పుడు ట్రాన్సిట్‌లతో గ్రావెల్ సరఫరా చేస్తున్నారు. ఇందులో వైసీపీ నేత కె.సతీష్ పాత్ర ఉంది. లారీలు ఆయనవే. గతంలో ఈ వాహనాలనే వైసీపీ మాజీ మంత్రి కోసం తిప్పారు' అని మంత్రికి రెవెన్యూ అధికారి వివరించారు. దీంతో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'వైసీపీ ఏమిటి? టీడీపీ ఏమిటి? ఆ లారీలు మా వాళ్లవే. అతను మా మనిషే. వైసీపీ అని ఎవరు చెప్పారు నీకు? లారీలు వదిలేయ్. ఇంకోసారి ఈ సమస్య రావొద్దు' అని మంత్రి తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో అధికారులు మట్టి మాఫియా లారీలను వదిలేశారు. దీంతో గనుల శాఖ అధికారులు జోక్యం చేసుకొని ఆ తర్వాత ఆరు లారీలను పట్టుకున్నారు. ఈ సారి అంతే. మంత్రి, ఆయన పేషీ జోక్యం చేసుకుని ఆ లారీలు వదిలేయాలని ఒత్తిళ్లు చేశారు. దీంతో గనుల విజిలెన్స్ అధికారులు కూడా ఆ లారీలను విడిచిపెట్టారు.

సర్కారుకు రూ.2,026 కోట్ల నష్టం!

» ఢిల్లీ మద్యం విధానానికి లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం పొందలేదు

» మంత్రి మండలి అనుమతి కూడా లేదు

» స్పష్టం చేసిన కాగ్ నివేదిక!

» ఎన్నికల వేళ ఢిల్లీ రాజకీయాల్లో చిచ్చు!



న్యూఢిల్లీ, జనవరి 11: అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఢిల్లీ రాజకీయాల్లో మరోమారు 'మద్యం విధానం' చిచ్చు రేగింది. కేజ్రీవాల్ సర్కారు అమలు చేసిన కొత్త మద్యం విధానం-2021 వల్ల ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నిగ్గుతేల్చింది. వాస్తవానికి కేంద్ర బడ్జెట్‌కు ముందు విడుదలవ్వాల్సిన కాగ్ నివేదికలో.. లిక్కర్ పాలసీ వివరాలు లీకైనట్లు జాతీయ మీడియా కథనాలను ప్రసారం చేసింది. ఈ పాలసీ ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సర్కారు విఫలమైనట్లు కాగ్ స్పష్టంచేసింది. ఈ విధానం అమలుకు ముందు నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను అప్పటి ఉప ముఖ్యమంత్రి సిసోడియా నేతృత్వంలోని మంత్రుల బృందం విస్మరించిందని ఆక్షేపించింది. కీలక నిర్ణయాల విషయంలో మంత్రి మండలి, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం కూడా తీసుకోలేదని వెల్లడించింది. లైసెన్సుల జారీ, నిబంధనల విషయంలో ఉల్లంఘనలు జరిగినట్లు తెలిపింది. పలు ఫిర్యాదులున్నప్పటికీ.. ఆర్థిక స్థితిగతులను అంచనా వేయకుండానే.. అన్ని సంస్థలను వేలానికి అనుమతించినట్లు.. వాటి లైసెన్సులను పునరుద్ధరించినట్లు వివరించింది. కాగా.. ఈ మద్యం విధానం వ్యవహారంలో ఇప్పటికే సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో కేజ్రీవాల్, సిసోడియా తదితరులు అరెస్టు అయి, తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు.

రాజకీయాల్లో వాగ్యుద్ధం

వచ్చేనెల 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఢిల్లీలో ఇప్పుడు కాగ్ నివేదిక చిచ్చు రాజకీయాల్లో వాగ్యుద్ధానికి తెరతీసింది. అధికార ఆప్‌పై విపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విమర్శలు గుప్పించగా.. వాటిని ఆమ్ ఆద్మీ నేతలు తిప్పికొట్టారు. "కేజ్రీవాల్ విలాసవంతమైన అద్దాల మేడలో ఉంటారు. ప్రజలు మాత్రం మురికివాడల్లో నివసిస్తున్నారు" అని అమిత్‌షా విమర్శించారు. ఆప్ నేతల అవినీతిని కాగ్ నివేదిక బట్టబయలు చేసిందని నడ్డా అన్నారు. కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ కూడా ఈ అంశంపై తీవ్రంగా స్పందిస్తూ.. కేజ్రీవాల్ అవినీతికి పాల్పడ్డారనే విషయం స్పష్టమైందన్నారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఈ విమర్శలను తిప్పికొట్టారు. కాగ్ ఇంకా నివేదికను సమర్పించలేదని బీజేపీ స్వయంగా అంగీకరించిందని గుర్తుచేశారు. ఒకవేళ నివేదిక నిజమైతే.. అదెక్కడుందో చూపాలని బీజేపీ, కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు.

లోకం తీరు





అన్నవరం ఆలయం వద్ద జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ జ్యోతిర్మయి

సత్యదేవుని సన్నిధిలో న్యాయమూర్తులు

అన్నవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో కలిసి శనివారం స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం, ఈవో స్వామివారి మెమెంటో, ప్రసాదం అందజేశారు.

అనకాపల్లి జిల్లాలో భూములు పరిశీలించిన అనిల్ అంబానీ

- సోలార్ ప్యానళ్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం



అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలో ఏపీఐఐసీ భూములను పరిశీలిస్తున్న అనిల్ అంబానీ. చిత్రంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

అనకాపల్లి/రాంబిల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ గ్రూపు సంస్థల అధినేత అనిల్ అంబానీ శనివారం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం లాలంకోడూరు పంచాయతీ పరిధిలోని సీతపాలెం, సెటమెట్ట గ్రామాల పరిసరాల్లోని భూములను పరిశీలించారు. సోలార్ ప్యానళ్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు కోసం అనిల్ అంబానీ ఈ ప్రాంతాన్ని సందర్శించినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఏపీఐఐసీ గతంలో సేకరించిన 1,500 ఎకరాలను అనిల్ అంబానీ విద్యుత్ సంస్థకు కేటాయించనున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ భూములను, సముద్ర తీర ప్రాంతాన్ని అనిల్ అంబానీ పరిశీలించారు. ఆయన వెంట ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, అనకాపల్లి ఆర్డీఓ ఆయుషా, ఏపీఐఐసీ జెడ్ఎం హరిప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గులాబీ రంగులో.. క్యాలీఫ్లవర్



గులాబీ రంగులో కనిపిస్తున్న ఈ పువ్వు.. క్యాలీఫ్లవర్. సాధారణంగా తెలుపు-పసుపు కలిసిన రంగులో క్యాలీఫ్లవర్‌లు కనిపిస్తుంటాయి. అయితే అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో ఈ రంగు క్యాలీఫ్లవర్లు సాగుచేస్తున్నారు. రాజుపాకలుకు చెందిన అభ్యుదయ రైతు డిల్లీ నుంచి ఈ రంగు క్యాలీఫ్లవర్ మొక్కలను తెచ్చారు. వాటిని గ్రామ మాజీ సర్పంచ్ సాగిన దేవుడమ్మ కుమారుడు నాగార్జున సాగు చేశారు. ప్రస్తుతం ఈ క్యాలీఫ్లవర్స్ కోతకు వచ్చాయి. గులాబీ రంగులో ఉన్న ఈ క్యాలీఫ్లవర్లను జనం ఆసక్తిగా తిలకిస్తున్నారు. - చింతపల్లి, ఆంధ్రజ్యోతి



శ్రీవారి ఆలయం ముందు సాధారణంగానే కనిపిస్తున్న భక్తులు



పుష్కరిణిలో సుదర్శన చక్రత్తాళ్వార్‌ను మునక వేయిస్తున్న అర్చకులు

60 వేల మందికి శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం

- తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి రోజైన శుక్రవారం 60,094 మందికి తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం లభించింది. శుక్రవారం వేకువజామున 3.50 గంటల నుంచి ఉదయం 8.15 గంటల వరకు ప్రముఖులకు దర్శనం కల్పించిన టీటీడీ.. ఆ తర్వాత సాధారణ భక్తులను వైకుంఠద్వార దర్శనానికి అనుమతించింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 60,094 మంది శ్రీవారిని ఉత్తర ద్వారంగుండా దర్శించుకున్నారు. 14,906 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. ఇక, శనివారం ద్వాదశిని పురస్కరించుకుని కూడా శ్రీవారి దర్శనాలు సాఫీగా జరిగాయి. ద్వాదశి సందర్భంగా వేకువజామున శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నాన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. వాస్తవానికి వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో భక్తుల రద్దీతో తిరుమల కిటకిటలాడుతుంది. అయితే, ఈసారి తిరుపతిలో టోకెన్ల జారీకి ముందు జరిగిన తొక్కిసలాటతో చాలా మంది భక్తులు తిరుమల పర్యటన వాయిదా వేసుకున్నట్టు తెలుస్తోంది. గతేడాది వైకుంఠ ఏకాదశితో పోలిస్తే 7,812 మంది భక్తులు తక్కువగా శ్రీవారిని దర్శించుకున్నారు. ఏకాదశి రోజు మధ్యాహ్నం నుంచే తిరుమలలో రద్దీ తగ్గిందని అధికారులు తెలిపారు.

'తొక్కిసలాట' బాధితులకు నేడు పరిహారం చెక్కుల పంపిణీ

- 2 కమిటీలుగా ఏర్పడిన టీటీడీ బోర్డు
- విశాఖ, నర్సీపట్నానికి ఒక బృందం
- కేరళ, తమిళనాడుకు మరో బృందం

తిరుమల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు ఆదివారం పరిహారం అందించనున్నారు. ఈ మేరకు టీటీడీ పాలక మండలి ఏర్పాట్లు చేసింది. శనివారం మధ్యాహ్నం తిరుమలలోని తన క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో బోర్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. మృతుల కుటుంబాలను స్వయంగా కలసి పరిహారం చెక్కులను అందించేందుకు బోర్డు సభ్యులతో రెండు కమిటీలను ఏర్పాటు చేశారు. విశాఖ, నర్సీపట్నం ప్రాంతాలకు చెందిన బాధిత కుటుంబాలను ఓ బృందం పరామర్శించనుంది. ఈ బృందంలో బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, జంగా కృష్ణమూర్తి, పనబాక లక్ష్మి, జానకీదేవి, మహేందర్ రెడ్డి, ఎంఎస్ రాజు, భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు. ఇక తమిళనాడు, కేరళలకు చెందిన భక్తుల కుటుంబాలను పరామర్శించి పరిహారం అందించే కమిటీలో రామమూర్తి, కృష్ణమూర్తి వైద్యనాథన్, నరేశ్‌కుమార్, శాంతారాం, సుచిత్ర ఎల్లా ఉన్నారు. వీరు ఆయా ప్రాంతాల్లోని మృతుల కుటుంబాల వద్దకు వెళ్లి రూ.25 లక్షల చెక్కులను అందించనున్నారు. ప్రతి కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగంతో పాటు టీటీడీ సంస్థల్లో ఉచిత విద్యను అందించడానికి సంబంధిత కుటుంబాల ఉద్యోగ, విద్యా వివరాలను కూడా సేకరిస్తారు. ఇక, తొక్కిసలాటలో గాయపడిన భక్తులకు రూ.5 లక్షలు, పాక్షికంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు చొప్పున పరిహారం అందించనున్నారు.

విజ్ఞాన్స్ లారా విద్యార్థినికి అమెజాన్‌లో రూ.40 లక్షల వార్షిక వేతనం



విద్యార్థిని రేణును అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థిని బయ్యన రేణు అక్షయకు అమెజాన్ కంపెనీలో రూ.40 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని రేణు అక్షయ తల్లిదండ్రులు డాక్టర్ బి.రాజీవ్, పద్మను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ విద్యార్థినిగా విజ్ఞాన్స్ లారాలో అడ్మిషన్ సాధించి నేడు అమెజాన్‌లో రూ.40 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగానికి ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్, ఉపాధి కల్పనాధికారులు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- తిరుపతిలో తొక్కిసలాటకు ప్రభుత్వానిదే బాధ్యత
- ఫిబ్రవరిలో నెల్లూరులో సీపీఎం రాష్ట్ర మహాసభలు: శ్రీనివాసరావు



సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, ఇతర నాయకులు

నెల్లూరు(వైద్యం), జనవరి 11(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను శనివారం నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చటంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. తిరుమలలో తొక్కిసలాట, మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని.. కింది స్థాయి అధికారులను బలి చేయడం సరికాదని చెప్పారు. ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో నెల్లూరులో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, జయప్రదం చేయాలని కోరారు.

రిజిస్ట్రేషన్లకు 'బ్లాక్ చెయిన్' సాంకేతికత

- వ్యవస్థల ఏకీకరణతో సురక్షిత లావాదేవీలు
- ఫిబ్రవరి చివరి నాటికి అందుబాటులోకి
- నకిలీల బెడద తగ్గనుందని సర్కారు అంచనా

భూముల సమాచారం కోసం మొబైల్ యాప్

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ప్రయోగాత్మక ప్రాతిపదికన మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నారు. ఫిబ్రవరి చివరి నాటికి ఇది అందుబాటులోకి రానుంది. అలాగే, భూముల రిజిస్ట్రేషన్లను మరింత సురక్షితం, సులభతరం చేసేందుకు బ్లాక్ చెయిన్ సాంకేతికతను వినియోగించుకోనున్నారు. ఈ సాంకేతికత ఆధారంగా కార్డు 2, కార్డు 2.0 సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి టెండర్లు పిలుస్తున్నారు. ఇది అందుబాటులోకి రావడానికి 6 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అలాగే, ప్రాంత(లొకేషన్) ఆధారిత పార్సిల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను కొత్తగా అమల్లోకి తెస్తున్నారు. దీనివల్ల ఒక భూమికి సంబంధించి వివిధ శాఖల్లో ఉన్న సమాచారం మొత్తం ఒకే చోట తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా భూముల లావాదేవీలు, రిజిస్ట్రేషన్లలో కచ్చితత్వం పెరుగుతుంది. సర్వే ఆఫ్ ఇండియా, ఉపగ్రహ చిత్రాలు, డీటీసీపీ జాబితా, మునిసిపల్, సర్వే విభాగం, ఎఫ్ఎంబీ, బ్యాంకుల్లో ఉన్న సమాచారం, సదరు భూమి చిత్రాలు ఒకే చోట కనిపిస్తాయి. దీంతో వాటిలో కచ్చితత్వాన్ని బేరీజు వేసుకోవచ్చు. అలాగే, ఫోన్‌లో కూడా ఎవరి భూముల వివరాలు వారు తెలుసుకునేలా యాప్ రూపొందిస్తున్నారు. ఒక భూమి దగ్గరికి వెళ్లి ఆ యాప్ ఓపెన్ చేస్తే దాని ప్రాథమిక వివరాలు తెలిసేలా యాప్ రూపొందిస్తున్నారు. ఆ వ్యక్తి ఆధార్ నెంబర్ లేదా ఇతర వివరాలు యాప్‌లో పేర్కొనడం ద్వారా సదరు భూమికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. వ్యవస్థల ఏకీకరణ(సిస్టమ్స్ ఇంటిగ్రేషన్) విధానాన్ని కూడా అమల్లోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. దీని ప్రకారం భూములకు సంబంధించి ప్రతి ప్రభుత్వ శాఖలో ఉన్న సమాచారం ఒకే చోట అందుబాటులోకి వస్తుంది. అన్ని శాఖల ఆమోదంతో ఈ ప్రాజెక్టుపై ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. దీనివల్ల ప్రజలకు అందించే సేవల్లో కచ్చితత్వం పెరుగుతుందని, నకిలీ రిజిస్ట్రేషన్ల బెడద తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



దుండగులు కంకర కోసం తవ్వేసిన రోడ్డు

రాజధానిలో మట్టి దొంగలు!

- కృష్ణాయపాలెం-శాఖమూరు రోడ్డు తవ్వేసిన దుండగులు
- రెండ్రోజులుగా కంకర తరలిస్తున్నా పట్టించుకోని అధికారులు

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మళ్లీ దొంగలు చెలరేగిపోయారు. రెండు రోజులుగా లారీలు, పొక్లెయిన్‌లతో మంగళగిరి మండలం కృష్ణాయపాలెం-శాఖమూరు మీదుగా అనంతవరం వెళ్లే రోడ్డు తవ్వుకుని కంకర తరలించుకుపోతున్నారు. ఈ విషయాన్ని గమనించిన పశువుల కాపరులు రైతులకు తెలియజేశారు. గుర్తు తెలియని కొందరు పొక్లెయిన్లు, లారీలతో వచ్చి రోడ్డును తవ్వుకుని కంకర ఎత్తుకుపోయారని వారు రైతులకు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఇలా మట్టి, కంకర దొంగతనం జరగడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, సీఆర్డీఏ అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగానే ఈ దోపిడీలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దాదాపు 200 మీటర్ల మేర 3 అడుగుల లోతున రోడ్డు తవ్విన దుండగులు, 25-30 టిప్పర్లతో మట్టి, కంకర దోచుకుపోయారు. యువనేత, లోకేశ్ సొంత నియోజకవర్గంలో ఈ ఘటన జరగడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వంలోనూ అక్రమార్కులు ఇలా చెలరేగిపోవడానికి ప్రభుత్వ ధోరణి, అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యమే కారణమని రైతులు భావిస్తున్నారు.

పోలవరాన్ని సందర్శించిన పార్లమెంటరీ కమిటీ

అమరావతి, ఏలూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుల బృందం శనివారం పరిశీలించింది. స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాజీవ్ ప్రతాప్ రూడీ నేతృత్వంలో 11 మంది ఎంపీలు, 27 మంది ఇంజనీర్లు ఉదయం 11.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గాన ప్రాజెక్టుకు చేరుకున్నారు. ఉదయాన్నే పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ వెంకట ప్రతాప్ శివకిశోర్, జేసీ ధాత్రిరెడ్డి వారికి స్వాగతం పలికారు. స్టాండింగ్ కమిటీకి పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను మంత్రి నిమ్మల వివరించారు. అనంతరం జిల్లా అధికారులు, ప్రాజెక్టు ఇంజనీర్లతో ప్రాజెక్టు కార్యాలయంలో కమిటీ సమావేశమయింది. సమావేశం అనంతరం కమిటీ పోలవరం ప్రాజెక్టులో స్పిల్ వే, ఎగువ కాపర్ డ్యాం, డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రాంతం, వైబ్రో కాంపాక్షన్ పనులు పరిశీలించారు. ఈ బృందానికి ప్రాజెక్టు పనుల ప్రగతి, సంబంధిత వివరాలను సీఈ నరసింహమూర్తి వివరించారు.



ప్రాజెక్టు ఫొటో ప్రదర్శనను పరిశీలిస్తున్న పార్లమెంటు స్టాండింగ్ కమిటీ బృందం

2027 నాటికి పూర్తి చేస్తాం: మంత్రి నిమ్మల

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2027 సెప్టెంబరుకు పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ప్రాజెక్టు నిర్మాణం 20 ఏళ్ల వెనక్కి పోయింది. గతంలో టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రాజెక్టు నిర్మాణంలో పనులు 72 శాతం పూర్తి అయ్యాయి. 18 నెలలపాటు కష్టపడి డయాఫ్రం వాల్ నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వ అలసత్వం వల్ల ధ్వంసమైంది. సీఎం చంద్రబాబు ఇచ్చిన గడువు ప్రకారం డయాఫ్రం వాల్ కాంక్రీట్ పనులు చేపడతాం. 2017లో నిర్వాసితులకు అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు రూ.800 కోట్లు పరిహారం అందించారు. ప్రస్తుతం మళ్లీ అధికారంలోకి వచ్చిన తక్కువ వ్యవధిలోనే మరో రూ.800 కోట్లకు పైగా నిధులు అందించింది చంద్రబాబే. వైసీపీ పాలనలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేకపోయారు.' అని మంత్రి నిమ్మల విమర్శించారు.

రాష్ట్రంలో తొలిసారిగా మూర్ఛకు శస్త్రచికిత్స

- నారాయణ ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహణ.. ప్రతి నెలా నాలుగో గురువారం ఉచిత సేవలు



విలేకరులతో మాట్లాడుతున్న వైద్య నిపుణులు

నెల్లూరు(వైద్యం), జనవరి 11(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రాష్ట్రంలోనే తొలిసారిగా మూర్ఛవ్యాధికి వీగల్ నర్వ్ స్టిములైజేషన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు వైద్య నిపుణులు వెల్లడించారు. శనివారం నగర శివార్లలోని నారాయణ ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సంపత్‌కుమార్, న్యూరోసర్జన్ డాక్టర్ సాయికిరణ్ మాట్లాడారు. తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన సాయిపల్లవి(16) పుట్టుకతోనే మూర్ఛవ్యాధితో బాధపడుతూ, 12 ఏళ్లుగా వివిధ ఆసుపత్రులకు తిరిగినా ఫలితం లేక నారాయణ ఆసుపత్రిని సంప్రదించారని చెప్పారు. ఆమె వ్యాధిని రీఫ్లక్స్ ఎపిలెప్సీగా నిర్ధారించామన్నారు. ఈ నేపథ్యంలో సత్వర ఉపశమనం కోసం వీగల్‌నర్వ్ స్టిమిలైజేషన్ అనే ఆధునిక విధానం ద్వారా శస్త్ర చికిత్స నిర్వహించామని తెలిపారు. ఈ చికిత్స రాష్ట్రంలోనే మొదటిదని వెల్లడించారు. ఆసుపత్రి అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ మాట్లాడుతూ మెట్రో నగరాల్లో రూ.లక్షలు ఖర్చయ్యే ఈ వ్యాధికి సీఎంఆర్ఎఫ్ ద్వారా శస్త్రచికిత్స నిర్వహించామన్నారు. నారాయణ ఆసుపత్రిలో ప్రతి నెలా నాలుగో గురువారం ఉచిత వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం 96401 00555 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో న్యూరో అనస్థలిస్ట్ డాక్టర్ అనిల్, ఏజీఎం శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగిపై దాడికి యత్నించిన చిరుత

తిరుపతి(నేరవిభాగం), జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఓ చిరుత దాడికి ప్రయత్నించడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న టీటీడీ ఉద్యోగి గాయాలపాలయ్యారు. తిరుపతి రూరల్ మండలం పేరూరుకు చెందిన డి.మునికుమార్ తిరుమల అశ్విని ఆస్పత్రిలో ఎంఎన్‌వోగా పని చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 1.10 గంటలకు ఇంటి నుంచి విధులకు బయల్దేరారు. చెర్లోపల్లి రోడ్డులోని వేదిక్ వర్సిటీ వద్దకు రాగానే చెట్టుపై నుంచి చిరుత ఒక్కసారిగా కిందకు దూకింది. భయపడిన మునికుమార్ ద్విచక్ర వాహనం నుంచి కిందపడ్డారు. అదే సమయంలో వాహనాలు, జనం రోడ్డుపైకి చేరడంతో చిరుత అడవిలోకి వెళ్లిపోయింది. మునికుమార్‌ను చికిత్స నిమిత్తం స్విమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

▪ ఆర్కే RK



కొత్తపలుకు

భయ భక్తులు ఉన్నాయా?

తిరుపతిలో రెండు రోజుల క్రితం జరిగింది ఏమిటి? ఇప్పుడు జరుగుతున్నది ఏమిటి? ఒక పోలీసు అధికారి సదుద్దేశంతో అయినప్పటికీ అనాలోచితంగా గేట్లు తెరవడంతో... వైకుంఠ ద్వార దర్శనానికి టోకెన్ల కోసం భక్తులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందారు. కుంభమేళాలు, పుష్కరాల సందర్భంగా తొక్కిసలాటలు జరిగి పలువురు మరణించిన సంఘటనలను గతంలో కూడా చూశాం. కాకపోతే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఆరుగురు చనిపోవడం తిరుమల–తిరుపతి చరిత్రలో ఇదే ప్రథమం! దీంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హుటాహుటిన తిరుపతి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఇంతవరకు ఎవరికీ అభ్యంతరం లేదు. తొక్కిసలాట సంఘటన తర్వాత జరిగిన సన్నివేశాలు మాత్రం జుగుప్సాకరంగా ఉన్నాయి. కొండ మీద ఏం జరుగుతోంది? అన్న సందేహాలు తలెత్తాయి. ఈ సందర్భంగా రాజకీయాలు, వ్యక్తుల

> ఒక సంఘటన జరిగినప్పుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారన్న అభిప్రాయం ప్రబలితే దాని ప్రభావం పాలనా యంత్రాంగంపై ఉంటుంది. ఎవరి ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలన్న సందేహం అధికారుల్లో ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని కొంతమంది అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంటుంది. సంకీర్ణ ధర్మానికి అందరూ కట్టుబడి ఉంటే ఏ గొడవా ఉండదు. పవన్ కల్యాణ్ జనసేన అధినేత కనుక ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విధేయుడిగా ఉండాలని భావించలేని పరిస్థితి. ప్రస్తుతం తలెత్తిన ఈ సున్నితమైన సమస్య మున్ముందు కూటమి సఖ్యతపై ప్రభావం చూపకూడదనుకుంటే... ప్రస్తుత దశలోనే పరిష్కారం కనుగొనాలి.

మధ్య వైషమ్యాలు బయటపడటం శోచనీయం. తిరుమలలో ఆ దేవదేవుడికి సేవ చేసుకొనే అవకాశం లభించడాన్ని మహా భాగ్యంగా పరిగణించాలి. అయితే, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని భావించాల్సిన సన్నివేశాలు చోటుచేసుకోవడమే అసలైన విషాదం. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే తిరుమల తిరుపతి పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్యామలరావు గొడవపడ్డారు. బాధ్యతాయుతమైన స్థానాలలో ఉన్న వారి మధ్య భేషజాలు ఏర్పడి భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయమై సమన్వయం కొరవడినట్టు స్పష్టమవుతోంది. కీలక పదవులలో ఉన్న వారి మధ్య ఆధిపత్య పోరు జరుగుతుండటం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది.

భయం లేదా...

సాక్షాత్తూ ముఖ్యమంత్రి సమక్షంలోనే గొడవపడటానికి చైర్మన్‌కూ, ఈవోకూ ఎంత ధైర్యం ఉండాలి? జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు ఎదురుగా కూర్చోవడానికి కూడా అధికారులు జంకేవారు. తొలిసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన జగన్ వద్దనే అంతగా భయభక్తులు ప్రదర్శించిన అధికారులు పద్నాలుగేళ్లకు పైగా ముఖ్యమంత్రిగా వ్యవహరించిన చంద్రబాబు వద్ద ఎలా మెలగాలి? అలాంటిది ముఖ్యమంత్రి అంటే లెక్కలేనట్టుగా వ్యవహరించడమేమిటి? తిరుమలలో ఉన్నత స్థాయిలో సమన్వయం కొరవడిందని, వైషమ్యాలు పరాకాష్ఠకు చేరాయన్న విషయం ప్రభుత్వానికి ముందుగా తెలియదా? టీటీడీ ఈవో పదవి చేపట్టాలని ఐఏఎస్ అధికారులు పోటీపడుతుంటారు. పాలక మండలి చైర్మన్ పదవికి ఎంత గిరాకీ ఉంటుందో అందరికీ తెలిసిందే. ఈ పదవులకు ఎందుకంత డిమాండ్? దేవుడిపై భక్తితోనా? లేక.. శ్రీవేంకటేశ్వరుడి దర్శనానికి వచ్చే ప్రముఖులతో పరిచయాలు పెంచుకొని తద్వారా తమ పలుకుబడి పెంచుకోవడానికా? అన్నది ఇక్కడ కీలకం. నిజానికి అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు మాత్రమే దేవుడిపై భక్తి ఉంటుంది. ఆ దేవుడి పుణ్యమా అని కొండమీద కొలువులు దక్కించుకున్న వారిలో కొందరికి దేవుడిపై అంతగా భక్తి ఉన్న దాఖలాలు లేవు. నిజంగా దేవుడిపై భక్తి ఉన్నా, పాప పుణ్యాలపై నమ్మకం ఉన్నా కొండ మీద చేతి వాటాలు జరగవు కదా? దేవుడిపై నమ్మకంతో భక్తులు సమర్పించే కానుకలపై ఆధారపడి జీతభత్యాలు పొందుతున్న వారిలో ఎంత మందిలో నిజమైన భక్తి ఉంది? అంటే చెప్పడం కష్టం. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుల పోస్టులకు కూడా డిమాండ్ పెరిగింది. పాలక మండలి సభ్యుడి పోస్టు కోసం రూ.10 నుంచి 20 కోట్లు ఖర్చు చేయడానికి కూడా వెనుకాడని వారు ఉన్నారంటే ఎలా అర్థం చేసుకోవాలి? దేవుడిపై నిజమైన భక్తితో కొందరు ఆ పోస్టును ఆశిస్తుండగా, అత్యధికులు మాత్రం దీన్ని ఒక స్టేటస్ సింబల్‌గా పరిగణిస్తున్నారు. సొంత పలుకుబడి పెంచుకోవడానికి దాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలోనే చైర్మన్, ఈవో, జాయింట్ ఈవో పోస్టులకు భారీ ఎత్తున లాబీయింగ్ జరుగుతుంది. కేవలం ఆ దేవ దేవుడి మీద భక్తితో మాత్రమే అయితే ఆధిపత్య పోరుకు దిగకూడదు కదా? దేవుడి సేవలో తరించాలి కదా! భగవంతుడి సన్నిధిలో పెత్తనం చేయాలనుకోవడం ఏమిటి? తామే పెత్తనం చేయాలన్న పట్టుదలలు పెరగడం వల్లనే అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆ దేవుడే లేకపోతే చైర్మన్, ఈవో పోస్టులు ఎక్కడివి అన్న స్పృహ ఉండాలి కదా!


పెద్ద గుళ్లకే డిమాండ్...

ప్రజలలో భక్తి పెరగడం వల్ల తిరుమలలోనే కాదు అన్ని దేవాలయాల వద్దా రద్దీ ఏర్పడుతోంది. భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ పదవుల పోటీ కూడా పెరుగుతోంది. భక్తుల ఆదరణ కొరవడి ధూప దీప నైవేద్యాలకు దిక్కులేని గుళ్లు ఎన్నో ఉన్నాయి. వాటి పదవులకోసం ఎవరూ ఎందుకు పోటీ పడరు? దేవుడిపై నిజంగా భక్తి ఉంటే ఆ గుళ్లను అభివృద్ధి చేయడానికి పోటీ పడవచ్చుకదా! 'తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది... డ్రైనేజీ స్కీము లేక డేంజరుగా మారుతోంది' అని కవి గజ్జెల మల్లారెడ్డి ఎప్పుడో చెప్పారు. ఇప్పుడు భక్తిరసం వరదలై పారుతోంది. కారణాలు ఏవైనా ప్రజల్లో భక్తి భావం పెరుగుతుండటం వల్ల ప్రవచనకారుల సంఖ్య కూడా పెరుగుతోంది. డొక్కశుద్ధి, వాక్‌శుద్ధి లేని వారు కూడా ఒళ్లంతా బొట్లు పెట్టుకొని ప్రజల్లో మూఢ భక్తిని ప్రేరేపిస్తున్నారు. ఫలానా నూనెతో దీపం వెలిగించాలి.. అప్పుడే ఇష్టవాంఛ నెరవేరుతుందని చెబుతున్నారు. ఫలానా విధంగా పూజలు చేయాలని ఏ శాస్త్రంలో రాశారు? చిత్తం శివుడి మీద, భక్తి చెప్పుల మీద అన్నట్టుగా పరిస్థితి తయారైంది. పవిత్ర మనసుతో దేవుడికి మనసులో దండం పెట్టుకుంటే ఆ దేవుడు కనికరించడా? భక్తి అనేది ఇప్పుడు ప్రధాన వ్యాపారంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలోనే ప్రవచనకారుల మధ్య కూడా వైషమ్యాలు ఏర్పడుతున్నాయి. అపారమైన విద్వత్ కలిగిన గరికపాటి నరసింహారావు వ్యక్తిగత జీవితం గురించి జరిగిన ప్రచారం కూడా ఈ కోవలోకే వస్తుంది. అహాన్ని వదులుకోలేని వారికి భక్తులకు బోధించే అర్హత ఉంటుందా? అసూయను వళ్లంతా నింపుకొని ఎన్ని సుద్దులు చెబితే మాత్రం ఏమి ప్రయోజనం? ధర్మ నిష్ఠ లేనప్పుడు ఎంత భక్తిని ప్రదర్శించినా ఏమిటి ప్రయోజనం? ప్రజల్లో స్వార్థ కాంక్షను తగ్గించలేని ప్రవచనాల వల్ల ఎవరికి ప్రయోజనం? ఇప్పుడు అసలు విషయానికి వద్దాం!

మరణ రాజకీయం...

తిరుపతిలో జరిగిన విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి అంత్యక్రియలు కూడా పూర్తి కాకముందే రాజకీయాలు రంగ ప్రవేశం చేశాయి. విషాదానికి బాధ్యత మీదంటే మీదంటూ పాలక మండలి – అధికారుల మధ్య వివాదం మొదలైంది. సందట్లో సడేమియా అన్నట్టుగా జగన్‌రెడ్డితో పాటు ఆయన రోత మీడియా యథావిధిగా విషప్రచారం మొదలుపెట్టింది. చనిపోయినవారు చనిపోగా మిగతా భక్తులు ప్రశాంతంగా వైకుంఠ ఏకాదశి రోజున ఆ దేవదేవుడి దర్శనం చేసుకొని తరించారు. కానీ... ఆధిపత్య పోరు మాత్రం తగ్గలేదు. జరిగిన విషాదానికి నైతిక బాధ్యత తీసుకొని భక్తులకు క్షమాపణలు చెప్పడంలో కూడా వివాదమేనా? ముఖ్యమంత్రి సమక్షంలోనే గొడవపడిన చైర్మన్, ఈవో అంతటితో తగ్గలేదు. శుక్రవారం నాడు జరిగిన పాలక మండలి అత్యవసర సమావేశంలో కూడా విభేదాలు బయటపడ్డాయి. దీనికితోడు తొక్కిసలాటలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్న మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని చైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యానించడంతో దాని ప్రభావం కూటమి ప్రభుత్వంపై పడింది. ఎవరో ఏదో అన్నారని క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నట్టుగా చైర్మన్ వ్యాఖ్యానించడంతో జనసైనికులు నొచ్చుకున్నారు. నిజానికి పవన్ కల్యాణ్ చేసిన సూచనలో తప్పు లేదు. జరిగిన దానికి నైతిక బాధ్యత వహిస్తూ క్షమాపణలు చెప్పడం హుందాగానే ఉంటుంది. కారణం తెలియదుగానీ, చైర్మన్ తొలుత క్షమాపణలు చెప్పడానికి నిరాకరించి.. తర్వాత సర్దుకున్నారు. తిరుమలలో చైర్మన్, ఈవో, అదనపు ఈవోల మధ్య సఖ్యత కొరవడిన విషయం ప్రభుత్వానికీ తెలుసు. సంఘటన జరిగిన రోజు తిరుపతి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆద్యంతం సీరియస్‌గానే ఉన్నారు. బాధితులను పరామర్శించిన తర్వాత సమీక్ష సందర్భంగా పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి 'మీ మధ్య మాటలు కూడా ఉండనట్టుగా ఉంది' అని చైర్మన్, ఈవోను ఉద్దేశించి అన్నారు. ఆ తర్వాత కూడా వారిరువురూ తన సమక్షంలోనే వాదులాడుకోవడంతో ముఖ్యమంత్రికి చిర్రెత్తుకొచ్చింది. పరిస్థితిని చక్కదిద్దకపోతే టీటీడీ ప్రతిష్ఠ దెబ్బ తింటుందని చంద్రబాబు అభిప్రాయపడినట్టు తెలిసింది. తన మంచితనాన్ని అలుసుగా తీసుకుంటున్నారని ఆయన మంత్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పాలక మండలికి, అధికారులకు మధ్య వివాదాలు ఏర్పడటం కొత్త కాదు. అయితే ఇప్పుడు పరిస్థితి చేయిదాటి పోయింది. పాలనా వ్యవహారాలన్నింటినీ చైర్మన్ కార్యాలయం ఆధ్వర్యంలోకి తీసుకోబోతున్నట్టు బీఆర్ నాయుడు ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. దర్శనాలకు సంబంధించిన సిఫారసుల విషయంలోనే అధికారులతో పాలక మండలి సభ్యులకు గొడవలు వస్తుంటాయి. లెక్కకు మించి సిఫారసులు చేయడంపై అధికారులు అభ్యంతరం చెబుతున్నారు. దీంతో కొంత మంది పాలక మండలి సభ్యులు, ముఖ్యంగా ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితోపాటు బీజేపీకి చెందిన భానుప్రకాశ్‌రెడ్డి ప్రభృతులు చైర్మన్ నాయుడును ప్రభావితం చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు. శుక్రవారం నాటి సమావేశంలో భానుప్రకాశ్ రెడ్డి కల్పించుకొని 'ఏమిటి.. తమాషాలు చేస్తున్నారా?' అని ఈవో శ్యామలరావును ఉద్దేశించి పరుషంగా వ్యాఖ్యానించారు. పాలక మండలి సభ్యుల సిఫారసు లేఖలలో కొన్నింటిని అధికారులు తిరస్కరించడం కొత్త కాదు. గతంలో కూడా జరిగింది. ధర్మారెడ్డి ఈవోగా ఉన్నప్పుడు అధికారాలు అన్నీ ఆయన వద్దే కేంద్రీకృతమై ఉన్నప్పటికీ ఎవరూ కిమ్మనలేదు. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. పాలక మండలిలో కూడా తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు చెందిన సభ్యులు ఉన్నారు. ఈ కారణంగా వారు అవసరానికి, పరిమితికి మించి స్వేచ్ఛను తీసుకుంటున్నారు. ఇతర పార్టీల సభ్యులపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా అదుపు ఉండటం లేదు. అధికారులకు కూడా దిక్కుతోచడం లేదు. నిర్ణయాలన్నీ తమకు చెప్పిన తర్వాత మాత్రమే తీసుకోవాలని అధికారులపైన పాలక మండలి ఒత్తిడి తెస్తోంది. సీనియర్ అధికారులమైన తమపై సభ్యుల పెత్తనం పెరిగిపోవడం ఏమిటి? అని అధికారులు

> కొండ మీద ఆధిపత్య పోరువల్ల సామాన్య భక్తులు బలి కాకూడదు. పదవులలో ఉన్న వారికి దేవుడిపై నిజంగా భక్తి ఉంటే భేషజాలను వెంటనే వదులుకోవాలి. ఆ దేవుడే లేకపోతే మనమూ లేము– మన పదవులూ లేవన్న వాస్తవాన్ని గుర్తించి మెలుగుతారని ఆశిద్దాం!



గుర్రుగా ఉంటున్నారు. దీంతో అధికారులకు, పాలక మండలికి మధ్య సమన్వయం కొరవడింది. నిజానికి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లకు సంబంధించి జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఈవో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. అయినా తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా యంత్రాంగంతో జరిపిన సమావేశాల గురించి తనకు మాట మాత్రమైనా చెప్పలేదని చైర్మన్ నాయుడు ఆగ్రహంగా ఉన్నారు. టీటీడీ చట్టం ప్రకారం పాలక మండలికి విశేష అధికారాలు ఉన్నాయి. అయితే, ఇప్పటి వరకు పాలక మండలి అనేది విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం వరకే పరిమితం అయింది. ఈ కారణంగానే ఈవోలుగా నియమితులైన సీనియర్ అధికారులు తమ విధులను సజావుగా నిర్వహించగలిగారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఫలితమే తాజా వివాదాలు. జరిగిన దానికి అధికారులు బాధ్యత తీసుకోవాలా? పాలక మండలి తీసుకోవాలా? అన్న వివాదం కొత్తగా తలెత్తింది. చట్టంలోని ఒక నిర్దుష్టమైన సెక్షన్ ప్రకారం పాలక మండలికి సర్వాధికారాలు ఉన్నందున ఈవోలుగా సీనియర్ అధికారులను నియమించడం అనవసరం. ఆర్డీవో స్థాయి అధికారిని నియమిస్తే సరిపోతుంది. అయితే దీనివల్ల పాలక మండలి సభ్యుల పెత్తనం పెరిగిపోయి దేవస్థానం పాలనా వ్యవహారాలు అదుపు తప్పే ప్రమాదం ఉంది.

> నిజానికి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లకు సంబంధించి జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఈవో పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. అయినా తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా యంత్రాంగంతో జరిపిన సమావేశాల గురించి తనకు మాట మాత్రమైనా చెప్పలేదని చైర్మన్ నాయుడు ఆగ్రహంగా ఉన్నారు. టీటీడీ చట్టం ప్రకారం పాలక మండలికి విశేష అధికారాలు ఉన్నాయి. అయితే, ఇప్పటి వరకు పాలక మండలి అనేది విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం వరకే పరిమితం అయింది. ఈ కారణంగానే ఈవోలుగా నియమితులైన సీనియర్ అధికారులు తమ విధులను సజావుగా నిర్వహించగలిగారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఫలితమే తాజా వివాదాలు. జరిగిన దానికి అధికారులు బాధ్యత తీసుకోవాలా? పాలక మండలి తీసుకోవాలా? అన్న వివాదం కొత్తగా తలెత్తింది. చట్టంలోని ఒక నిర్దుష్టమైన సెక్షన్ ప్రకారం పాలక మండలికి సర్వాధికారాలు ఉన్నందున ఈవోలుగా సీనియర్ అధికారులను నియమించడం అనవసరం. ఆర్డీవో స్థాయి అధికారిని నియమిస్తే సరిపోతుంది. అయితే దీనివల్ల పాలక మండలి సభ్యుల పెత్తనం పెరిగిపోయి దేవస్థానం పాలనా వ్యవహారాలు అదుపు తప్పే ప్రమాదం ఉంది.

అదీ మోదీ పవర్...

కేంద్రంలో కూడా ఎన్డీయే కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంది. అయినా అక్కడ ప్రధాని నరేంద్ర మోదీ అధికారానికి తిరుగులేదు. భాగస్వామ్య పక్షాలన్నీ తమ పరిమితులను తెలుసుకొని నరేంద్ర మోదీ నాయకత్వంలో పనిచేస్తున్నాయి. ప్రధానమంత్రికి పోటీగా ఇతర భాగస్వామ్య పక్ష నాయకులు ప్రకటనలు చేసేందుకు సాహసించడం లేదు. ప్రధాని మోదీ ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ బలంపైన ఆధారపడి మనుగడ సాగిస్తోంది. అయినా చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకొనే ప్రయత్నం చేయడం లేదు. ప్రధాని అధికారాలను ప్రశ్నించే సాహసం చేయడం లేదు. రాష్ట్రంలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. జనసేన, బీజేపీ స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయి. తిరుపతిలో తొక్కిసలాట జరిగిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధితులను పరామర్శించడానికి విడిగా వెళ్లారు. ఒకరకంగా ఇందులో తప్పుపట్టాల్సింది ఏమీ లేదు. జనసేన పార్టీకి పవన్ కల్యాణ్ అధినేత కూడా. తన పార్టీ తరఫున స్వతంత్రంగా వ్యవహరించే స్వేచ్ఛ ఆయనకు ఉంటుంది. అయితే ప్రభుత్వానికి సంబంధించిన విషయాలలో విధాన నిర్ణయాలు తీసుకొనే అధికారం ముఖ్యమంత్రికి మాత్రమే ఉంటుంది. ముఖ్యమంత్రికి పోటీగా ఉప ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తే దాని ప్రభావం వేరుగా ఉంటుంది. ఉప ముఖ్యమంత్రి అనేది రాజ్యాంగబద్ధమైన పదవి కాదు. సాంకేతికంగా చూస్తే పవన్ కల్యాణ్ ఇతర మంత్రులతోపాటు మరో మంత్రి మాత్రమే. ఆయన మంత్రిగానే ప్రమాణ స్వీకారం చేశారు. తను స్వతంత్రంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ కోరుకోవడం ఆయన కోణంలో సరైనదే కావచ్చు. ప్రభుత్వపరంగా చూస్తే అది వాంఛనీయమా అన్న సందేహం కలుగుతుంది. ఒక సంఘటన జరిగినప్పుడు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పోటాపోటీగా ప్రకటనలు చేస్తున్నారన్న అభిప్రాయం ప్రబలితే దాని ప్రభావం పాలనా యంత్రాంగంపై ఉంటుంది. ఎవరి ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవాలన్న సందేహం అధికారుల్లో ఏర్పడుతుంది. ఈ పరిస్థితిని కొంతమంది అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంటుంది. ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రుల వలె పవన్ కల్యాణ్ కూడా తిరుపతి పర్యటనకు వెళ్లి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. విలేకరుల సమావేశంలో కూడా ఇరువురూ సమష్టిగా తమ అభిప్రాయాలను పంచుకోవచ్చు. అలా కాకుండా విడివిడిగా ప్రకటనలు చేయడం వల్ల ప్రభుత్వంలో సమన్వయం కొరవడుతుంది. సంకీర్ణ ధర్మానికి అందరూ కట్టుబడి ఉంటే ఏ గొడవా ఉండదు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సోషల్ ఇంజనీరింగ్ పేరిట ఐదుగురిని ఉప ముఖ్యమంత్రులుగా నియమించుకున్నారు. అయితే, వారెప్పుడూ తాము మిగతా మంత్రుల కన్నా అధికులమని చెప్పుకొనే పనిచేయలేదు. పవన్ కల్యాణ్ జనసేన అధినేత కనుక ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు విధేయుడిగా ఉండాలని భావించలేని పరిస్థితి. ప్రస్తుతం తలెత్తిన ఈ సున్నితమైన సమస్య మున్ముందు కూటమి సఖ్యతపై ప్రభావం చూపకూడదనుకుంటే.. ప్రస్తుత దశలోనే పరిష్కారం కనుగొనాలి.

ఎవరు బాధ్యులు?

మృతుల కుటుంబాలకు పాలక మండలి క్షమాపణలు చెప్పాలని పవన్ కల్యాణ్ కోరడం ముమ్మాటికీ సమర్థనీయమే. కింది స్థాయి అధికారులు చేసే తప్పిదాలకు ప్రభుత్వ పెద్దలు బాధ్యత తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే, ఒక డీఎస్పీ స్థాయి అధికారి అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం వల్ల ఆరు నిండు ప్రాణాలు గాలిలో కలసిపోయినందున పాలక మండలి నైతిక బాధ్యత తీసుకోవడంలో తప్పు లేదు. నామోషీ అంతకన్నా లేదు. అయితే పవన్ కల్యాణ్ ఈ ప్రకటనను ముఖ్యమంత్రి సమక్షంలో చేసి ఉంటే బాగుండేది. విషయాలు స్వల్పమే అయినప్పటికీ అవి భవిష్యత్తులో ముదిరే ప్రమాదం ఉంటుంది. కూటమిలో చిచ్చు పెట్టడానికి జగన్ అండ్ కో కాచుకొని ఉన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారిలో విశ్వాసం ఏర్పడాలన్నా కూటమిలో ఐక్యత ఉంది–ఉంటుంది అన్న నమ్మకం కూడా కలిగించాలి. తెలుగుదేశం–జనసేన–బీజేపీ మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తితే దాని ప్రభావం ఆ పార్టీలపైనే కాదు– రాష్ట్రంపైనా పడుతుంది. కూటమి విచ్ఛిన్నమైతే 2029లో పరిస్థితి ఏమిటి? అన్న సందేహం పెట్టుబడిదారుల్లో కలగకుండా ఎందుకు ఉంటుంది? ఇప్పటికే జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రారు అన్న భరోసా ఇవ్వగలరా? అని పెట్టుబడులు పెట్టేవారు అడుగుతు

> ప్రజలలో భక్తి పెరగడం వల్ల తిరుమలలోనే కాదు అన్ని దేవాలయాల వద్దా రద్దీ ఏర్పడుతోంది. భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ పదవుల పోటీ కూడా పెరుగుతోంది. భక్తుల ఆదరణ కొరవడి ధూప దీప నైవేద్యాలకు దిక్కులేని గుళ్లు ఎన్నో ఉన్నాయి. వాటి పదవులకోసం ఎవరూ ఎందుకు పోటీ పడరు? దేవుడిపై నిజంగా భక్తి ఉంటే ఆ గుళ్లను అభివృద్ధి చేయడానికి పోటీ పడవచ్చుకదా! 'తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోంది... డ్రైనేజీ స్కీము లేక డేంజరుగా మారుతోంది' అని కవి గజ్జెల మల్లారెడ్డి ఎప్పుడో చెప్పారు. ఇప్పుడు భక్తిరసం వరదలై పారుతోంది. ఫలానా నూనెతో దీపం వెలిగించాలి.. అప్పుడే ఇష్టవాంఛ నెరవేరుతుందని చెబుతున్నారు. ఫలానా విధంగా పూజలు చేయాలని ఏ శాస్త్రంలో రాశారు? చిత్తం శివుడి మీద, భక్తి చెప్పుల మీద అన్నట్టుగా పరిస్థితి తయారైంది. పవిత్ర మనసుతో దేవుడికి మనసులో దండం పెట్టుకుంటే ఆ దేవుడు కనికరించడా?

న్నారని మంత్రి లోకేశ్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం–జనసేన మధ్య, ముఖ్యంగా చంద్రబాబు–పవన్ కల్యాణ్ మధ్య మరింత సమన్వయం అవసరం. అదే సమయంలో కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న తిరుమల కొండపై పరిస్థితిని గాడిలో పెట్టడానికి చంద్రబాబు–పవన్ కల్యాణ్ ఉమ్మడిగా యోచన చేయాలి. ముఖ్యమంత్రి అంటే లెక్కలేకుండా తన సమక్షంలోనే గొడవపడిన చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావును చంద్రబాబు ఆరోజే మందలించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. వైకుంఠ ఏకాదశి రద్దీ ఉన్నందున భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించకుండా బోర్డు ప్రత్యేక సమావేశం నిర్వహించడం సమంజసం కాదన్న ఈవో అభిప్రాయాన్ని బోర్డు సభ్యులు లెక్కచేయలేదు. ఈ సమస్యకు వీలైనంత త్వరగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిష్కారం కనుగొనాలి. లేనిపక్షంలో తిరుమల ప్రతిష్ఠ మంటకలవడమే కాకుండా దాని ప్రభావం చంద్రబాబు ప్రభుత్వ పనితీరుపై కూడా పడుతుంది. కొండ మీద ఆధిపత్య పోరు వల్ల సామాన్య భక్తులు బలి కాకూడదు. పదవులలో ఉన్న వారికి దేవుడిపై నిజంగా భక్తి ఉంటే భేషజాలను వెంటనే వదులుకోవాలి. ఆ దేవుడే లేకపోతే మనమూ లేము– మన పదవులూ లేవన్న వాస్తవాన్ని గుర్తించి మెలుగుతారని ఆశిద్దాం! తిరుమల చరిత్రలో మొదటిసారిగా జరిగిన ఈ దురదృష్టకర సంఘటన చివరిది కావాలని కోరుకుందాం!

శ్రమ జీవన సౌందర్యోత్సవం

శ్రమ ఫలించి గాదెలు, గరిసెలు నిండిన రోజు సంక్రాంతి. ఇది పంటల పండుగ. అందరి జీవితాలలో ఆనందోత్సాహాలను నింపడమే కాక, కొత్త వెలుగుల్ని ఇవ్వమని ప్రకృతిని వేడుకునే పండుగ.

శ్రామిక జీవన సౌందర్యానికి అద్దంపట్టే పండుగ సంక్రాంతి. పంటలు చేతికొచ్చేటప్పుడు జరుపుకునే వేడుక సంక్రాంతి.

ఉన్నత సంప్రదాయల్లో, ఆచార వ్యవహారాల్లో ప్రతి పండుగ వెనుక ఒక చారిత్రక కారణం ఉంది. ఓపిగ్గా పరిశీలిస్తే.. పండుగల వెనుక జాతి చరిత్ర, శ్రమ మూలాలు కనిపిస్తాయి. వాతావరణం, జీవావరణం, పర్యావరణం, భావ చైతన్య మహా సమ్మేళనమే మన పండుగలు అని అనిపిస్తుంది.

పల్లె అందాలతో సరదాగా గడపాలి అంటే సంక్రాంతే సరైన సమయం. అలుకు చల్లిన వాకిళ్లు, నేల నలుచెరుగులా పరుచుకున్న ముగ్గులు, గొబ్బెమ్మలతో నిండిన వీధులు ఉంటాయి. ఆ ముగ్గులను చూసినప్పుడు నింగిలోని చుక్కలు దిగివచ్చి ముగ్గులై మురిశాయా.. హరివిల్లులోని వర్ణాలన్నీ ఆ ముగ్గుల్లో.. కొత్త అందాలు పరిచాయా అన్నట్టుగా.. ఆ రంగవల్లులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటాయి. మధ్యలో గొబ్బెమ్మలు, రేగుపళ్లు, చెరుకు గడలతో ముగ్గులు మరింత సింగారించుకుని సంక్రాంతికి ఆహ్వానం పలుకుతాయి.

రంగురంగుల బట్టలు, గంటలు, గజ్జెలతో అలంకరించిన గంగిరెద్దులు, ధాన్యం నిండిన గరిసెలు, నువ్వుల బెల్లంతో చేసిన అరిసెలు, తీరొక్క దినుసులు, పసుపు కుంకుమ, పచ్చటి వాతావరణంలో నువ్వులు తిని నూరేండ్లు బతుకు.. చక్కెర తిని తీయగా మాట్లాడు అంటూ పంచిపెడతారు. సకినాలు, సర్వపిండి, సజ్జ రొట్టెలు, ఆకాశాన్ని తాకే గాలిపటాలతో పిల్లల ఆనందం అంబరమవుతుంది. ఏడాదిలో తొలి పండుగ. తెలుగువారి సొంతమైన పండుగ సంక్రాంతి. సొంత ఊరులో జరుపుకునే పండుగ. ఎక్కడ వున్నా ఈ పండుగకు మాత్రం ఊరికి పోవల్సిందే. అమ్మకోసం, ఊరమ్మ కోసమూ, మట్టివాసన, మధుర స్మృతుల కోసమూ పట్టణాల నుంచి పల్లెకు పరుగెడుతారు.

సంక్రాంతి మూడు రోజుల పండుగ. మొదటినాడు భోగి. భోగం అంటే ప్రకృతికి నివేదించే నైవేద్యం. కొత్త బియ్యంతో వండిన పసుపు అన్నం సమర్పిస్తారు. రైతులు ఆ దినాన పశువులను చక్కగా కడిగి వాటి కొమ్ములకు రంగులు అద్దుతారు. ఆ మూగజీవాలను పూలదండలతోనూ అలంకరిస్తారు. ఎడ్లను గౌరవిస్తారు. వ్యవసాయ పరికరాలు, తమ బతుకులను నిలిపే పనిముట్ల పట్ల కృతజ్ఞతాభావం, అవి దైవ సమానాలనే నమ్మకం ప్రస్ఫుటంగా కనబడుతుంది.

అందరి జీవితాలలో ఆనందోత్సాహాలను అందించడమే కాక కొత్త వెలుగుల్ని ఇవ్వమని ప్రకృతిని వేడుకునే పండుగ. ఇవన్నీ శ్రమ సంస్కృతిలో భాగమైనవి. పండుగలు అన్నీ మతపరమైనవి కావు. మానవుని ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించినవి. అంటే వ్యవసాయం, పశుపోషణ వంటివి. ప్రకృతి శక్తులను వశపరచుకున్నప్పుడు మానవుడు సాధించిన విజయాన్ని పురస్కరించుకొని ఈ పండుగలు జరుగుతుంటాయి. కరువు– కాటకాలు, విపత్తులు సంభవించినప్పుడు ప్రకృతిలోని వశంకాని శక్తులు అన్నింటిని దేవుడుగా, దెయ్యాలుగా కొలిచారు. కొన్ని పండుగలు పూర్తిగా మత నమ్మకాలపై పుక్కిటి పురాణ కథలతో ఆచార సంప్రదాయాలతో ఉన్నాయి. పండుగలు, జాతర్లు, ఉత్సవాలను మూఢనమ్మకాలనే పేరుతో కొట్టేయడం సరికాదు. తెలుగు రాష్ట్రాల్లో 'సంక్రాంతి', తమిళనాడులో 'పొంగల్' కేరళలో 'ఓణం' ..ఇలా గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో కళకళలాడే రోజు. బంతీ, చేమంతి పూలు, రేగుపండ్లు సమృద్ధిగా దొరికే కాలం. ఎడ్లను అలంకరించి, ఆటలు, పాటలతో కూడిన గ్రామీణ ఉత్పత్తితో ముడిబడిన వినోదాల సందర్భం. వీటిలో కూడా పెట్టుబడి ప్రవేశించింది. జూదంగా, వ్యసనంగా తాగుడు వంటి అనాచారాలు ప్రవేశించాయి. వినోదం కాస్తా విషాదమై పోయింది. పండుగల్లో ప్రజా దృక్పథం కొరవడింది. ప్రతి దాంట్లో మంచి సంస్కృతి, శ్రమ సంస్కృతిని గౌరవించాలి, ప్రోత్సహించాలి.

మనిషి ఎప్పుడూ ఒంటరిగా లేడు. సమిష్టిగా పోరాడాడు. ప్రకృతిపై విజయాలను సమిష్టిగానే పంచుకున్నారు. నిప్పుపై మానవుని విజయమే, చీకటి నుంచి వెలుగుల ప్రయాణంగా చూశారు. ప్రకృతి ముందు ఓడిపోయినప్పుడు అతీత శక్తుల వైపు, నమ్మకాల వైపు అల్లుకున్నారు. సూర్యుడు,



చంద్రుడు, చెట్టు, పుట్ట, పాము దేవుడిగా కొలిచారు. మొదట మానవుడు చెట్టును పుట్టను ప్రసన్నం చేసుకోవడానికి క్రతువులు ఆచరించాడు. వ్యవసాయ సమాజంలో ఋతుచక్రాన్ని తనకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రత్యేక పూజలు చేశాడు. ధాన్యం జీవనాధారం కనుక ధాన్యలక్ష్మీ, ధనం జీవితంలో భాగమయ్యాక ధనలక్ష్మీ పేరుతో కొలిచారు. వ్రతాలు, యాగాలు, దీక్షలు చేశారు. అర్థంకాని ప్రతి సమస్య ఆధ్యాత్మికం వైపు మరలింది.


స్వార్థంతో ఒక జాతిని మరొక జాతి పీడించడం మొదలైనప్పుడే... ఆ పీడన నుండే విముక్తి కోసం పోరాటాలు జరిగాయి. జయాపజయాలు, పర్వదినాలు, దుర్దినాలుగా మారి మన సంస్కృతిలో భాగమయ్యాయి. పరాయి పీడన నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటంలో నేలకొరిగిన వీరుల జన్మదినాలు పర్వదినాలైనాయి. పరాయి పాలన నుంచి విముక్తి జరిగిన దినాలు ముఖ్యమైన జాతీయ పండుగలయ్యాయి. 'కప్పం కట్టనుపో..' అన్న ప్రతి వారికి కత్తిలాంటి జ్ఞాపకం సమ్మక్క, సారక్కలు, గిరిజన వీరుడు కొమరం భీం, కేశ్లాపురం జాతర, కేవల్ కిషన్ జాతర, పండుగ సాయన్న, అమరుల శౌర్యాన్ని జాతర రూపంలో ప్రతి ఏడాది స్మరించుకుంటారు. నృత్యం, సంగీతం, ఆట, పాటలతో సంబురపడతారు. ఇదంతా మానవుడు సమిష్టి కృషితో సంపాదించిన భౌతిక సంపద, సాంస్కృతిక వారసత్వం.

శ్రమ ఫలించి గాదెలు, గరిసెలు నిండిన రోజు సంక్రాంతి ఉత్పత్తితో ముడిబడింది. ఇది పూర్తిగా వ్యవసాయదారుల పంటల పండుగ. దేశ జనాభాలో 70 శాతం గ్రామీణ జనాభా. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ వినిమయ సంస్కృతి నుంచి కూడా పండుగలు ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రజా సంస్కృతిని వికృతపరుస్తున్నాయి. ప్రజా కళలను ప్రచార సరుకులుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రగతిశీలురు, అభ్యుదయ వాదులు ఈ నీతి బాహ్య వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలి. జాతి జనులు అభివృద్ధి నిరోధక మార్గం పట్టకుండా నిత్యం కనిపెడుతూ వుండాలి.

అభివృద్ధి నిరోధక శక్తులు, మతతత్వ శక్తులు ఆయా సందర్భాల్లో ఆధిపత్యం వహించి తమ భావజాలాన్ని వ్యాపింపజేయకుండా అడ్డుకోవాలి. కార్పొరేట్ సంస్కృతి, వినిమయ సంస్కృతి వికృత మార్గం నుండి కాపాడాలి. మార్పులను అభివృద్ధికర మార్గం వైపు జరిగే విధంగా కృషి చేయాలి. ప్రజా సంస్కృతి, ప్రత్యామ్నాయ సంస్కృతికి అవసరమైన పరిస్థితులు కల్పించాలి. శ్రమకు గౌరవం దక్కాలి. శ్రమ సంస్కృతిని ప్రోత్సహించాలి. శాంతి క్రాంతుల పతంగులను విశ్వవీధిన ఎగరవేద్దాం! అదే నిజమైన సంక్రాంతి.

▪ భూపతి వెంకటేశ్వర్లు
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, రాష్ట్ర అధ్యక్షుడు







ముగ్గులను పరిశీలిస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులు తీర్చిదిద్దిన రంగవల్లులు

ముగ్గులొలికే..

విజయవాడలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి వంగలపూడి అనిత

ఆకాశంలో హరివిల్లులు
క్యూ కట్టినట్టు...
ఇంద్రధనస్సులోని రంగులన్నీ
ఇలపై ఒలికినట్టు..
అప్పటివరకు ఖాళీగా
కనిపించిన ప్రాంగణాల్లో
కమనీయ దృశ్యాలు ఆవి
ష్కృతమయ్యాయి.
తరుణులు తోటమాలులై
నిమిషాల వ్యవధిలో
గుబాళించే రంగుల
పూదోటను సృష్టించారు.
రంగుల వైభవాన్ని అంగరంగ
వైభవంగా కళ్లకు కట్టారు.

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్వియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతితో పాటు మూడు ద్వితీయ బహుమతులను అందజేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

పుంజుకున్నాయ్

ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా భారీగా కోడిపందేల బరులు

కేసినోతో పాటు పేకాట, గుండాట కూడా..

- ఒక్కో పందేనికి రూ.లక్షల్లో రేటు పెట్టిన నిర్వాహకులు
- రెండు జిల్లాల్లో దాడులు చేస్తున్న పోలీసులు
- తెరవెనుక మాత్రం నిర్వాహకులతో బేరసారాలు
- గన్నవరం నియోజకవర్గంలో భారీగా శిబిరాలు
- అంపాపురంలో హైటెక్ హంగులతో అంతా సిద్ధం



ఈడుపుగల్లులో పందేల కోసం కోళ్లకు స్విమ్మింగ్ చేయిస్తున్న పందెపురాయుళ్లు

కోర్టులు హెచ్చరిస్తున్నా.. పోలీసులు దాడులు చేస్తున్నా.. సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందేల బరులు భారీగా సిద్ధమవుతున్నాయి. పేకాట, గుండాటతో పాటు కేసినోకు కూడా పక్కా ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. ఓవైపు బరుల నిర్వాహకులు పెద్ద ఎత్తున సౌకర్యాలు సమకూరుస్తూ దర్జాను ప్రదర్శిస్తుండగా, మరోవైపు రూ.కోట్లలో ఖర్చుచేసైనా పంతం నెగ్గించుకోవాలని పందెపురాయుళ్లు మీసాలు మెలేస్తున్నారు. మొత్తానికి సోమవారం నుంచి జిల్లావ్యాప్తంగా వందల బరుల్లో కోళ్లు రూ.కోట్ల కోసం కొట్టుకోనున్నాయి.

- మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి



సూరంపల్లిలో బరి



అంపాపురంలో బరులను తొలగిస్తున్న పోలీసులు

అంపాపురంలో భారీ ఏర్పాట్లు

బాపులపాడు మండలంలోని అంపాపురంలో హైటెక్ హంగులతో కోడి పందేలు, పేకాట నిర్వహించేందుకు భారీస్థాయిలో శిబిరాన్ని ఏర్పాటుచేశారు. పోలీసులు శనివారం ఈ శిబిరం వద్దకు వెళ్లి తనిఖీలు చేసినా నిర్వాహకులు అంతగా పట్టించుకోలేదు. ఇక్కడ పండుగ మూడు రోజుల్లో రూ.వందకోట్ల వరకు నగదు చేతులు మారుతుందని నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ కోడిపందేలకు సంబంధించి ఓ పెద్దబరి, నాలుగు చిన్నబరులు, పదికిపైగా పేకాట శిబిరాలు, మూడు కేసినోలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. కేసీనో నిర్వహణ కోసం గోవా నుంచి మనుషులను తీసుకొచ్చారు. పెద్దబరుల్లో ఒక్కో కోడిపందేనికి కనీసం రూ.20 లక్షలుగా నిర్ణయించారు. చిన్నబరుల్లో రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు కోడిపందేలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఈ శిబిరాల్లో మద్యం సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. శిబిరాల్లో ఏసీ గదులు, ఎల్ఈడీ స్క్రీన్లు సిద్ధం చేస్తున్నారు.

1 గుడివాడ నియోజకవర్గంలోని బొమ్ములూరు, వలివర్తిపాడు, నందివాడ మండలం పోలుకొండ, రుద్రపాక, తమిరిశలో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. గుడ్లవల్లేరు మండలం వేమవరం, కౌతవరం, కూరాడ, పెంజెంద్రలో ఏర్పాటుచేసిన బరుల వద్దకు పోలీసులు, మండల స్థాయి ప్రత్యేక బృందాలు వెళ్లి శనివారం శిబిరాలను తొలగించాయి. అయినా ఇక్కడ మిగతా 6లో..

కఠిన చర్యలే

పందెపురాయుళ్లకు కృష్ణా కలెక్టర్ వార్నింగ్

జిల్లాలో కోడి పందేలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడా కోడిపందేల శిబిరాలు నిర్వహించకుండా గ్రామ, మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్ఐ, సీఐలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

మల్లవల్లిపై మరో ముందడుగు

- యుద్ధప్రాతిపదికన రోడ్లు, విద్యుత్, మౌలిక సదుపాయాల పనులు
- పరిశ్రమల స్థాపనపై పెట్టుబడిదారులతో 'ఏపీఐఐసీ' సమావేశం
- అగ్రిమెంట్లు చేసిన నెలలోనే యూనిట్లు నెలకొల్పుతామన్న పెట్టుబడిదారులు

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మల్లవల్లిలోని బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు(మోడల్ ఇండస్ట్రియల్ పార్కు)లో పరిశ్రమలు నెలకొల్పే దిశగా మరో ముందడుగు పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఈ పారిశ్రామికవాడకు మంచి రోజులు వచ్చాయి. సమస్యలను పరిష్కరించడంతోపాటు త్వరలోనే పరిశ్రమలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీంతో ఈ పారిశ్రామికవాడలో దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో 349 మంది పారిశ్రామికవేత్తలకు పాత ధరల ప్రకారం అంటే ఎకరం రూ.16.50 లక్షలకే కేటాయించేందుకు అక్టోబరులోనే కేబినెట్ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద మల్లవల్లి పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాల కల్పన పనులకు రూ.1,000 కోట్ల రుణానికి ప్రభుత్వం హ్యాండ్ హోల్డింగ్ ఇచ్చింది. దాంతో మల్లవల్లి పార్కులో పారిశ్రామికాభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. పరిశ్రమలు నెలకొల్పేందుకు మౌలిక సదుపాయాల కల్పన పనులను ఏపీఐఐసీ అధికారులు దగ్గరుండి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తున్నారు. ఇప్పటికే రోడ్లు, విద్యుత్ లైన్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. దీంతో వీలైనంత త్వరగా పరిశ్రమలను కూడా నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కులో ప్లాట్లు పొందిన పారిశ్రామికవేత్తలందరితో ఏపీఐఐసీ అధికారులు శనివారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రచన, చీఫ్ ఇంజినీర్ సీతారామ్, విజయవాడ జోనల్ మేనేజర్ బాబ్జీ సమావేశానికి హాజరయ్యారు. మల్లవల్లి పారిశ్రామిక పార్కులో కేటాయించిన ప్లాట్లలో వెంటనే పరిశ్రమలను నెలకొల్పేందుకు సిద్ధం కావాలని పారిశ్రామికవేత్తలను వారు కోరారు. పాత ధరలకే ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి అగ్రిమెంట్లు చేసిన వెంటనే పరిశ్రమలు నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నామని మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్, ఎస్ఏపీ ఇండస్ట్రియల్ అసోసియేషన్, నవ్యాంధ్ర ఇండస్ట్రీస్ అసోసియేషన్, మల్లవల్లి స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు. అసోసియేషన్ల తరఫున జీఎస్‌బీ చౌదరి, సాయికిషోర్, పున్నయ్య, ఆనందరావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు మాట్లాడారు. గతంలో తాము సమర్పించిన డీపీఆర్‌లను ఐదేళ్లలో చోటుచేసుకున్న మార్పులకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. పరిశీలిస్తామని ఏపీఐఐసీ అధికారులు హామీ ఇచ్చారు.



రైలు కోసం పాట్లు

ఒకటే రద్దీ

విజయవాడకు పోటెత్తిన ప్రయాణికులు

- పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్ కిటకిట
- శనివారం ఒక్కరోజే 4 లక్షల మంది రాక
- చిల్లకల్లు, కీసర టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్
- పొట్టిపాడు, కలపర్రు ప్లాజాల వద్ద కూడా..
- విమానాశ్రయంలోనూ అదే పరిస్థితి
- ఆదుకున్న విజయవాడ బైపాస్ రోడ్డు
- బెజవాడలో ట్రాఫిక్‌కు కాస్త ఊరట

విజయవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పండుగ ప్రయాణాలు ఊపందుకున్నాయి. శనివారం ఒక్కరోజే హైదరాబాద్ నుంచి రికార్డుస్థాయిలో 4 లక్షల మంది విజయవాడ వచ్చారని అంచనా. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, రైళ్లు, విమానాల ద్వారా లక్షన్నర మంది వరకు ప్రయాణాలు సాగించగా, మిగిలిన రెండున్నర లక్షల మంది కూడా సొంత వాహనాలు, క్యాబ్‌ల ద్వారా వచ్చారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ట్రాఫిక్ అంతా జగ్గయ్యపేట దగ్గర చిల్లకల్లు, కీసర టోల్‌ప్లాజా వద్ద బారులు తీరాయి. జాతీయ రహదారిపై నిరంతరాయంగా కార్ల కాన్వాయ్ కనిపించింది. హైదరాబాద్ నుంచి విజయవాడకే కాకుండా రాజమండ్రి, కాకినాడకు పెద్ద సంఖ్యలో సొంత వాహనాలు, క్యాబ్‌లలో వచ్చారు. దీంతో విజయవాడ నగరంలో జాతీయ రహదారులపై తీవ్ర ట్రాఫిక్ కనిపించింది.

పీఎన్‌బీఎస్ కిటకిట

శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్ నుంచి షెడ్యూల్ బస్సులు కాకుండా రికార్డు స్థాయిలో 250 స్పెషల్స్ నడిపారు. హైదరాబాద్ మిగతా 6లో..



పీఎన్‌బీఎస్‌లో రద్దీ

రైళ్లు, విమానాలు రద్దీ

రైల్వే అధికారులు దాదాపు 58 సంక్రాంతి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. సంక్రాంతి ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టిన గంటలోనే టికెట్ల రిజర్వేషన్ అయిపోతోంది. రిజర్వేషన్ దొరకని వారు ప్రైవేట్ బస్సులు, కార్లు, క్యాబ్‌లపై ఆధారపడుతున్నారు. ఎన్నడూ లేనంతగా విజయవాడ రైల్వేస్టేషన్‌లోని పది ప్లాట్‌ఫాంలు కిటకిటలాడాయి. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో కూడా తీవ్ర రద్దీ నెలకొంది. దాదాపు 48 విమాన సర్వీసులు నూరుశాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే వారితో విమానాశ్రయం కిటకిటలాడింది.

బియ్యం మాయం కేసులో ముగిసిన పోలీస్ కస్టడీ

ఏ4ను అధిక సమయం ప్రశ్నించిన పోలీసులు

- మిల్లు వద్దకు తీసుకెళ్లి వివరాల సేకరణ
- బియ్యం కొన్న ఐదుగురిపై త్వరలో కేసు నమోదు
- హైకోర్టు ఆదేశాల మేరకు నిందితులు మళ్లీ జైలుకు

మచిలీపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి పేర్ని నాని గోడౌన్‌లో బియ్యం మాయం కేసులో రిమాండ్‌లో ఉన్న మేనేజర్ మానస్‌తేజ, మిల్లు యజమాని బొర్రా బాలాంజనేయులు, లారీడ్రైవర్ బోట్ల మంగారావును పోలీసులు శనివారం కస్టడీలోకి తీసుకుని విచారించారు. మచిలీపట్నం సబ్‌జైలు నుంచి మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌కు శనివారం ఉదయం 10 గంటల సమయంలో తీసుకొచ్చారు. ఆర్‌పేట సీఐ ఏసుబాబు, సీఐలు నిందితులను విచారించారు. ఏ4గా ఉన్న మిల్లు యజమాని బాలాంజనేయులును ఎక్కువసేపు విచారించారు. పెడనలోని బాలాంజనేయులు నడుపుతున్న మిల్లు వద్దకు తీసుకెళ్లి.. అక్కడి పత్రాలను, ఇతరత్రా రికార్డులను తనిఖీ చేశారు. విచారణ ముగిశాక ముగ్గురు నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అనంతరం వారిని సబ్‌జైల్లో అప్పగించారు. శనివారం రాత్రి ఏఎస్పీ వీవీ నాయుడు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బియ్యం మాయం కేసులో కస్టడీలోకి తీసుకున్న నిందితులను విచారించిన తీరు, ఈ కేసులో పురోగతి, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. బియ్యం విక్రయించడంలో కీలకపాత్ర పోషించిన మిల్లు యజమాని బాలాంజనేయులు ఖాతా నుంచి మానస్‌తేజ బ్యాంకు ఖాతాకు గతంలో రూ.23 లక్షలు జమ అయినట్లు గుర్తించగా, శనివారం మిగతా 6లో..



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న పుస్తక మహోత్సవాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం సందర్శించారు. స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌కు వెళ్లి పుస్తకాలను పరిశీలించారు. సుమారుగా రూ.3 లక్షల విలువ చేసే తెలుగు సాహిత్యం, అనువాద సాహిత్యం, నిఘంటువులను కొనుగోలు చేశారు.

బుక్ ఫెస్టివల్‌లో డిప్యూటీ సీఎం



8లో

అవనిపై హరివిల్లు

నగరంలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్





ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత



ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మి (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

ఓబన్న పోరాటం భావితరాలకు స్ఫూర్తి

- స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ



వడ్డె ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న పోరాటం భావితరాలకు స్ఫూర్తి మార్గమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వడ్డె ఓబన్న జయంతి నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఓబన్న పోరాటానికి సముచిత గుర్తింపునిచ్చి, ఆయన స్ఫూర్తిని ముందుతరాలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వడ్డె ఓబన్న పేద రైతులు, గ్రామస్థుల హక్కులు కాపాడేందుకు, వారికి న్యాయం చేసేందుకు బ్రిటిష్ వారిపై పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఇన్‌చార్జి బీసీ సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయిల విడుదల పై ఎన్జీఓ సంఘం హర్షం

వన్‌టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం శనివారం విడుదల చేయటంపై ఎన్జీవోస్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు జీపీఎఫ్, పోలీసుల సరెండర్ లీవ్ బకాయిల చెల్లింపులకు, సీపీఎస్ బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం కేటాయింపులు చేయటం సంక్రాంతి పండుగ ముందు ప్రకటించటం ఆనందంగా ఉందని ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ అన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి సమస్యలు వివరించగా స్పందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. బకాయిలపైకూడా ప్రభుత్వం దృష్టి సారించాలని, పీఆర్సీ కమిటీ నియామకం, డీఏల విడుదల, తదితర అంశాల పై కూడా ప్రభుత్వం నుంచి త్వరలోనే సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

'అథ్లెటిక్స్' మానిటరింగ్ కమిటీ చైర్మన్‌గా ఆకుల

లబ్బీపేట, జనవరి11(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అథ్లెటిక్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్‌గా ఆకుల రాఘవేంద్రరావును నియమిస్తూ అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు బహదూర్‌సింగ్, సందీప్ మెహతా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8న చండీఘర్‌లో ఫెడరేషన్ ఎన్నికలు జరిగాయి, ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా మానిటరింగ్ కమిటీలను సంఘం నూతన ప్రతినిధులు ఎన్నుకున్నారు.

వ్యాన్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి

కృత్తివెన్ను, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన యండపల్లి గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్నమదిబ్బ గ్రామానికి చెందిన తిరుమలశెట్టి ప్రభాకరరావు (60) బైక్‌పై బంటుమిల్లి వెళ్తుండగా, యండపల్లి వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభాకరరావు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలంలో ప్రభాకరరావు మృతదేహం

కోడి పందేలకు సర్వం సిద్ధం!

- పులిగడ్డ, ఘంటసాలలో ఇండోనేషియా తరహా రింగ్ పందేలు!
- సూరంపల్లి, మాదలవారిగూడెం మధ్య భారీ సెట్టింగ్‌లు, వీఐపీ గ్యాలరీ
- ఎనికేపాడు, రామవరప్పాడులో క్యాసినో, నైట్ క్లబ్ డాన్సులకు ఏర్పాట్లు!

భారీ ప్రైజ్ మనీతో రింగ్ పందేలకు రెడీ



పులిగడ్డలో జాతీయ రహదారి పక్కన బరిని సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

అవనిగడ్డ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇండోనేషియాలో నిర్వహించే కోడి పందేలను తలపించేలా అవనిగడ్డ నియోజకవర్గంలో రింగ్ పందేలను వేసేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నట్లు సమాచారం. పందేల బరిలోకి పది కోళ్లను ఒకేసారి వదిలి వాటిలో చివరిగా మిగిలే పందేం కోడికి రూ.10 లక్షల భారీ బహుమానాన్ని ఇచ్చేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేయడంతో ఈ పందేల్లో పాల్గొనేందుకు పందేపు రాయుళ్లు, తిలకించేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. పులిగడ్డ సమీపంలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరిలో ఆదివారం సాయంత్రం ఈ రింగ్ పందేలను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఘంటసాల మండలంలోని ఓ బరిలో కూడా ఇదే తరహా రింగ్ పందేలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. రింగ్ పందేల కోసం ఇప్పటికే తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పందేపు రాయుళ్లు నియోజకవర్గానికి తరలివచ్చారు. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో నాలుగేసి బరులు, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో రెండేసి, ఘంటసాలలో మూడు బరులకు అనుమతులు వచ్చినట్లు ప్రచారం జరుగుతుండగా, రాజకీయ నేతల ఒత్తిడితో చల్లపల్లిలో మరో బరి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

బేరాలు కుదిరాయి.. బరులు రెడీ అయ్యాయి

ప్రసాదంపాడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడు, రామవరప్పాడు ఫ్లైఓవర్ సమీపంలో సంక్రాంతి సంబరాలకు కోడి పందేల బరులన్నీ సిద్ధమయ్యాయి. క్యాసినో దగ్గర నుంచి నైట్ క్లబ్ డాన్సుల వరకు అన్నీ ఏర్పాట్లు నిర్వాహకులు చేసేస్తున్నారని సమాచారం. బరుల నిర్వహణను స్థానిక చోటా మోటా నాయకుల నుంచి బడా నాయకుల వరకు పరిశీలిస్తున్నారు. జేబులో రూపాయి ఖర్చు లేకుండా సిండికేట్‌గా ఏర్పడ్డారు నిర్వాహకులు. ఒకరికి స్టాల్స్ మీద వచ్చే ఆదాయం.. మరొకరికి పందేల్లో వాటా.. ఇంకొకరికి జూదంలో వచ్చే వాటా... ఇలా వాటాలు వేసుకుని మరీ రంగంలోకి దిగారు. బరులకు కావాల్సిన షామియాన ఖర్చు అంతా ఒకరికి అప్పగించారు. అతను బరుల దగ్గరకి వచ్చే వాహనాలపై పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. రామవరప్పాడు బరిలో 'లోన బయట' ఆట నిర్వహణకు ఓ వ్యక్తి రూ.15 లక్షలు చెల్లించి నడుపుకునేలా ఒప్పందం చేసుకున్నారని సమాచారం. ఇలా ప్రతి బరిలోనూ ఆదాయం కింద రూ. 3 కోట్ల నుంచి 5 కోట్ల వరకు నిర్వహణదారులకు చేకూరుతుందని అంచన. రామవరప్పాడులో సుమారు 15 ఎకరాల్లో, ఎనికేపాడులో 20 ఎకరాల్లో బరుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎనికేపాడులో ఏసీ హాలు అంటూ ఓ పెద్ద షెడ్డును నిర్మిస్తున్నారు. మరోవైపు పెద్ద స్టేజ్‌తో నిర్మాణం చేపట్టారు. ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవి కాకుండా చిన్నచిన్న బరులు సిద్ధం చేస్తున్నారు. కోడి పందేల ముసుగులో క్యాసినోకు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు బరుల వైపు చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'మైలవరం'లో ముమ్మరంగా ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో కోడి పందేల బరులను సిద్ధం చేస్తున్నారు. కొండపల్లి టీచర్ కాలనీ, ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్స్ వద్ద బరుల వద్ద ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. కొండపల్లి శాంతినగర్ వద్ద జాతీయ రహదారికి ఆనుకొని కోడి పందేల ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

సూరంపల్లిలో క్యాసినో!



గన్నవరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడి పందేలకు బరులను సిద్ధం చేస్తున్నారు. సూరంపల్లి, మాదలవారిగూడెం మధ్య వెంచర్‌లో భారీ సెట్టింగ్‌లు వేస్తున్నారు. రోడ్డుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఫొటోలతో పాటు కూటమి నేతల ఫొటోలతో భారీ స్వాగత ద్వారాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ సుమారు రూ.కోటికి పైగా ఖర్చుతో గుడారాలు, భారీ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. రూ.లక్షల్లో పందేలు జరుగుతాయని చెబుతున్నారు. క్యాసినో కూడా పెడుతున్నట్లు సమాచారం. గోపవరపుగూడెం, వీఎస్‌పురం కాలనీ, చెంచుల కాలనీ, తెంపల్లి గ్రామంలో బరులను సిద్ధం చేస్తున్నారు.

అంపాపురం బరిపై పోలీసుల దాడి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అంపాపురంలో ఏర్పాటు చేస్తున్న కోడిపందేల బరిపై సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఆకస్మికదాడి చేశారు. వేసిన టెంట్లను తొలగించడంతో పాటు సామాగ్రిని స్వాధీనం చేసుకుని వీరవల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పుంజుకున్నాయ్

(5వ పేజీ తరువాయి)

బరులు ఏర్పాటు చేస్తామని నిర్వహకులు ఘంటాపథంగా చెబుతున్నారు.

- మచిలీపట్నంలోని మేకావానిపాలెం, గోపువానిపాలెం, శ్రీనివాసనగర్, గోకవరం, రుద్రవరం తదితర ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేస్తున్నారు. రుద్రవరంలో కోడి పందేలు నిర్వహించే శిబిరం వద్ద ముగ్గుల పోటీల నిర్వహణ ముసుగులో ఏర్పాట్లు చేస్తున్నారు.
- పెడన నియోజకవర్గంలోని తోటమూల, కొంకేపూడి, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, అర్తమూరులో కోడిపందేల శిబిరాలను ఏర్పాటు చేశారు. బంటుమిల్లిలో రాత్రిపూట కూడా పేకాట శిబిరం నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. గూడూరు మండలం గూడూరు-పెడన రహదారి వెంబడి, పోసినవారిపాలెంలో బరులు సిద్ధమయ్యాయి.
- అవనిగడ్డ నియోజవర్గంలోని పులిగడ్డ, పులిగడ్డపల్లెపాలెం, అవనిగడ్డ, ఎడ్లంక, బందలాయి చెరువుతోపాటు చల్లపల్లి మండలం నడకుదురు, ఘంటసాల మండలం పాపవినాశనం గ్రామాల్లో కృష్ణా కరకట్టకు దిగువన బరులు నిర్మించారు. మోపిదేవి మండలంలో రెండు, నాగాయలంక, కోడూరు మండలాల్లో నాలుగు చొప్పున ఏర్పాటు చేశారు. బరుల వద్ద పేకాట, గుండాట నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రచారం చేస్తున్నారు. విదేశాల్లో మాదిరిగా గ్రూప్ పందేలను నిర్వహించనున్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 19 శిబిరాలు ఏర్పాటు కావడం గమనార్హం.
- పామర్రు నియోజకవర్గంలోని పామర్రు మండలం కొత్తపెదమద్దాలి, పెదపారుపూడి మండలం యలమర్రు, పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం, హనుమంతపురం, మొవ్వ మండలం కోసూరు, భట్లపెనుమర్రు, తోట్లవల్లూరు మండలం గరికపర్రు, కొమ్మమూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరులో బరులు భారీగా వెలిశాయి. పోలీసుల వద్ద అనుమతులు తీసుకున్న నిర్వాహకులు వారు తెరపైకి రాకుండా రూ.లక్షల్లో బేరాలుపెట్టి వేరే వ్యక్తులకు విక్రయించేస్తున్నారు.

బియ్యం మాయం కేసులో ముగిసిన పోలీస్ కస్టడీ

(5వ పేజీ తరువాయి)

విచారణలో రూ27 లక్షలుగా నిర్ధారించార. ఈ గోడౌన్ నుంచి జిల్లాకు చెందిన ఐదుగురు వ్యాపారులు బియ్యం కొన్నట్లుగా నిర్ధారణ కాగా, వీరిపై కేసు నమోదు చేసిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆర్‌పేట సీఐ ఏసుబాబు తెలిపారు.

ఎందుకీ జాప్యం

బియ్యం మాయం కేసులో పోలీసుల వ్యవహారశైలి కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉంది. 378 టన్నుల బియ్యం మాయమైన కేసును త్వరితగతిన చేదించకుండా, పోలీసులు కావాలనే జాప్యం చేశారనే విమర్శలు వస్తున్నాయి. నిందితుల నుంచి నిజాలు రాబట్టడంలో కావాలనే కాలయాపన చేశారని టీడీపీ నాయకులు అరోపిస్తున్నారు. ఈ కేసును ఇలాగే సాగదీసి, నీరుగార్చేస్తారనే ప్రచారం మచిలీపట్నంలో జరుగుతోంది.

ఒకటే రద్దీ

(5వ పేజీ తరువాయి)

నుంచి వచ్చిన, హైదరాబాద్‌వైపు వెళ్లే ప్రయాణికులతో పీఎన్‌బీఎస్ కిటకిటలాడింది. అధికారులు పకడ్బందీగా రద్దీని తగ్గించే ప్రయత్నం చేశారు. మొత్తం మీద శనివారం 500 పైబడి బస్సులు నడిపారు. రద్దీ పెరుగుతుండటంతో ఇతర జిల్లాల ఆర్టీసీ అధికారులతో పీఎన్‌బీఎస్ డీసీటీఎం సమన్వయం చేసుకుంటున్నారు. విజయవాడ నుంచి ఏలూరు, కాకినాడ, రాజమండ్రికి పెద్ద సంఖ్యలో బస్సులు నడిచాయి. రాజమండ్రి సెక్టార్‌కు శనివారం మధ్యాహ్నం 3 గంటల నాటికి రికార్డు స్థాయిలో 105 బస్సులు నడిచాయి. ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లే వాహనాలతో పొట్టిపాడు, కలపర్రు టోల్‌ప్లాజాల వద్ద వాహనాల రద్దీ నెలకొంది.

ప్రత్యామ్నాయంగా విజయవాడ బైపాస్

పండగ రద్దీ ప్రభావం విజయవాడ నగరంపై పడింది. దీంతో పోలీసు అధికారులు నిర్మాణంలో ఉన్న విజయవాడ బైపాస్ మీదుగా తాత్కాలికంగా వాహనాలను దారి మళ్లించారు. దీనివల్ల నగరంపై కొంత రద్దీ తగ్గింది. హైదరాబాద్ నుంచి నేరుగా ఏలూరు, భీమవరం, నర్సాపూర్, నిడదవోలు, రాజమండ్రి, కాకినాడ వైపుగా వెళ్లే వాహనాలను గొల్లపూడి బైపాస్ జంక్షన్ నుంచి ఇన్నర్ రింగ్‌రోడ్డు మీదుగా కండ్రిక ప్రధాన రోడ్డుకు, అక్కడి నుంచి విజయవాడ వెస్ట్ బైపాస్‌కు మళ్లించారు. సూరంపల్లి-సింగ్‌నగర్ రోడ్డు నుంచి కూడా విజయవాడ వెస్ట్ బైపాస్ మీదుగా వాహనాలను డైవర్షన్ చేశారు. కొన్ని వాహనాలను నూజివీడు మీదుగా హనుమాన్ జంక్షన్ వరకు మళ్లించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112,120, 131
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై చర్చించాలి

కృష్ణలంక, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో చర్చించి మార్పులపై నిర్ణయం తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలో మార్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడానికి ముందు మంత్రివర్గసభ్యులు, అత్యున్నత ప్రభుత్వ అధికారులు, సుదీర్ఘ అనుభవం, శాశ్వత సభ్యత్వం కలిగిన ఉద్యోగ సంఘాలతో చర్చించి వ్యవస్థకు, ఉద్యోగులకు మేలు జరిగే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని వారు తెలిపారు.



ఎన్ఎస్ఎం స్కూల్‌లో..



ఆదిత్య డిగ్రీ కళాశాలలో..



శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీలో...



నలందాలో



పీబీ సిద్ధార్థలో..

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు పండుగలు

పటమట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి సంప్రదాయాలకు మన పండుగలు ప్రతీకలని ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. పలు వేషాలతో అలరించారు. రంగవల్లులు వేశారు. గాలి పటాలు ఎగురవేశారు.

ఆదిత్య డిగ్రీ కళాశాలలో..

పటమటలంక ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ ముఖ్య అతిథి పాల్గొని విద్యార్థులతో కలిసి భోగి మంటలు వేశారు. పలు పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వీరరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నరేంద్ర వర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాస నగర్ బ్యాంకు కాలనీలో ...

భారతీనగర్: నాల్గవ డివిజన్‌లోని శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీలోని పరిటాల ఓంకార కల్యాణ మండపంలో కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలను, సాయంత్రం చిన్నారులకు ఫ్యాన్సీడ్రస్, పాటలు, డ్యాన్స్‌లు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు గద్దె అనురాధ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, కాలనీ అధ్యక్షుడు జి నాగేశ్వరరావు, సెక్రటరీ యలమంచిలి రాజా, టెజరర్ కొనరాజు రవికుమార్, కాలనీ మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

లయోలాలో ...

ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ బి. జోజిరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల పోర్టికో వద్ద బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. విద్యార్థుల నృత్యప్రదర్శనలతో కళాశాల ప్రాంగణం ఆహ్లాదకరంగా మారింది. ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు డైరెక్టర్ డాక్టర్ బి.జోజిరెడ్డి బహుమతులను అందజేశారు. డైరెక్టర్ ఫాదర్ డాక్టర్‌జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి, అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

నలంద డిగ్రీ కళాశాలలో..

లబ్బీపేట: నలంద డిగ్రీ కళాశాలలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి లక్ష్మీ, గాలిపటం తయారి, బొమ్మల కొలువు, భోగికుండల అలంకరణ, రంగోలి తదితర పోటీలు నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, వై.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పీబీ సిద్ధార్థలో ...

మొగల్రాజపురం: పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శనివారం గుడ్ హ్యాబిట్స్ క్లబ్, ఎథిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి వేడుకలను ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ ప్రారంభించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో సందడి చేశారు. ముగ్గుల పోటీలు, పొంగల్ పోటీలు, బొమ్మల కొలువులు, గంగిరెద్దుల నృత్యాలు, హరిదాసు గానం, భోగిమంటలు, కోలాటం నిర్వహించారు. గాలిపటాలు, మెహందీ పోటీలు, అచ్చ తెలుగు అమ్మాయి, అబ్బాయి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. డైరెక్టర్ బాబూరావు, క్లబ్ కన్వీనర్లు రోహిణి కుసుమ, ఎం.శివ పార్వతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీ వ్యాధిపై భయం వద్దు

ప్రముఖ వైద్యుడు జి.సమరం



మాట్లాడుతున్న జి.సమరం

పటమట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంపీవీ వ్యాధి గురించి అతిగా భయపడాల్సిన అవసరం లేదని అది కేవలం దగ్గు, జలుబు, శ్వాసకోశాల వరకే పరిమితం అయ్యే వ్యాధి అని తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈవ్యాధి నుంచి రక్షింపబడవచ్చని ప్రముఖ వైద్యుడు జి.సమరం అన్నారు. వాసవ్య నర్సింగ్ హోంలో రవి కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన ఈవ్యాధిపై మాట్లాడుతూ ఇటీవల చైనాలో ప్రబలిన ఈవైరస్ వ్యాధి గురించి కొందరు భయభ్రాంతులకు గురవుతున్నారని, కరోనాలా ఈ వ్యాధి మల్టీఆర్గాన్స్‌ను ఫెల్యూర్స్ చేయదన్నారు. జలుబు, ముక్కు దిబ్బడ, గొంతు నొప్పితో వారం పది రోజుల్లో తగ్గిపోతుందన్నారు. మాస్క్ ధరించి, చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. వ్యాధి పట్ల అవగాహన ఉంటే చాలన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సంఘం సభ్యులు

లబ్బీపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వడ్డే ఓబన్న 218వ జయంతి కార్యక్రమాన్ని విజయవాడ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో రాణిగారితోటలోని సంఘం కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మెర శ్రీను, రాంబాబు మాట్లాడుతూ ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి జీవో నెంబర్ 5ను విడుదల చేయడాన్ని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, మంత్రులు లోకేష్, బీసీ వెల్ఫేర్ మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అదేవిధంగా ఓబన్న చరిత్రను ప్రజలకు తెలియజేస్తూ ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఒంటి పులి పిచ్చయ్య, వేముల ఎల్లయ్య, వేముల దుర్గారావు, దేవల శ్రీను, సాంబయ్య, దుర్గారావు, కాశీ, కొండ, వీర్రాజు, వెంకటేశ్వరరావు, కాశీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె

పటమట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 19వ డివిజన్ జార్జిపేటకు చెందిన వల్లభదాసు విక్టర్‌బాబుకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1,66,269 ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అందించారు. శనివారం అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యాలయంలో బాధితుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా కోట్లను పేదలకు అందించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో 19వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బాగం సాయి ప్రసాద్, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, బావరాజు నాని, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



దల్వాల దీక్షకు ఎస్‌ఆర్‌ఆర్ వాకర్స్ సంఘీభావం

ప్రభుత్వాసుపత్రి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పంటలకు మద్దతు ధర కల్పించాలని రైతు నాయకుడు జగ్జత్‌సింగ్ దల్వాల గత 45 రోజులుగా శంభూ సరిహద్దుల్లో చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాకర్స్ అసోసియేషన్ శనివారం సంఘీభావాన్ని తెలిపారు. పచ్చని మొక్కలు చేత పట్టుకొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజు, ఎల్.జానయ్య, రాఘవులు, కె.సుబ్బారావు, జి.అమృతరావు, సీ.హెచ్ మూర్తి, జె.శ్రీనివాస్, శివాజీ, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

శారద విద్యాసంస్థల స్పోర్ట్స్ డే



బహుమతి ప్రదానం చేస్తున్న డాక్టర్ వై.రమేష్‌బాబు, శారదా దేవి

మొగల్రాజపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారద విద్యా సంస్థల స్పోర్ట్స్ డేను శనివారం వీపీ సిద్ధార్థ మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి, విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శారదా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్‌బాబు, ఎండీ వై. శారదాదేవి మాట్లాడుతూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా పోటీల్లో పాల్గొనడం మంచి పరిణామమని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల సలహాదారులు ఈఎస్‌ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

పురుషులు, మహిళల హాకీ జిల్లా జట్ల ఎంపిక

లబ్బీపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లిలో ఈ నెల 16 నుంచి 19వరకు జరిగే 14వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్ హాకీ పురుషుల చాంపియన్‌షిప్‌కు జిల్లా పురుషుల జట్టును, ఈ నెల 27నుంచి 29 వరకు అనంతపురంలో జరిగే 14వ సబ్ జూనియర్స్ హాకీ మహిళల చాంపియన్ షిప్‌లో పాల్గొనే మహిళల జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ జనరల్ సెక్రటరీ కె.రాజశేఖర్ తెలిపారు. రెండు జట్లు ఎంపికను సింగ్‌నగర్‌లోని ఎంబీపీ స్టేడియంలో నిర్వహించామని తెలిపారు. పురుషుల జట్టుకు జై భారతి ట్రస్ట్ టీ షర్టులను స్పాన్సర్ చేసినట్లు ఆయన తెలిపారు.



పుస్తకమహోత్సవంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో పుస్తకాన్ని చదువుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



భారత రాజ్యాంగం పుస్తకావిష్కరణలో పాల్గొన్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గేయానంద్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



తల్లడిల్లే తల్లి వేరు పుస్తకావిష్కరణలో పాల్గొన్న సినీగేయ రచయిత రసరాజు, విజయ్‌కుమార్ తదితరులు

రాజ్యాంగంపై చర్చ జరగాలి

● 'భారత రాజ్యాంగం' పుస్తకావిష్కరణలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గేయానంద్

విజయవాడ కల్చరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): దేశాన్ని మరింత ఆధునిక దేశంగా మార్చేందుకు రాజ్యాంగంపై చర్చ జరగాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గేయానంద్ అన్నారు. పుస్తక మహోత్సవంలో శనివారం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన 'భారత రాజ్యాంగం' పుస్తకాన్ని, రాం ప్రదీప్ రాసిన 'విస్మృత మహనీయులు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. దేశంలో అన్ని గొంతుకలు వినబడాలని, అన్ని అభిప్రాయాలు వెల్లడించేందుకు, చర్చలు జరిగేందుకు తగిన వాతావరణాన్ని నెలకొల్పాలని ఆయన ఆకాంక్షించారు. రాజ్యాంగం ప్రజలకే సర్వాధికారాలు ఇచ్చిందని, వారి హక్కులూ, బాధ్యతలు వారికి అర్థమయ్యేందుకు లక్ష్మణరావు రచన ఉపయోగపడుతుందన్నారు. రాజ్యాంగంలో ప్రతిపాదించిన మౌలిక విలువలు, సూత్రాల అమలు అనుమానాస్పదంగా మారిందని రచయిత లక్ష్మణరావు అభిప్రాయపడ్డారు. మరో రచయిత రాం ప్రదీప్ మాట్లాడుతూ చరిత్రలో కీలకపాత్ర పోషించిన మహనీయులు అనేక కారణాల వల్ల మరుగునపడటం విషాదకరమన్నారు. యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మనిషిని మేలు కొల్పేదే కవిత్వం

●'తల్లడిల్లే తల్లి వేరు' పుస్తకావిష్కరణలో సినీగేయ రచయిత రసరాజు

మనిషిలో చైతన్యాన్ని కలిగించి మేలు కొల్పేదే అసలైన సాహిత్యమని సినీగేయ రచయిత రసరాజు వ్యాఖ్యానించారు. పుస్తకం మహోత్సవంలో శనివారం మల్లెతీగ మాసపత్రిక నిర్వహణలో సరికొండ నరసింహారాజు రచించిన తల్లడిల్లే తల్లి వేరు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు పుస్తకాన్ని సమీక్షించారు. నరసింహారాజు తన కవిత్వంలో తెలుగు భాషలో కొన్ని కొత్త పదబంధాలను సృష్టించారన్నారు. ఆధునిక కవిత్వంలో సరికొండ ఒక కొత్త వాక్యం అని సభాధ్యక్షుడు ఘంటా విజయ్ కుమార్ అన్నారు. నరసింహారాజు తన కవిత్వంతో సమాజంలో అరుణ పతాకం ఎగరేశారని విరసం బాధ్యుడు అరసవల్లి కృష్ణ అన్నారు. పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, విశ్రాంత తహసీల్దార్ కూరపాటి కోటంరాజు, మల్లెతీగ కలిమిశ్రీ పాల్గొన్నారు.

వేదాలు నేటికీ చర్చనీయాంశాలే

వేల సంవత్సరాల క్రితం వేదాలు ఏర్పడినప్పటికీ నేటికీ చర్చనీయాంశాలేనని రెంటాల శ్రీవెంకటేశ్వరరావు అన్నారు. పుస్తక మహోత్సవంలో విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. రుగ్వేద 'యథార్థ దర్శనం', 'వెలుతురు', 'స్వప్నసాగరం' 'ఈ గులాబీకి ముళ్లు లేవు' పుస్తకాలను ఆవిష్కరించాక ఆయన మాట్లాడారు. వేదాలు అపౌరుషేయాలు కానప్పటికీ వాటిలోని సౌందర్యాన్ని, ప్రకృతికి సంబంధించిన అవగాహననూ కాదనలేమన్నారు. సమాజశాస్త్ర అధ్యయనానికి కావాల్సిన సమాచారమంతా పుష్కలంగా ఉందన్నారు. నేడు పూజిస్తున్న దేవతలెవరూ వేదాల్లో లేరన్నారు. వేదాలు అధ్యయనం చేస్తున్నవారిలో, గౌరవిస్తున్నవారిలో చాలామందికి వాటి అర్థం తెలియదన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకుడు గడ్డం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. గుమ్మా సాంబశివరావు 'వెలుతురు' పుస్తకాన్ని సమీక్షించారు. కథా సౌందర్యానికి సంబంధించిన నియమాలను వివరిస్తూ, రసరాజుగారి కథాసంపుటిలో ఆ లక్షణాలున్నాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. రచయిత రసరాజు. గుజ్జు చెన్నారెడ్డి, తాటి శ్రీకృష్ణ, విశాలాంధ్ర మేనేజరు మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.



విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ఆధ్వర్యంలో రుగ్వేద యథార్థ దర్శనం, వెలుతురు పుస్తకాల ఆవిష్కరణ

జీవితానుభవానికి అక్షర రూపం..'జీవితం- ఒక అవగాహన'

జీవితానుభవాన్ని అక్షరరూపంగా మలిచిన గ్రంథమే జీవితం - ఒక అవగాహన అని పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు అన్నారు. పుస్తకమహోత్సవంలో జమ్ముల చౌదరయ్య రచించిన జీవితం- ఒక అవగాహన పుస్తకావిష్కరణ సభకు ఆయన అధ్యక్షత వహించారు. జీవితాన్ని తనదైన కోణంలో పరిశీలించి, తర్వాత తరాలకు అవగాహన కల్పించడం కోసం జమ్ముల చౌదరయ్య చేసిన కృషిని ప్రశంసించారు. గ్రంథాన్ని డాక్టర్ గుమ్మా సాంబశివరావు సమీక్షించారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు జీవిత అనుభవాన్ని రంగరించి వ్యక్తిత్వ వికాసం మీద పుస్తకం రాశారని, సమాజానికి కావాల్సిన సమాచారాన్ని సంపూర్ణంగా అందించారని ఆయన పేర్కొన్నారు. సమాజంపై స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తి జమ్ముల చౌదరయ్య అని అంబేడ్కర్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ వెలగా జోషి పేర్కొన్నారు. వీబీఎఫ్ఎస్ గౌరవాధ్యకుడు బెల్లపు బాబ్జి, రచయిత జమ్ముల చౌదరయ్య, వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శతకాలు సంస్కృతికి దర్పణాలు

● సినీ రచయిత రసరాజు



విజయవాడ కల్చరల్: తెలుగు సాహిత్య ప్రపంచంలో రసరాజుకు ఒక మంచి పేజీ ఉంది. ఆయన పూర్తి పేరు రంగినీని సత్యనారాయణరాజు(రసరాజు). 1943లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పాశర్లపూడిలంకలో జన్మించిన ఆయన జూనియర్ అకౌంట్స్ అధికారిగా వృత్తి నిర్వహించినప్పటికీ, సాహిత్యంపై అపారమైన ఆసక్తితో ఎంతో సాహిత్య సృష్టి చేశారు. పుస్తక ప్రదర్శనకు వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. శతకాలు సంస్కృతికి దర్పణాలన్నారు. అవి మనిషి ఎలా పురోగమించాలో చెబుతున్నాయన్నారు. ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో వాటిని ప్రవేశపెట్టాలన్నారు. తనను సినిమా పరిశ్రమకు జగ్గయ్య పరిచయం చేశారని, మోహన్‌బాబుతో జరిగిన పరిచయంతో చినుకు రాలితే చిగురు నవ్వదా, అందమైన వెన్నెలలోన అచ్చ తెలుగు పడుచువలె వంటి పాటలు రాశానని తెలిపారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీ నుంచి కళాసాగర్ అవార్డు వచ్చిందన్నారు. అనేక పద్యాలు, సంగీతరూపకాలు రాశానన్నారు. తెలుగు తోరణంలో గోంగూర నుంచి గోవిందుని వరకు రాసిన సంగీత రూపకానికి గజల్ శ్రీనివాస్ గాత్రాన్ని అందించారని, అమెరికాలోని నాట్స్ వేదికపై ప్రదర్శించగా మంచి పేరు తెచ్చిపెట్టిందని పేర్కొన్నారు. కవితలు, కాలమ్స్, గజల్స్ నానీలు రాశానని, రసభారతి, వేదిక, రసకలశం, కొమ్మ-రెమ్మ ప్రసిద్ధి చెందాయని తెలిపారు. వేదిక కృతి 2003లో నన్నయ భట్టారక పీఠం అవార్డు ప్రదానం చేసిందన్నారు.



నచ్చిన పుస్తకాన్ని ఎంచుకుంటున్న పుస్తకప్రియులు



సంక్రాంతి ఆత్మీయ కలయిక కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

కర్ణాటక, మహారాష్ట్ర దయ తలిస్తేనే

ఏపీ, తెలంగాణకు నీళ్లు

● ఇప్పటికైనా నీటి వనరుల కోసం ఇరు రాష్ట్రాల సీఎంలు కలిసి పోరాడాలి: మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

మొగల్రాజపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'బ్రిజేష్ ట్రిబ్యునల్ కృష్ణానది మిగులు జలాలు వాడుకోవడంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసింది. దానిని సుప్రీం కోర్టులో అడ్డుకుని నేను స్టే తెచ్చాను. ఎగువ రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర దయ తలిస్తే తప్ప ఏపీ, తెలంగాణకు నీళ్లు రావు. నీటి కేటాయింపులు లేకుండా ప్రాజెక్టులు కట్టి ఉపయోగం ఏంటి? ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల సీఎంలు ఇద్దరూ నీటి వనరుల కోసం కలిసి పోరాటం చేయాలి.' అని మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సమతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన సంక్రాంతి ఆత్మీక కలయిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. పోలవరం విషయంలో ముఖ్యమంత్రులు ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రభుత్వాలతో మాట్లాడాలని, రెండుచోట్లా బీజేపీ ప్రభుత్వాలు, ఏపీలో కూటమి ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. విభజన చట్టం ప్రకారం 371డీ గురించీ మాట్లాడుకోవాలని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధిపై చర్చ జరగాలని కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు సూచించారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా చర్చ జరగడానికి ఇలాంటి ఆత్మీయ కలయికలు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని, పోలవరం నిర్మాణం పూర్తి చేయాలని సీపీఐ రాష్ట నాయకుడు రామకృష్ణ సూచించారు. అమరావతి కొత్త ప్రభుత్వ హయాంలో పూర్తవుతుందన్నారు. పోలవరం ఎత్తు తగ్గించకుండా నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే కృష్ణాడెల్టాపైన దృష్టి సారించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. నీటి కొరత రాకుండా, నీరు నిల్వ ఉండేలా చూడాలన్నారు. ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్న కృష్ణారావు ఆలోచనలప్రకారం కలయికలో పాల్గొంటున్న సమాజంలో వివిధ రంగాల ప్రముఖులు రాష్ట్ర అభివృద్ధి కోసం చేసే ఆలోచనలు అందరి ఆమోదంతో ప్రభుత్వాలకు పంపాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. ప్రత్యేక హోదా, హామీల సాధనకు అందరం కలిసి ప్రభుత్వాలపైన ఒత్తిడి తేవాలని సీపీఐ లిబరేషన్ నాయకుడు హరినాథ్ పిలుపునిచ్చారు. ఎన్ఆర్ఐ కోమటి జయరాం మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలని, ప్రభుత్వాలు కూడా ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దేశ ప్రగతిలో కీలకంగా ఉండే రైతుల రక్షణకు చట్టాలు లేవని, అదే ఒక కంపెనీలో పని చేసే చిరుఉద్యోగికి పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సౌకర్యాలు ఉంటాయని, ఈ పరిస్థితి మారాలని సెంటర్ ఫర్ లిబర్టీ అధ్యక్షుడు నల్లమోతు చక్రవర్తి అన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు వీవీ కృష్ణారావు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నా అక్కడి నుంచే వెబ్‌క్యాస్టింగ్ ద్వారా మాట్లాడారు. సంక్షేమ రాజ్యం అంటే సక్రమంగా పన్నులు వసూలు చేసి సక్రమంగా ఖర్చు చేయడమన్నారు. పథకాల పేరుతో పంచడం కాదన్నారు. మానవ హక్కుల నాయకుడు ఆంజనేయులు, రైతు సంఘం నాయకుడు అక్కినేని భవానీప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, నరహరిశెట్టి నరసింహారావు, వైసీపీ నాయకులు న్యాయవాది రాజిరెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి బలరామయ్య మాట్లాడారు. కార్యక్రమాన్ని ప్రముఖ న్యాయవాది పదిరి రవితేజ నిర్వహించారు. ఆత్మీయకలయికలో నగరంలోని ప్రముఖులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జోసఫ్ తంబి తిరునాళ్ల

● అన్ని ఏర్పాట్లు చేశాం: రెక్టర్ రెవరెండ్ ఫాదర్ పాలడుగు జోసఫ్

ఉంగుటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పెదఅవుటపల్లిలోని సుప్రసిద్ధ కతోలికా పుణ్యక్షేత్రంలో ఈనెల 13నుంచి 15వరకు(మూడురోజులపాటు) బ్రదర్ జోసఫ్ తంబి 80వ వర్ధంతి మహోత్సవాల(తిరునాళ్ల)ను నిర్వహించనున్నారు. ఆ మూడురోజులూ భక్తులు ప్రశాంత వాతావరణంలో దైవదర్శనం చేసుకుని తిరిగి క్షేమంగా ఇళ్లకు చేరేలా, ఉత్సవాలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవరెండ్ ఫాదర్ పాలడుగు జోసఫ్ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తాగునీరు, శానిటేషన్, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. స్థానిక రైల్వేస్టేషన్లో నాలుగు ఎక్స్‌ప్రెస్‌రైళ్లు ఆగేలా, అన్ని ఆర్టీసీ డిపోలనుంచి బస్సు సర్వీసులు నడిపేలా ఆయాశాఖల ఉన్నతాధికారులనుంచి అనుమతి తీసుకున్నామన్నారు.

అభివృద్ధికి ఆనవాళ్లుగా గ్రామాలు

● కూటమి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మారనున్న రూపురేఖలు

● పరిటాల 'పల్లె పండుగ'లో ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్‌యాదవ్

కంచికచర్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గ్రామాల రూపురేఖలు మారిపోతాయి. అభివృద్ధికి ఆనవాళ్లుగా నిలుస్తాయి. ప్రతి రోడ్డూ సిమెంట్ రోడ్డుగా మారుతుంది. పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మొదటి విడతగా రూ.4,500 కోట్లు కేటాయించాం.' అని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్నారని, భారీగా నిధులు తెస్తున్నారని ఆయన తెలిపారు. పరిటాల పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. వైసీపీ అరాచక పాలన వల్ల గాడి తప్పిన వ్యవస్థల్ని ఆరు నెలల్లో సీఎం చంద్రబాబు సరిదిద్దారని, వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో కలిసి ఆక్సిజన్ ఇచ్చి నిలబెట్టారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. పరిటాలకు రైల్వేస్టేషన్, లాజిస్టిక్ హబ్ మంజూరైందని, హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల రోడ్డుగా అభివృద్ధి చెందుతోందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. జిల్లాలో 523 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయించినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎస్ఎస్పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు, కోగంటి బాబు, ఆర్డీవో బాలకృష్ణ, పశుసంవర్ధకశాఖ జేడీ హనుమంతరావు, డీపీఎం లావణ్య కుమారి, డీఎంహెచ్‌వో సుహాసిని, డ్వామా పీడీ రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, వేదికపై ఎంపీ కేశినేని చిన్ని, విప్ తంగిరాల సౌమ్య, కలెక్టర్ లక్ష్మీశ

త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్, 'తల్లికి వందనం'

'త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడుతుంది. 20 లక్షల ఉద్యోగాల నియామకానికి సన్నాహాలు చేస్తున్నాం. తల్లికి వందనం పథకం త్వరలో అమలవుతుంది. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ రూ.20వేలు, జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందిస్తాం. మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తాం. ఎన్టీఆర్ ఆరోగ్యసేవ కింద రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందొచ్చు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలో ప్రారంభం కానున్న ఔటర్ రింగు రోడ్డు పనులతో అభివృద్ధి జెట్ స్పీడుతో ముందుకెళుతోంది.'అని సభలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు.

శ్మశానభూమిని ఎస్టీపీకి కేటాయించాం

● తహసీల్దార్ మనోహర్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

జగ్గయ్యపేట, జనవరి 11(ఆంధ్రజ్యోతి): చిన్నేటి ఒడ్డున శ్మశాన భూమి కబ్జా అవుతోందంటూ శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ మనోహర్ స్పందించారు. చిన్నేటి పక్కన ప్రస్తుతం ఆక్రమిస్తున్న భూమి ఆర్ఎస్ నెం.259/1లో 56 సెంట్లు, 261లో 10 సెంట్లు ఉందని మొత్తం స్థలాన్ని పురపాలకసంఘం ఏర్పాటుచేయబోయే మురుగు నీటి శుద్ధిప్లాంట్‌కు కేటాయిస్తూ గత ఏడాది డిసెంబరు 24న నందిగామ ఆర్డీవో ద్వారా ప్రతిపాదనలు పంపితే కలెక్టర్ లక్ష్మీశ ఆమోదించారని తెలిపారు. కొద్ది రోజుల్లోనే ఆ భూమిని పురపాలకసంఘానికి అధికారికంగా స్వాధీనం చేస్తామన్నారు. ఆ భూమిలో నిర్మాణాలు లేదని, చదును చేసినట్లు ఉందన్నారు. పురపాలకసంఘం అందులో ఎస్టీపీ పనులు చేసుకునేంతవరకు ఫెన్సింగ్ వేసి బోర్డు పెట్టుకోవాలని కోరతామన్నారు.

సోనోవిజన్‌లో స్క్రాచ్ కార్డు స్కీమ్

వన్‌టౌన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా వినియోగదారులు ఎంతగానో ఆదరించి, అభిమానించిన స్క్రాచ్ కార్డు స్కీమ్‌ను ప్రారంభిస్తున్నట్లు సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పి.భాస్కర్‌మూర్తి తెలిపారు. శనివారం విజయాటాకీసు సెంటర్ సోనోవిజన్ విజయప్లాజాలో విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. ఈ స్కీమ్‌లో ప్రతి రూ.2వేల కొనుగోలుతో స్క్రాచ్ కార్డు ఉంటుందని ఇందులో రూ.100 నుంచి రూ.లక్ష వరకు తక్షణ నగదు బహుమతిలో మినిమం ఆరు శాతం, ఇంకా ఎక్కువ రాయితీని పొందొచ్చని తెలిపారు. అన్ని పెద్ద కంపెనీల నుంచి ఎల్ఈడీ, వాషింగ్‌మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు విస్తృత శ్రేణిలో తమ షోరూమ్‌లో లభిస్తున్నాయన్నారు. ప్రత్యేక క్యాష్ బ్యాక్ ఆఫర్లలో రూ.26వేలు, 22.5 శాతం వరకు లబ్ధి ఉంటుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అందరికన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సేవలు అందిస్తున్న అతి పెద్ద ఎలక్ట్రానిక్ స్టోర్ తమదన్నారు. పెద్ద కంపెనీల గృహోపకరణాలు కొత్త మోడళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సంక్రాంతి డిస్కౌంట్ సేల్‌లో వడ్డీగాని, డీబీడీ లేకుండా ఫైనాన్స్ సౌకర్యం ఉందన్నారు. అందరికన్నా తక్కువ ధరలు, నమ్మకమైన సర్వీసుతో అందిస్తామని వినియోగదారులకు హామీ ఇస్తున్నామన్నారు.

మెకానిక్‌ను బూటుకాలితో తన్నిన హెడ్ కానిస్టేబుల్

● ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు..ఆలస్యంగా వెలుగులోకి



ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అశోక్

విద్యాధరపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): భవానీపురం సీసీఎస్ విభాగంలో పనిచేసే ఓ హెడ్ కానిస్టేబుల్ అత్యుత్సాహం ప్రదర్శించాడు. బుల్లెట్ వాహనం చోరీ చేశాడనే ఆరోపణపై స్టేషన్‌కు వచ్చిన రాణిగారితోటకు చెందిన మెకానిక్ అశోక్‌ను బూటు కాలితో తన్నాడు. అశోక్ స్పృహ తప్పి కిందపడి అనారోగ్యానికి గురికావటంతో అతని వెంట వెళ్లిన ముగ్గురు స్నేహితులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాణిగారితోట విజయకృష్ణ థియేటర్ సమీపంలో రెడపంగు అశోక్(29) కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. కృష్ణలంక పోస్టాఫీసు దగ్గరలోని ఎం హోటల్ పక్కన మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నాడు. రెండు నెలల క్రితం విద్యాధరపురం అంబేడ్కర్ రోడ్డులోని ఓ వ్యక్తి బుల్లెట్‌ను రిపేరు చేయించుకున్నాడు. బుల్లెట్ పాత తాళం తొలగించి, కొత్తది వేసి అతనికి అశోక్ ఇచ్చాడు. కొత్త తాళాల్లో ఒకటి బుల్లెట్ యజమానికి ఇవ్వడం మరచిపోయాడు. ఫోన్ ద్వారా తన వద్ద మరొక తాళం ఉందని సందేశం పంపించాడు. ఈ క్రమంలో డిసెంబరు 27వ తేదీ ఉదయం 8 గంటలకు ఇంటి ముందు పార్కింగ్ చేసిన బుల్లెట్ చోరీ అయింది. యజమాని భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఆరోజే ఫిర్యాదు చేశాడు. అశోక్‌కు సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఫోన్ చేసి బుల్లెట్ దొంగిలించావు, వెంటనే భవానీపురం పోలీసుస్టేషన్‌కు రమ్మన్నాడు. తాను స్నేహితులతో కలిసి శ్రీశైలం స్వామి దర్శనానికి వెళ్లానని అశోక్ చెప్పడంతో హెడ్ కానిస్టేబుల్ ఫోన్‌లోనే అసభ్యకరంగా మాట్లాడి, బెదిరించాడు. మరుసటిరోజు వస్తామని చెప్పినా వినకుండా దూషించాడు. శ్రీశైలం నుంచి 28వ తేదీ సాయంత్రం అశోక్ ఇంటికి వచ్చాడు. హెడ్ కానిస్టేబుల్ మళ్లీ ఫోన్ చేయటంతో ఈనెల 2న తన ముగ్గురు స్నేహితులతో కలిసి భవానీపురం సీసీఎస్ స్టేషన్‌కు వెళ్లాడు. డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ లోపలికి వెళ్లిన అశోక్‌ను బూతులు తిట్టి బూటుకాలితో నడుము కింద భాగాన బలంగా తన్నాడని, దీంతో అశోక్ అక్కడికక్కడే కిందపడ్డాడని, చిన్ననాటి లివర్ సమస్య ఉండటం వలన అప్పుడప్పుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని చెప్పామని, అయినా వినలేదని, దూషించాడని స్నేహితులు ఆరోపిస్తున్నారు. అశోక్‌ను మొదట ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రభుత్వ వైద్యులు సూచనతో అతనిని సూర్యారావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్ల చికిత్స అందిస్తున్నారు.

పోలీసుల సంక్రాంతి సంబరాలు

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): నిత్యం లాఠీలు పట్టుకునే చేతులు రంగులు పట్టుకున్నాయి. బందోబస్తులు, ఎస్కార్ట్ విధుల్లో ఉండేవారు గాలిపటాలు ఎగరేశారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏఆర్ గ్రౌండ్స్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అధికారులు, సిబ్బంది అన్న హోదా భేదాలు లేకుండా రంగులతో ముగ్గులు వేశారు. భోగి మంటలు వెలిగించారు. పురుషులు కబడ్డీ ఆడారు. గంగిరెద్దులకు పసుపు, కుంకుమ రాశారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు బహుమతులు ప్రదానం చేశారు. డీసీపీలు తిరుమలేశ్వర రెడ్డి, కృష్ణమూర్తినాయుడు, గౌతమీశాలి, ఏడీసీపీలు ఎస్వీఈ ప్రసాద్, ప్రసన్న కుమార్, ఎం.రాజారావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



భోగిమంటలు వేస్తున్న పోలీసులు

ఏటీఎంలో

బ్లాక్ గ్యాంగ్

● డబ్బులు వచ్చే మార్గాన్ని బ్లాక్ టేపుతో మూసేస్తున్న ముఠా

● ఖాతాదారులు వెళ్లిపోయాక డబ్బులు చోరీ

● ఢిల్లీ, ఆగ్రా నుంచి వచ్చిన నేరగాళ్లు

● పెనమలూరు పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

విజయవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల నుంచి డబ్బులు తీసుకోవడం రాని వారిని మాయ చేసి డబ్బులు కాజేస్తారు కొందరు. ఏటీఎంలను పగలగొట్టి చోరీలు చేసే ముఠాలూ ఉన్నాయి. ఇపుడు ఏటీఎంలలో డబ్బులు కాజేయడానికి కొత్త ముఠా పుట్టుకొచ్చింది. పెనమలూరులో కొత్త విధానంలో డబ్బులు కాజేయడానికి ప్రయత్నించిన ముఠాను పెనమలూరు క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ, ఆగ్రా ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువకులు వివిధ రాష్ట్రాల్లో తిరుగుతూ ఏటీఎంలను టార్గెట్ చేసుకుంటారు. కొన్ని బ్యాంకులు ఏటీఎం కేంద్రాల్లో పాత యంత్రాలను కొనసాగిస్తున్నాయి. మరి కొన్ని బ్యాంకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఏటీఎంలను ఉపయోగిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు మాత్రం పెట్రో అనే కంపెనీకి చెందిన ఏటీఎం యంత్రాలను ఉపయోగిస్తున్నాయి. వాటికి ఖాతాదారులు ఏటీఎం వద్ద నిలబడినప్పుడు కాళ్ల భాగం వద్ద చిన్న తలుపు ఉంటుంది. వెనుక నగదు క్యాసెట్ ఉంటుంది. ఏటీఎంలో కార్డు పెట్టి పిన్ ఎంటర్ చేసిన తర్వాత ఈ క్యాసెట్ ద్వారా డబ్బులు పైకి వస్తాయి. ఈ ఉత్తరాది ముఠా ఏటీఎం కింది భాగాన ఉన్న చిన్న తలుపును నకిలీ తాళంతో తెరుస్తుంది. నగదు క్యాసెట్‌కు నోట్లు పైకి రావడానికి ఉన్న సన్నని మార్గాన్ని నలుపురంగు టేపుతో మూసేస్తుంది. ఖాతాదారులు పిన్ ఎంటర్ చేసినప్పుడు డబ్బులు తీసుకున్నట్టు రశీదు బయటకు వస్తుంది. ఏటీఎం నుంచి డబ్బులు బయటకు రావు. ఏదో సాంకేతికలోపం ఉందని భావించి ఖాతాదారులు వెళ్లిపోయాక పక్కనే నక్కిన ముఠా ఏటీఎంలోకి వెళ్లి నలుపు టేపును తొలగించి డబ్బులు కాజేస్తుంది. తర్వాత ఆ డబ్బులు తమ సొంత ఖాతాల్లో డిపాజిట్ మిషన్ నుంచి జమ చేసుకుంటారు. పెనమలూరు మండలం కానూరులోని అశోక్‌నగర్‌లో ఉన్న ఏటీఎం నుంచి ఈవిధంగా చోరీ చేయడానికి ప్రయత్నిస్తుండగా ముగ్గురు యువకులను పెనమలూరు క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారిని విచారించగా నగదును కాజేయడంలో ఉన్న ఈ కొత్త విధానాన్ని వెల్లడించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఈ తరహాలో ఏటీఎం నుంచి బయటకు వచ్చే ఖాతాదారుల నగదును నొక్కేశారు. ఈ వివరాలను పెనమలూరు పోలీసులు త్వరలో వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.



మాట్లాడుతున్న రామ్ సినిమాస్ థియేటర్ యజమాని యలమంచలి రామచంద్రరావు, కేఎస్ దామోదర్‌ప్రసాద్

రామ్‌గోపాల్ థియేటర్..

ఇక రామ్ సినిమాస్

నగరవాసులకు అందుబాటులోకి తెచ్చిన యాజమాన్యం

గుణదల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రామ్‌గోపాల్ థియేటర్‌ను ఆధునిక హంగులతో ఈతరం కోరికలకు అనుగుణంగా తీర్చిదిద్ది రామ్ సినిమాస్‌గా నామకరణం చేసి శనివారం నుంచి నగరవాసులకు అందుబాటులోకి తెచ్చామని థియేటర్ అధినేత యలమంచలి రామచంద్రరావు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1976 మార్చి 6న రామ్‌గోపాల్ థియేటర్‌ను ప్రారంభించామని, 48 ఏళ్ల నగరవాసులకు వినోదాన్ని అందించిందని తెలిపారు. 2023లో రామ్‌గోపాల్ థియేటర్ ఆధునీకరణ నిమిత్తం మూసేశామన్నారు. ప్రేక్షకుల అభిరుచుల మేరకు రామ్‌గోపాల్ థియేటర్‌ను పూర్తిగా ఆధునీకరణ చేసి రెండు స్క్రీన్లతో రామ్ సినిమాస్‌గా తీర్చిదిద్ది నగరవాసులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రొజెక్షన్ సిస్టమ్ 30 అనుకూలతతో 4కే, 2కే డిజిటల్ లేజర్ ప్రొజెక్టర్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. స్క్రీన్ -1 లో 376 సీట్లు, స్క్రీన్ -2లో 218 సీట్లు ఉన్నాయని తెలిపారు. కార్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు అనువుగా స్థలం ఉందన్నారు. రామ్ సినిమాస్ నందు మొదటగా రామ్‌చరణ్, బాలకృష్ణ, వెంకటేష్‌లు నటించిన కొత్త సినిమాలను ప్రదర్శిస్తున్నామన్నారు. టికెట్లు శనివారం నుంచి కౌంటర్‌తోపాటు బుక్‌మై షో యాప్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రామ్ సినిమాస్ ప్రారంభ కార్యక్రమంలో యలమంచలి రామ్, యలమంచలి రాహుల్, యలమంచలి రోహన్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదర్ పాల్గొన్నారు.







ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా వి డుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
బ్యాక్ ఇన్ యాక్షన్	హాలీవుడ్ మూవీ	జనవరి 17
ది రోషన్స్	హిందీ డాక్యు సిరీస్	జనవరి 17
అమెజాన్ ప్రైమ్		
పాతాళ్ లోక్ 2	హిందీ సిరీస్	జనవరి 17
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
పవర్ ఆఫ్ పాంచ్	హిందీ సిరీస్	జనవరి 17
సోనీ లివ్		
పని	తెలుగు చిత్రం	జనవరి 16
ఎంఎక్స్ ప్లేయర్		
చిడియా ఉడ్	హిందీ సిరీస్	జనవరి 15
ఎపిక్ ఆన్		
గృహ లక్ష్మి	హిందీ సిరీస్	జనవరి 16
మనోరమా మ్యాక్స్		
ఐ యామ్ కథలాన్	మలయాళ చిత్రం	జనవరి 17

మూడు తరాల కథ

ప్రస్తుతం ఓటీటీల్లో సినీ సెలబ్రిటీల డాక్యుమెంటరీల ట్రెండ్ నడుస్తోంది. ఈ కోవలో వస్తున్న మరో డాక్యుమెంటరీ 'ది రోషన్స్'. బాలీవుడ్‌లో ప్రముఖ కుటుంబాల్లో ఒకటైన రోషన్స్ ఫ్యామిలీకి సంబంధించిన ఈ డాక్యుమెంటరీ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ నెల 17 నుంచి స్ట్రీమింగ్‌కు రానుంది. అగ్రహీరో హృతిక్ రోషన్ సినీ కెరీర్‌తో పాటు వ్యక్తిగత, కుటుంబ విశేషాలను ఇందులో ప్రముఖంగా చూపించనున్నారు. అలాగే వారి కుటుంబంలోని మూడు తరాల గురించి ఇందులో చూపించబోతున్నారు. హృతిక్‌రోషన్ తండ్రి రాకేశ్ రోషన్, తాతయ్య రోషన్‌లాల్ నగ్రత్ సినీ పరిశ్రమకు



అందించిన సేవలను ఆవిష్కరించనున్నారు. అనిల్ కపూర్, షారూఖ్ ఖాన్, ప్రియాంక చోప్రా లాంటి సన్నిహితులు రోషన్స్ కుటుంబం గురించి చెప్పిన ఆసక్తికర విషయాలు అభిమానులు అలరించనున్నాయి. ఈ డాక్యుమెంటరీకి శశిరంజన్ దర్శకుడు.

ముత్యాల ముగ్గు



యం.రెడ్డి రాణి
చిత్తూరు

15 చుక్కలు
8 వచ్చేవరకు
సందుచుక్క





పసుపులేటి మానస
రేపల్లె, గుంటూరు

11-6
మధ్యచుక్క





శాంతి నర్స
హైదరాబాద్

15 చుక్కలు
8 వరకు
మధ్యచుక్కలు




సంక్రాంతి పండగకు తెలుగు చిత్రసీమకు మధ్య ఓ బలమైన సెంటిమెంటు ఉంటుంది. ఈ పండగకు విడుదలైన వాటిలో ఎక్కువ చిత్రాలు బాక్సాఫీసును బద్ధలు కొట్టిన సందర్భాలు అనేకం. అందుకే సంక్రాంతి అంటేనే దర్శకనిర్మాతలకు కలిసొచ్చే పండగ. చిన్న సినిమాల నుంచి పెద్ద సినిమాల వరకూ పోటీ పడుతుంటాయి. కానీ ఈసారి స్టార్ హీరోల మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. సంక్రాంతి బరిలో కేవలం మూడు సినిమాలు తలపడుతున్నాయి.

సంక్రాంతి పందెం కోళ్లు



ఈ సంక్రాంతికి విడుదలైన తొలి చిత్రం 'గేమ్ ఛేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఆ తర్వాత నందమూరి బాలకృష్ణ హీరోగా బాబి కొల్లి దర్శకత్వంలో రూపొందిన 'డాకు మహారాజ్'ని ఈనెల 12న విడుదల చేస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్మించారు. చివరగా దిల్ రాజు ప్రొడక్షన్స్‌లోనే తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాన్ని 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఎఫ్2, ఎఫ్3 తరవాత వస్తున్న సినిమా అయినందున ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

అంచనాలు పెంచిన ట్రైలర్స్...

సినిమాలను విడుదల చేసే క్రమంలో మూడు చిత్రాల ట్రైలర్లు విడుదలయ్యాయి. దీంతో ప్రేక్షకుల్లో ఈ మూడు సినిమాలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ట్రైలర్లు కూడా వరుస క్రమంలోనే విడుదలవడం గమనార్హం. ముందుగా వచ్చిన 'గేమ్ ఛేంజర్' మంచి హైప్‌ని క్రియేట్ చేసింది. ట్రైలర్‌లో రామ్‌చరణ్ మాస్ లుక్‌తో పాటు, కాస్ట్లీ విజువలైజేషన్స్ ఆకట్టుకున్నాయి. అయితే ఈ చిత్రం గురించి నిర్మాత దిల్‌రాజు ఓ ప్రమోషన్‌లో మాట్లాడుతూ 'శంకర్ గారు ఏం చేస్తారండీ! ఇప్పుడు ఈ సినిమా ఎలా ఉంటుందో అని అందరూ అంటున్నారు. ఇది నా కమ్‌బ్యాక్ ఫిల్మ్. ప్రేక్షకులు విజిల్ వేసే సన్నివేశాలు ఇందులో ఎన్నో ఉన్నాయి' అని అన్నారు. ఆయన అన్నట్టుగానే సినిమా విడుదలైన తరవాత రామ్‌చరణ్ అభిమానులు, ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. అయితే సినీ విమర్శకులు మాత్రం యావరేజ్ అనే అంటున్నారు. 'నానా హైరానా' పాటకి సినిమాలో చోటు లేకపోవడం ప్రేక్షకులను నిరాశకు గురిచేసింది. అయితే ఈ పాటను ఈనెల 14న జోడించనున్నట్లు నిర్మాతలు ప్రకటించడం కొంత వరకు రామ్‌చరణ్ అభిమానులకు ఊరట.

బాలకృష్ణ 'డాకు మహారాజ్' చిత్ర ట్రైలర్ కూడా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ఆయన అభిమానులు కోరుకునే అంశాలు అన్నీ ఈ చిత్రంలో ఉన్నట్లు అర్థమవుతోంది. ఈ ట్రైలర్‌తో సినిమాకు పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది. బాలయ్య, సంక్రాంతి కాంబినేషన్‌కు మంచి ట్రాక్ రికార్డే ఉంది. ఈ చిత్రం రిలీజ్‌తో మళ్లీ ఓ మ్యాజిక్ క్రియేట్ అయ్యేలా ఉంది అని అంటున్నారు బాలయ్య అభిమానులు. 'భగవంత్ సింగ్ కేసరి'లో తండ్రీ కూతుళ్ల సంబంధం ఉన్నట్లే ఈ చిత్రంలోనూ ఓ చిన్న పాప సెంటిమెంట్‌ని చేర్చారు. బాలయ్య అంటే యాక్షన్ ఉండటమే కాదు... బలమైన ఫ్యామిలీ సెంటిమెంట్ కూడా ఉండాలి. ఆ కోణంలోనే ఈ చిత్రం రూపుదిద్దుకున్నట్లు ట్రైలర్ తెలియజేస్తోంది. అటు నిర్మాతలు కూడా చిత్రానికి కుటుంబ ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారని బలంగా నమ్ముతున్నారు. ఇప్పటికే ఈ చిత్రంలోని పాటలు హిట్ అయ్యాయి. ముఖ్యంగా 'దబిడి దిబిడి' పాట బాగా ట్రెండ్ అవుతోంది. ఈ పాటపై కొంత వివాదం రేగినప్పటికీ టార్గెట్ ఆడియెన్స్‌కి బాగానే రీచ్ అయ్యిందని చెప్పొచ్చు.



ఇక మూడో చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' 14న విడుదలవుతోంది. ఇది ఒక కుటుంబ కథా చిత్రంగా ఉండబోతోందని తెలుస్తోంది. సంక్రాంతి సందడి మొత్తం ట్రెయిలర్‌లో కనిపిస్తుంది. పండక్కి ఎన్ని సినిమాలు వచ్చినా అందులో కుటుంబ సభ్యులందరూ కలసి సరదాగా చూడగలిగే లైట్ హార్టెడ్ సినిమాలకు ఎప్పుడూ ప్రత్యేకత ఉంటుంది. ఎందుకంటే పండగ అంటే ఫ్యామిలీస్ కలుసుకోవడం. సినిమాకు వెళ్లడం ఒక సంప్రదాయం. ఈసారి ఆ ప్రత్యేకతను 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం సొంతం చేసుకుంది. పైగా దిల్‌రాజు, వెంకటేశ్, అనిల్ రావిపూడి... ఈ ముగ్గురి కాంబినేషన్ పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జానర్. ఇది వరకే వచ్చిన ఎఫ్2, ఎఫ్3తో ఇది రుజువైంది. కాబట్టి ప్రేక్షకులు ఈ పండగకు ఏ చిత్రం చూసినా చూడకపోయినా... దీన్ని మాత్రం చూడకుండా వదలేరు అనే టాక్ వస్తోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అదిరిపోయింది. పాటలన్నీ సూపర్ హిట్ అయ్యాయి. స్వయంగా వెంకటేశ్ ఓ పాటను ఆలపించడం ఈ చిత్రానికే హైలైట్. కనుక ఫ్యామిలీ ఆడియెన్స్ ఎక్కువగా చూసే అవకాశాలున్నాయి.

ప్రచారంలో కొత్త ఒరవడి...

కొవిడ్ తరవాత సినిమా తీరు మారిపోయింది. మంచి కథను ఎంచుకుని ఎంత గొప్పగా తీసినా థియేటర్లకు ప్రేక్షకులు రాకపోతే ఆ సినిమాకు రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. ప్రేక్షకుల అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే నిర్మాతలు మంచి ఓపెనింగ్స్ సాధించుకుంటారు. అయితే ఈ విషయంలో 'సంక్రాంతికి వస్తున్నాం' దర్శకుడు అనిల్ రావిపూడి అందరికంటే ముందున్నారు. ఒక రకంగా చెప్పాలంటే సినిమా ప్రమోషన్‌ని మొత్తం తన భుజస్కందాలపైనే వేసుకున్నారు. సోషల్ మీడియాపై ఎక్కువ ఫోకస్ చేశారు. హీరో, హీరోయిన్లు, ఇతర కీలక నటీనటులతో పలు రీల్స్ చేయడమే కాకుండా తానూ అందులో నటించారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం ద్వారా తన సినిమాపై అందరికంటే ఎక్కువగా బజ్‌ని క్రియేట్ చేయగలిగారు. మిగతా రెండు చిత్రాలతో పోల్చితే 'సంక్రాంతికి వస్తున్నాం' సోషల్ మీడియాలో దూసుకెళ్తోందనే చెప్పొచ్చు.

పాటల ప్రత్యేకత...



- 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలోని 'గోదారి గట్టు' పాట అత్యధిక వ్యూస్‌ని సొంతం చేసుకుంది. ఇప్పటి వరకూ 85 వేల మిలియన్ల మంది చూశారు. ఈ పాటను రమణ గోగుల మధు ప్రియతో కలసి పాడారు. 18 ఏళ్ల బ్రేక్ తరవాత రమణ గోగుల తిరిగి ఆలపించిన పాట ఇదే. సంగీతం... భీమ్స్ సిసిరోలియో.
- 'గేమ్ ఛేంజర్'లోని 'జరగండి' పాట 55 మిలియన్లకు పైగా వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఇదే చిత్రంలోని 'నానా హైరానా' (52 మిలియన్లు), 'రా రా మచ్చా' (42 మిలియన్లు) వ్యూస్ దక్కించుకున్నాయి. 'ధూప్' సాంగ్ 30 మిలియన్లతో కొనసాగుతోంది. కాగా, 'హైరానా' పాటని న్యూజిలాండ్‌లో ఆరు రోజుల పాటు ఎవరూ చిత్రీకరించని విధంగా రెడ్ ఇన్‌ఫ్రా కెమెరాతో తీశారు. ఒక్కో సన్నివేశాన్ని ఒక్కో పెయింటింగ్‌లా విజువల్ బ్యూటీగా మలిచారు. బాస్కో మార్టిస్ కొరియోగ్రఫీని అందించారు. ఒక్క ఈ పాట చిత్రీకరణకే రూ.10 కోట్లు ఖర్చు పెట్టినట్లు వినికిడి.
- 'డాకు మహారాజ్' చిత్ర గీతాలు కూడా అభిమానులను అలరిస్తున్నాయి. ఈ చిత్రంలోని 'డబిడి దిబిడి' 13 మిలియన్లకు పైగా వ్యూస్ దక్కించుకుంది. 'రేజ్ ఆఫ్ డాకు' (5 మిలియన్లకు పైగా), 'చిన్ని' పాట(4 మిలియన్లకు పైగా) వ్యూస్ పొందాయి.

భోగ భాగ్యాలనిచ్చే బొమ్మల కొలువు

సంక్రాంతి అనగానే గుర్తొచ్చే ప్రధాన వేడుక బొమ్మల కొలువు. దీనిని భోగి నాడు ప్రారంభించి కనుమ పండుగ రోజు వరకు కొనసాగిస్తారు. బొమ్మల కొలువుని మూడు, అయిదు, తొమ్మిది మెట్ల వారీగా పేర్చడం తెలుగువారి సంప్రదాయం. ఓ పద్ధతి ప్రకారం మెట్ల మీద బొమ్మలను అందంగా అమరుస్తారు.

- మొదటి మెట్టు మీద చిన్న ఇళ్లు, గుడులు, గోపురాలు, పొలాలు, రకరకాల చెట్లు, పూల తీగలు లాంటి ప్రకృతి సంబంధిత బొమ్మలు పేరుస్తారు.
- రెండో మెట్టు మీద శంఖం, చేప, తాబేలు, నత్త, పీత, ఇతర జలచరాల బొమ్మలు పెడతారు.
- మూడు, నాలుగు మెట్ల మీద చిన్న క్రిమి కీటకాల బొమ్మలు, చీమలు, తుమ్మెదలు, తేనెటీగల బొమ్మలు అమరుస్తారు.
- అయిదో మెట్టు మీద రకరకాల పక్షులు, జంతువుల బొమ్మలను కనువిందుగా పెడతారు.
- ఆరో మెట్టు మీద మనుషుల బొమ్మలు, ఏడో మెట్టుమీద మహనీయుల బొమ్మలు పెడతారు
- ఎనిమిదో మెట్టుమీద అష్ట దిక్పాలకులు, నవ గ్రహాల నాయకులు, పంచభూతాల బొమ్మలు పేరుస్తారు.
- తొమ్మిదో మెట్టు మీద త్రిమూర్తులు అంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల బొమ్మలతోపాటు సరస్వతి, లక్ష్మి, పార్వతి బొమ్మలను పెడతారు.
- వినాయకుడు, కుమారస్వామితో ఉన్న శివ పార్వతుల బొమ్మ.... చిన్న బాబుని ఎత్తుకున్న తల్లి, ఆవు దూడ, పంచాంగం చదువుతున్న బ్రాహ్మణుడు, పెద్ద ముత్తైదువ, పచారీ కొట్టు కోమటి బొమ్మలను తప్పనిసరిగా బొమ్మల కొలువులో ఉంచుతారు. కాల క్రమంలో మట్టి బొమ్మలు, స్వాతంత్ర్య సమరయోధుల బొమ్మలు, వాహనాల బొమ్మలు, బార్బీ బొమ్మలు, పింగాణీ బొమ్మలు కూడా ఈ కొలువులో చోటు సంపాదించుకున్నాయి. ఏటా ఓ కొత్త బొమ్మను తప్పనిసరిగా కొని కొలువులో పెడతారు.
- బొమ్మల కొలువు పెట్టిన తరవాత చుట్టు పక్కల ఉండే మహిళలందరిని పేరంటానికి పిలుస్తారు. బొమ్మలకు ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తారు. బొమ్మల కొలువు చూడడానికి వచ్చిన ముత్తైదువలను పసుపు, కుంకుమ, తాంబూలంతో సత్కరించి గోదాదేవి బొమ్మనిచ్చి పంపుతారు. బొమ్మల కొలువు పెట్టిన ఇల్లు భోగభాగ్యాలతో వర్ధిల్లుతుందని ఒక నమ్మకం.
- కొన్ని ప్రాంతాల్లో రాజు, రాణి, పెళ్లి కూతురు, పెళ్లి కొడుకు, మేళతాళాలు, పెళ్లితంతు బొమ్మలు పెట్టి బొమ్మల పెళ్లి చేసే వేడుక కూడా ఉంది.



బొమ్మల పెట్టె

- బొమ్మల కొలువులో పెట్టే బొమ్మలను జాగ్రత్తగా దాచడానికి ఓ చెక్క పెట్టె ఉంటుంది. బొమ్మలన్నింటినీ కాగితాలు లేదా సన్నని బట్టలో చుట్టి ఈ పెట్టెలో పెడతారు. దీనిని ఎవరూ ముట్టుకోకుండా ఇంట్లో అటక మీద భద్ర పరుస్తారు.
- బొమ్మల కొలువు పెట్టే రోజున ఈ పెట్టెను జాగ్రత్తగా కిందికి దించుతారు. ఇంట్లోని పురుషులు అంటే తాత, తండ్రి, పినతండ్రి కలిసి పెట్టెకు పూజ చేసి హారతి ఇస్తారు. పిల్లల చేత చప్పట్లు కొట్టిస్తూ ఆనందోత్సాహాల మధ్య పెట్టె తెరుస్తారు. ఇది భోగినాడు జరిగే అద్భుతమైన వేడుక.

పిల్లల ఎదుగుదలకు...

పిల్లల శారీరక ఎదుగుదలకు, మానసిక వికాసానికి పోషకాహారం తప్పనిసరి. పిల్లలు ఆరోగ్యంగా పెరగాలంటే ఏం తినిపించాలో తెలుసుకుందాం!

పాలు: ప్రతిరోజూ పిల్లలకు కనీసం రెండు గ్లాసుల పాలు తాగించాలి. పాలతో తయారయ్యే పెరుగు, జున్ను లాంటివి కూడా తినిపించాలి. వీటిలో కాల్షియం, ప్రొటీన్లు, మంచి కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవన్నీ పిల్లల్లో దంతాలు,



ఎముకలు, కండరాల పెరుగుదలకు తోడ్పడతాయి. పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చేస్తాయి. రక్తపోటు, గుండె పనితీరు నియంత్రణలో ఉండేలా సహకరిస్తాయి.

ప్రొటీన్ పదార్థాలు: ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను పిల్లలకు పెట్టాలి. గుడ్లు, మాంసం, చేపలు, నట్ బటర్, బాదం, బీన్స్, బఠానీలు, సోయా పన్నీర్‌లను అల్పాహారంలో చేర్చి తినిపించాలి. దీనివల్ల పిల్లలకు అవసరమైన ప్రొటీన్లు, పీచుపదార్థాలు అంది మెదడు, కణజాలం వృద్ధి చెందుతాయి.

పండ్లు: పిల్లలకు తరచూ పండ్లను తినిపించడం వల్ల వారి ఎదుగుదలకు కావాల్సిన విటమిన్లు, ఖనిజ లవణాలు, ఇతర పోషకాలు అందుతాయి. నారింజ, స్ట్రాబెరీ లాంటి సిట్రస్ జాతి పండ్లను తినిపిస్తే పిల్లలకు సి విటమిన్ లభిస్తుంది. ఇది వారిలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. యాపిల్స్ అరటి పండ్లు తినిపించడం వల్ల యాంటీఆక్సిడెంట్లు, పీచుపదార్థాలు, పొటాషియం లభిస్తాయి. ఇవి పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

తృణ ధాన్యాలు: బ్రౌన్ బ్రెడ్, టోర్టిల్లా, ఫ్లాట్ బ్రెడ్, పాస్తా, నూడుల్స్‌ను పిల్లలకు తినిపించాలి. బియ్యం, మొక్క జొన్న, క్వినోవా, ఓట్స్, బార్లీ లాంటి ధాన్యాలతో తయారు చేసిన వంటకాలను పిల్లలకు పెట్టాలి. దీనివల్ల వారికి శక్తి లభిస్తుంది. జీవక్రియలు వేగవంతమై పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు.

కూరగాయలు: టమాటా, కేరెట్, చిలగడదుంప, గుమ్మడికాయ, బీట్‌రూట్ లాంటి తాజా కూరగాయలను పిల్లలకు తప్పకుండా తినిపించాలి. వీటిలో ఎ విటమిన్, ఖనిజాలు, పీచుపదార్థం, ఫైటోకెమికల్స్ బీటా కెరోటిన్లు, కెరోటినాయిడ్స్ ఉంటాయి. ఇవి పిల్లల శారీరక నిర్మాణానికి సహకరిస్తాయి. కళ్లు, చర్మం, తల వెంట్రుకలు, గోళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి.

గ్రీన్ టీ తాగుతున్నారా..!

బ్లాక్ టీ కంటే గ్రీన్ టీ తాగడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఒక కప్పు వేడినీళ్లలో ఓ గ్రీన్ టీ బ్యాగ్ లేదా కొన్ని గ్రీన్ టీ ఆకులు, రెండు పుదీనా లేదా తులసి ఆకులు వేసి మూతపెట్టి రెండు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా తేనె కలిపితే గ్రీన్ టీ తయారవుతుంది. దీనిని తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

- పని ఒత్తిడితో అలసిపోయినపుడు ఓ కప్పు గ్రీన్ టీ తాగితే దానిలోని థయమిన్ సమ్మేళనం ప్రభావవంతంగా పనిచేసి ఆందోళనను తగ్గిస్తుంది. మధుమేహం, రక్తపోటు సమస్యలను నివారిస్తుంది.
- తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. న్యూరోడీజెనరేటివ్ సమస్యలు రావు. జ్ఞాపకశక్తి, ఏకాగ్రతలను పెంచి అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులను అరికడుతుంది.
- ప్రతిరోజూ ఉదయాన్నే గ్రీన్ టీ తాగుతూ



ఉంటే ఎముకలు, కీళ్లు బలోపేతమవుతాయి. ఆస్టియోపొరాసిస్ వ్యాధి రాదు.

- గ్రీన్ టీలోని పాలి ఫెనాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు... చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. కళ్ల కింద, చర్మం మీద ముడతలు రాకుండా చేస్తాయి. శిరోజాల కుదుళ్ల గట్టిపడేలా సహకరిస్తాయి. చెడు కొలెస్ట్రాల్‌ను కరగించి గుండె జబ్బుల నుంచి రక్షిస్తాయి.
- రోజుకు రెండుసార్లు గ్రీన్ టీ తాగుతూ ఉంటే దానిలోని కెటాచిన్లు... శరీరంలోని అదనపు కేలరీలను వేగంగా కరగిస్తాయి. దీంతో శరీర బరువు క్రమంగా తగ్గుతుంది.
- తేనె, పంచదార కలుపుకోకుండా గ్రీన్ టీ తాగితే అందులోని యాంటీ బ్యాక్టీరియల్స్... దంతక్షయం, చిగుళ్ల వ్యాధులు, నోటి దుర్వాసన, నోటి క్యాన్సర్ లాంటి సమస్యలను నివారిస్తాయి.

బిజినెస్

నయా ఫండ్స్

● యూటీఐ క్వాంట్ ఫండ్

యూటీఐ మ్యూచువల్ ఫండ్.. యూటీఐ క్వాంట్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. మార్కెట్ పరిస్థితులు, ఆటుపోట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిలకడైన వ్యూహంతో పెట్టుబడులు పెట్టడం ఈ ఫండ్ ప్రత్యేకత. క్వాంటిటేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ థీమ్‌తో దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. ఈ ఫండ్‌కు బీఎస్ఈ 200 టీఆర్ఐ బెంచ్ మార్క్‌ ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 25.

● మిరే అసెట్ స్మాల్ క్యాప్ ఫండ్

మిరే అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్.. మిరే అసెట్ స్మాల్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. స్మాల్ క్యాప్ స్టాక్స్‌ల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ).. ఈ ఫండ్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. ముగింపు తేదీ జనవరి 24.

● బంధన్ నిఫ్టీ ఇండెక్స్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. నిఫ్టీ ఆల్ఫా లో వొలాటిలిటీ 30 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. అనిశ్చితితో కూడిన మార్కెట్లలో కూడా నిలకడైన రాబడులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బహుళ వ్యూహంతో పెట్టుబడులు పెట్టడం ఈ ఫండ్ ప్రత్యేకత. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 20. కనీస పెట్టుబడి రూ.1,000.

భారత్ బంగారు కొండ!

మనోళ్ల దగ్గర 22,000 టన్నుల పసిడి నిల్వలు

గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చండి..

ప్రభుత్వానికి బులియన్ వర్తక సంఘాల వినతి



భారతీయులకు బంగారంపై మోజు ఎక్కువే. భారత కుటుంబాల వద్ద ఆభరణాలు, ఇతర రూపాల్లో 22,000 టన్నులకు పైగా బంగారం ఉండవచ్చని అంచనా. స్వర్ణాభరణాలు, నాణేలు, కడ్డీల తయారీ కోసం గడిచిన 26 ఏళ్లలో మన దేశం దిగుమతి చేసుకున్న బంగారానికి సమానమిది.పసిడి దిగుమతులను తగ్గించుకోవడంతో పాటు దేశీయ కుటుంబాల వద్ద నిరుపయోగంగా పడి ఉన్న బంగారాన్ని పునర్వినియోగంలోకి తెచ్చేందుకు ఈసారి బడ్జెట్‌లో గోల్డ్ మానిటైజేషన్ పథకాన్ని (జీఎంఎస్) మరింత ఆకర్షణీయంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వానికి బులియన్ వర్తక సంఘాలు లేఖ రాశాయి. ఇందుకోసం గోల్డ్ డిపాజిట్ల కాలపరిమితిపై మరింత వెసులుబాటుతో పాటు అధిక వడ్డీని ఆఫర్ చేయడం సహా 500 గ్రాముల వరకు బంగారం డిపాజిట్‌పై ఎలాంటి పన్ను దర్యాప్తు ఉండదన్న హామీ ఇవ్వాలని వర్తక సంఘాలు సూచించాయి. అలాగే, దీర్ఘకాలిక జీఎంఎస్ డిపాజిట్లపై పసిడి రుణాలందించేందుకు బ్యాంకులకు అనుమతివ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ, గుర్తింపు కలిగిన జువెలర్లు సైతం జీఎంఎస్‌లో పాల్గొనేందుకు వీలుగా పథకంలో మార్పులు చేయాలన్నారు. ఆభరణ విక్రయ కంపెనీలైతే నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని నగదీకరించుకునేలా కస్టమర్లకు నచ్చజెప్పగలవన్నారు.

ఏటా 800-850 టన్నుల దిగుమతులు

ఏటా దేశంలోకి 800-850 టన్నుల వరకు బంగారం దిగుమతి అవుతోంది. విలువ పరంగా చూస్తే, 2023లో భారత్ 4,260 కోట్ల డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకోగా.. 2024 నవంబరుతో ముగిసిన 11 నెలల్లోనే 4,700 కోట్ల పసిడి దేశంలోకి దిగుమతైంది. గత ఏడాదిలో పసిడి ధరలు భారీగా పెరగడం ఇందుకు కారణమైంది. విదేశాల నుంచి పసిడి ప్రవాహం పెరిగితే దిగుమతుల వ్యయం కూడా పెరిగి కరెంట్ ఖాతా లోటు నియంత్రణ లక్ష్యాలను మించిపోయే ప్రమాదం ఉంది. కాగా ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం రూ.80,550కి చేరింది.

జీఎంఎస్ గురించి..

కుటుంబాలు, సంస్థలు, దేవాలయాల వద్ద నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని సమీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నవంబరు 5న గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ (జీఎంఎస్)ను ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కస్టమర్లు ముడి బంగారం (నాణేలు, కడ్డీలు, రాళ్లు లేదా ఇతరాలు లేని ఆభరణాలు) బ్యాంకుల వద్ద డిపాజిట్ చేయవచ్చు. కనీసం 10 గ్రాములు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గరిష్ఠ పరిమితి లేదు. ఈ స్కీమ్ మూడు కాలపరిమితుల (స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక)తో కూడిన డిపాజిట్లను ఆఫర్ చేస్తోంది. మధ్యకాలిక (5-7 ఏళ్లు) డిపాజిట్‌పై 2.25 శాతం, దీర్ఘకాలిక (12-15 ఏళ్లు) డిపాజిట్‌పై 2.5 శాతం వార్షిక వడ్డీ లభిస్తుంది. కాగా, స్వల్పకాలిక (1-3 ఏళ్ల) డిపాజిట్‌పై వడ్డీని నిర్ణయించేందుకు సంబంధిత బ్యాంకుకే అధికారం కల్పించారు. అయితే, విధానపరమైన సమస్యలతో పాటు నమ్మకం లోపించడం కారణంగా కస్టమర్ల నుంచి ఈ పథకానికి ఆశించిన స్పందన లభించలేదు. 2024 మార్చి నాటికి జీఎంఎస్ పథకం కింద కేవలం 30.15 టన్నుల బంగారం మాత్రమే డిపాజిట్ అయింది.

కాగ్నిజెంట్‌లో 60 ఏళ్లకు రిటైర్మెంట్

పదవీవిరమణ గడువు రెండేళ్లు పెంపు

బెంగళూరు: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ కంపెనీ తన ఉద్యోగుల పదవీవిరమణ గడువును 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచింది. భారత్‌లోని కంపెనీ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందికి, పే-రోల్‌లో మార్పు లేకుండా ఆన్‌సైట్‌లో పనిచేసే వారికీ ఇది వర్తిస్తుందని కాగ్నిజెంట్ స్పష్టం చేసింది. ఇండస్ట్రీ ప్రమాణాలకు అనుగుణంగా ఈ మార్పు చేపడుతున్నట్లు కంపెనీ తెలిపింది. అనుభవజ్ఞులైన నిపుణులను ఆకర్షించడంతో పాటు వారిని నిలుపుకునేందుకు కట్టుబడి ఉన్నామంది. అయితే, ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోని పక్షంలో ఉద్యోగి పెన్షన్ ఫండ్ మాత్రం 58 ఏళ్లకు నిలిపివేయబడుతుందని కంపెనీ తెలిపింది. కాగ్నిజెంట్ భారత కార్యాలయాల్లో 2.50 లక్షల మంది పనిచేస్తున్నారు.

రెన్యూబై స్మార్ట్ టర్మ్ ప్లాన్

ఇన్సూర్‌టెక్ సంస్థ రెన్యూబై.. వృత్తి నిపుణులు, చిరు వ్యాపార యజమానుల కోసం అందుబాటులో ధరల్లో స్మార్ట్ టర్మ్ ప్లాన్‌ను తీసుకువచ్చింది. ఈ ప్లాన్ కోసం ఎల్ఐసీ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, డిజిట్ ఇన్సూరెన్స్‌తో రెన్యూబై జట్టు కట్టింది. పదేళ్ల ప్రీమియం చెల్లింపు ఆప్షన్, 80 సంవత్సరాలు, అంతకు పైబడిన వయసు వారికి జీవిత బీమా కవరేజీని ఈ ప్లాన్ అందించనుంది. నెలకు రూ.2,500 ప్రీమియంతో ఈ టర్మ్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్ సమ్ అష్యూర్డ్ రూ.50 లక్షలు, రూ.కోటి. యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్, వైకల్యం సంభవిస్తే ప్రీమియం చెల్లింపు నుంచి మినహాయింపు వంటి అదనపు ప్రయోజనాలను కూడా కల్పించనుంది. పాలసీ సమయంలో పాలసీని ఉపసంహరించుకుంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియం మొత్తాన్ని పాలసీదారులకు రిఫండ్ చేయటం ఈ ప్లాన్ ప్రత్యేకత.

● రాయల్‌ఓక్ ఫర్నీచర్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు మరింతగా విస్తరించింది. తాజాగా శ్రీకాకుళంలో కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో రాయల్‌ఓక్‌కు ఇది 14వ స్టోర్ కాగా దేశవ్యాప్తంగా 172వ స్టోర్. ఈ స్టోర్‌లో అమెరికా, ఇటలీ, మలేషియా, భారత్‌కు చెందిన విభిన్న రకాలైన ఫర్నీచర్ అందుబాటులో ఉండనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	515
వరంగల్	492	గోదావరి	515
చిత్తూరు	523	విశాఖపట్నం	520

దజను గుడ్లు రూ. 72

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,640 ▲	73,000 ▲	1,01,000 ▲
విజయవాడ	80,700 ▲	76,000 ▲	93,000 ▲
విశాఖపట్నం	78,670 ▼	72,110 ▼	92,580 ▲
రాజమండ్రి	79,800 ▲	73,150 ▲	92,700 ▲
ప్రొద్దుటూరు	79,700 ▲	73,800 ▲	93,100 ▲
ముంబై	78,018 ▲	71,465 ▲	90,268 ▲

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	విజయవాడ	111
వరంగల్	104	గుంటూరు	110
కరీంనగర్	104	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	95
కర్నూలు	104	నెల్లూరు	100
విశాఖపట్నం	107	అనంతపురం	100
గోదావరి	111		

గిఫ్ట్ కార్డుల మీద జీఎస్‌టీ ఎంతంటే..

ఇదీ GST



రాంబాబు గొండాల

ఏదైనా శుభకార్యానికి వెళ్లినప్పుడు గిఫ్ట్ తీసుకుని వెళ్లటం పరిపాటి. అయితే చాలా సందర్భాల్లో ఎలాంటి గిఫ్ట్ ఇవ్వాలో అర్థం కాదు. ఇలాంటి సందర్భాల్లో చాలా మంది గిఫ్ట్ కార్డ్ లేదా గిఫ్ట్ కూపన్స్ కొని ఇస్తుంటారు. అంటే, ఉదాహరణకు షాపర్స్ స్టాప్‌కి సంబంధించి రూ.1,000 గిఫ్ట్ కూపన్ లేదా గిఫ్ట్ కార్డు కొని అవతలి వ్యక్తికి ఇస్తే.. సదరు వ్యక్తి ఈ గిఫ్ట్ కార్డు తీసుకుని ఆ షాప్‌కు వెళ్లి రూ.1,000కి సరిపోను వస్తువులు లేదా బట్టలు తీసుకోవచ్చు. ఇలాంటి గిఫ్ట్ కార్డులను ఆన్‌లైన్‌లో కూడా అమ్ముతుంటారు. వీటిని గిఫ్ట్‌గా ఇవ్వటం సులభం. ఈ గిఫ్ట్ కార్డు పొందిన వ్యక్తి కూడా తనకు కావాల్సిన వస్తువులను తన అభిరుచి మేరకు కొనుగోలు చేయవచ్చు.

ఈ గిఫ్ట్ కార్డులనే వోచర్స్‌గా వ్యవహరిస్తారు. నిజానికి ఈ వోచర్స్ బిజినెస్ చాలా పెద్దది. అంటే ఇందులో వివిధ కంపెనీల వోచర్స్.. వివిధ విలువలకు సంబంధించినవి అమ్ముతుంటారు. వీటిని అమ్మటం కోసం డిస్ట్రిబ్యూటర్స్, హోల్‌సేలర్స్, రిటైలర్స్‌తో కూడిన నెట్‌వర్క్ ఉంటుంది. ఈ వోచర్ అమ్మకాలకు సంబంధించి జీఎస్‌టీలో కొంత గందరగోళం ఉండేది. ఉదాహరణకి రూ.1,000 విలువ ఉన్న వోచర్స్‌ను హోల్‌సేలర్ రూ.900కి కొని రిటైలర్‌కు రూ.950కి అమ్మాడనుకుందాం. సదరు రిటైలర్ తిరిగి కస్టమర్‌కు రూ.980కి విక్రయించాడనుకుందాం. అంటే హోల్‌సేలర్‌కి వచ్చిన రూ.50 లాభం మీద, అలాగే రిటైలర్ పొందిన రూ.30 మీద లాభం మీద పన్ను చెల్లించాలా? అసలు దీన్ని గూడ్స్ కింద పరిగణించాలా లేదా సర్వీస్ కిందకు వస్తుందా? అనే సందేహాలు కూడా చాలా మందికి ఉండేవి. ఎందుకంటే జీఎస్‌టీ అనేది గూడ్స్ లేదా సర్వీసెస్ మీద అమలవుతుంది. ఏదైనా ఒక లావాదేవీ ఈ రెండు విభాగాల్లో ఏదో ఒక దాంట్లో చేపడితేనే జీఎస్‌టీ వర్తిస్తుంది.

ఈ గందరగోళాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇటీవల దీని మీద వివరణ ఇచ్చింది. దీని ప్రకారం గిఫ్ట్ కార్డ్స్ లేదా గిఫ్ట్ కూపన్స్ అనేవి 'ప్రీ పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్' కిందకు వస్తాయి. అంటే, ఆ విలువకు సరిపోను డబ్బును ఆ కార్డులో ముందే నింపుతారని అర్థం. కాబట్టి దీన్ని కూడా 'డబ్బు' కిందనే భావించవచ్చు. జీఎస్‌టీ నియామవళి ప్రకారం డబ్బు అనేది 'గూడ్స్' కిందకు గానీ, 'సర్వీస్' కిందకు గానీ రాదు. ఎప్పుడైతే, ఈ రెండు విభాగాల కిందకు రాదో అప్పుడు జీఎస్‌టీ వర్తించదు. అంటే గిఫ్ట్ కార్డు అమ్మినప్పుడు ఎలాంటి జీఎస్‌టీ వర్తించదు. దీని ప్రకారం గిఫ్ట్ కార్డ్స్ అమ్మకందారులు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించనవసరం లేదు. కానీ, ఇలా గిఫ్ట్ కార్డు అమ్మకం, కొనుగోలు కాకుండా మధ్యవర్తిగా ఉంటూ అంటే.. ఏజెంట్ లేదా బ్రోకర్‌లా ఉంటూ కమీషన్ తీసుకుంటే మాత్రం.. పొందిన కమీషన్ మీద జీఎస్‌టీ వర్తిస్తుంది. అలాగే దీనికి సంబంధించిన ఇతర సర్వీసులు లేదా సేల్స్ ప్రమోషన్స్ మొదలైన వాటికి సంబంధించి జీఎస్‌టీ వర్తిస్తుంది.

ఇకపోతే, ఈ గిఫ్ట్ కార్డు అనేది డబ్బుల కిందనే భావిస్తారు. కాబట్టి ఈ కార్డు ఇచ్చి వస్తువులు లేదా సేవలు పొందేటప్పుడు మొత్తం విలువ మీద ఆయా వస్తువులను బట్టి జీఎస్‌టీ చెల్లించాలి. ఉదాహరణకు , ఒక వ్యక్తి రూ.1,000 గిఫ్ట్ కార్డు తీసుకుని షోరూమ్‌కి వెళ్లి రూ.1,000 విలువైన వస్తువు తీసుకున్నాడు అనుకుందాం. ఇప్పుడు ఈ వ్యక్తి.. డబ్బు చెల్లించే బదులు గిఫ్ట్ కార్డు ఇస్తాడు. కానీ గిఫ్ట్ కార్డు కూడా డబ్బు లాగానే భావించాం కాబట్టి ఈ రూ.1,000 వస్తువును డబ్బు చెల్లించే తీసుకున్నట్లు భావించి తగిన జీఎస్‌టీ చెల్లించాలి. ఇంకా చెప్పాలంటే ఈ రోజుల్లో ఫిజికల్ కరెన్సీ వాడకుండా వివిధ రకాల కార్డుల ద్వారా, ఫోన్ ద్వారా చెల్లింపులు ఎలా జరుపుతుంటారో.. ఈ గిఫ్ట్ కార్డు ఇవ్వటం కూడా ఇలాంటి చెల్లింపు కిందనే భావించాలి. కాబట్టి ఆయా వస్తువులకు ఎంత శాతం జీఎస్‌టీ వర్తిస్తుందో.. అదే జీఎస్‌టీ గిఫ్ట్ కార్డుతో కొన్నా వర్తిస్తుంది.

తాజాగా ప్రభుత్వం ఇచ్చిన ఈ వివరణతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించినట్లయింది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

మహిళల రెండో వన్డే నేడు
భారత్ x ఐర్లాండ్
ఉ. 11 గం. నుంచి స్పోర్ట్స్-18లో..

సెమీస్‌లో మహారాష్ట్ర, కర్ణాటక

వడోదర: నాలుగుసార్లు చాంపియన్ కర్ణాటక, మహారాష్ట్ర జట్లు విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీ సెమీఫైనల్‌కు దూసుకుపోయాయి. శనివారం ఉత్కంఠగా జరిగిన క్వార్టర్‌ఫైనల్లో కర్ణాటక 5 పరుగులతో బరోడాపై నెగ్గింది. తొలుత కర్ణాటక 50 ఓవర్లలో 281/8 స్కోరు చేసింది. పడిక్కళ్ (102) శతకంతో చెలరేగాడు. ఛేదనలో బరోడా 49.5 ఓవర్లలో 276 రన్స్‌కు ఆలౌటైంది. రావత్ (104) శ్రమ వృథా అయింది. మరో క్వార్టర్స్‌లో మొదట మహారాష్ట్ర 275/6 స్కోరు చేసింది. అర్షిన్ కులకర్ణి (107) మెరిశాడు. అనంతరం పంజాబ్ 44.4 ఓవర్లలో 205 రన్స్‌కు ఆలౌటైంది.





తిలక్



నితీశ్

షమి వచ్చేశాడు

14 నెలల తర్వాత జట్టులోకి స్టార్ పేసర్

నితీశ్, తిలక్‌కు చోటు

వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు భారత టీ20 జట్టు

ఇదీ జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), శాంసన్, అభిషేక్, తిలక్ వర్మ, హార్దిక్, రింకూ సింగ్, నితీశ్ కుమార్, అక్షర్, హర్షిత్, అర్ష్‌దీప్, షమి, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, సుందర్, ధ్రువ్ జురెల్.

న్యూఢిల్లీ: భారత వెటరన్ పేసర్ మహ్మద్ షమి పునరాగమనంపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెర పడింది. 14 నెలల సుదీర్ఘ విరామం తర్వాత ఎట్టకేలకు తను టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌తో ఈనెల 22 నుంచి జరుగబోయే ఐదు టీ20ల సిరీస్ కోసం సెలెక్టర్లు 15 మందితో కూడిన భారత జట్టును ప్రకటించారు. అయితే చాంపియన్స్ ట్రోఫీకి ఆదివారమే తుది గడువు అయినా ప్రాథమిక జట్టు (వన్డే)ను ప్రకటించకపోవడం గమనార్హం. టీ20 జట్టుకు సూర్యకుమార్ నేతృత్వం వహిస్తుండగా, వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్‌ను ఎంపిక చేశారు. ఇక 34 ఏళ్ల షమి చివరిసారిగా భారత్ తరఫున 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌లో ఆడాడు. మోకాలి గాయంతో జట్టుకు దూరమైన షమి జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) పునరావాస శిబిరంలో చేరి కోలుకున్నాడు. ఆ తర్వాత బెంగాల్ తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తొమ్మిది మ్యాచుల్లో 11 వికెట్లు, విజయ్ హజారేలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీసి రాణించాడు. అయితే ఈ రెండు టోర్నీల మధ్యలో మోకాలి వాపునకు గురి కావడంతో ఆసీస్ టూర్‌కు వెళ్లలేకపోయాడు. ప్రస్తుతం ఎన్‌సీఏ నుంచి షమి ఫిట్‌నెస్‌కు సంబంధించి అనుమతి రావడంతో సెలెక్టర్లు ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేశారు. వచ్చే నెలలో జరిగే చాంపియన్స్ ట్రోఫీలోనూ షమి ఆడే అవకాశం ఉండడంతో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌ల ద్వారా షమిని అంచనా వేసే అవకాశం ఉంది. అయితే అతడిపై ఒత్తిడి పడకుండా చూసేందుకు అన్ని మ్యాచ్‌లను ఆడించకపోవచ్చని సమాచారం. అటు ప్రధాన వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్‌నే కొనసాగించారు. మరోవైపు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ఆడిన నలుగురు ఆటగాళ్లు నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్ టీ20 జట్టులో చేరారు. దీంతో గత నవంబరులో దక్షిణాఫ్రికాతో ఆడిన రమణ్‌దీప్ సింగ్, యష్ దయాళ్, అవేశ్, జితేశ్ శర్మ స్థానాలను కోల్పోయారు. ప్రస్తుత జట్టులో అక్షర్, బిష్ణోయ్, వరుణ్, సుందర్‌ల రూపంలో నలుగురు స్పిన్నర్లు ఉండడం విశేషం. గాయం కారణంగా రియాన్ పరాగ్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. కీపర్ రిషభ్ పంత్, ఓపెనర్ జైస్వాల్, గిల్‌లకు విశ్రాంతినిచ్చారు.



'వైడ్ బాల్'ను మారుస్తాం

షాన్ పొలాక్


డర్బన్: క్రికెట్‌లో సాధారణంగా బ్యాటర్లదే హవా కనిపిస్తుంటుంది. బౌలర్లకు మైదానంలో కఠిన పరిస్థితులు ఎదురవుతుంటాయి. అందుకే వీరికి కూడా అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఐసీసీ క్రికెట్ కమిటీ సభ్యుడు షాన్ పొలాక్ అభిప్రాయపడుతున్నాడు. ముఖ్యంగా వైడ్ బంతుల విషయంలో ప్రస్తుత నిబంధనల కారణంగా బౌలర్లు నష్టపోతున్నారని, దీంట్లో మార్పులు చేసే అవకాశం ఉందన్నాడు. 'పరిమిత ఓవర్ల క్రికెట్‌లో బ్యాటర్లు ముందుకు వచ్చి ఆడాలని చూస్తుంటారు. దీంతో బౌలర్ల లైన్ అండ్ లెంగ్త్ గతి తప్పుతోంది. వారిని కట్టడి చేసే ప్రయత్నంలో ఎక్కువగా బంతులను వైడ్‌గా వేస్తున్నారు. అందుకే ఐసీసీ క్రికెట్ కమిటీ సభ్యుడిగా ఇదే అంశంపై పనిచేస్తున్నా. వైడ్ విషయంలో బౌలర్లకు ప్రయోజనం ఉండేలా రూల్‌ను మారుస్తాం. ఎందుకంటే రనప్ సమయంలోనే ఓ బౌలర్‌కు ఎక్కడ బంతిని వేయాలనేది తెలిసుండాలి. కానీ చివరి నిమిషంలో బ్యాటర్ కదిలి అతడి ఏకాగ్రతను దెబ్బతీస్తున్నాడు. అందుకే ఒకవేళ బ్యాటర్ కదిలినప్పుడు బంతి అతడికి దూరంగా పడిందే అనుకుందాం. ఆ సమయంలో బ్యాటర్ ఎక్కడైతే ఉన్నాడో, అక్కడి నుంచే బంతి పడిన దూరాన్ని పరిశీలించాలి. అప్పుడే వైడ్‌పై ఓ నిర్ణయానికి రావాల్సి ఉంటుంది' అని పొలాక్ వివరించాడు.

సాత్విక్ జోడీ పరాజయం

కౌలాలంపూర్: తెలుగు షట్లర్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీకి మలేసియా సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో చుక్కెదురైంది. గతేడాది ఇక్కడ రన్నరప్‌గా నిలిచిన భారత ద్వయం ఈసారి ఫైనల్ చేరకుండానే నిష్క్రమించింది. శనివారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్-చిరాగ్ జంట 10-21, 15-21తో కొరియాకు చెందిన కిమ్ వోన్ హో-సియో సియంగ్ ద్వయం చేతిలో ఓటమి పాలైంది.

శ్రీలంకకు ఓదార్పు విజయం

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో శ్రీలంక 140 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అయితే ఇప్పటికే రెండు వన్డేలు గెలిచిన కివీస్ 2-1తో సిరీస్ దక్కించుకుంది. శనివారం జరిగిన ఈ చివరి మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో 8 వికెట్లకు 290 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సాంక (66), కుశాల్ మెండిస్ (54), లియనగె (53), కమిందు మెండిస్ (46) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' మ్యాట్ హెన్రీ 4, శాంట్నర్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో కివీస్ 29.4 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. చాప్‌మన్ (81) మాత్రమే పోరాడగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అసిత ఫెర్నాండో, తీక్షణ, ఎషాన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి.



'మెల్‌బోర్న్'తోనే గుడ్‌బై చెబుదామనుకున్నాడా!

ముంబై: ఆస్ట్రేలియాతో చివరి టెస్ట్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ ఆడే విషయంలో పెద్ద చర్చ జరిగింది. మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగోది, బాక్సింగ్ డే టెస్ట్‌లో ఓపెనర్‌గా పునరాగమనం చేసినా రోహిత్ ఆట గాడిలో పడలేదు. ఈ నేపథ్యంలో సిడ్నీ టెస్ట్ తుది జట్టు నుంచి అతడిని తప్పిస్తారని, దాంతో టెస్ట్‌లకు భారత కెప్టెన్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే ఊహాగానాలు వినిపించాయి. మొత్తంగా.. ఫామ్‌లో లేని కారణంగా తానే ఆఖరి టెస్ట్‌కు దూరంగా ఉన్నానని రోహిత్ ప్రకటించి చర్చోపచర్చలకు తెరదించాడు. అయితే బాక్సింగ్ డే టెస్ట్‌లోనూ రాణించకపోవడంతో సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పాలనే నిర్ణయానికి హిట్‌మ్యాన్ వచ్చేశాడట. 'మెల్‌బోర్న్‌లోనూ విఫలమవడంతో వీడ్కోలు పలకాలని రోహిత్ నిర్ణయించుకున్నాడు. కానీ శ్రేయోభిలాషులు నచ్చజెప్పడంతో మనసు మార్చుకున్నాడు' అని రోహిత్ సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.

ప్రొఫెషనల్ బాక్సర్‌గా నిషాంత్

న్యూఢిల్లీ: యువ బాక్సర్ నిషాంత్ దేవ్ త్వరలో ప్రొఫెషనల్ బాక్సింగ్ సర్క్యూట్‌లో కెరీర్‌ను ప్రారంభించనున్నాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లోనూ పోటీపడ్డ 24 ఏళ్ల నిషాంత్.. ఈనెల 25న అమెరికాలోని లాస్ వేగాస్ తన తొలి ప్రొఫెషనల్ బౌట్ ఆడనున్నాడు.



డబుల్స్ బరిలో రిత్విక్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఈమారు ఐదుగురు భారత ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వీరిలో తెలుగు కుర్రాడు, హైదరాబాద్‌కు చెందిన రిత్విక్ చౌదరి బొల్లిపల్లి ఉండడం విశేషం. అమెరికాకు చెందిన ర్యాగ్ సెగర్‌మ్యాన్ జతగా రిత్విక్ డబుల్స్‌లో పోటీపడుతున్నాడు. వెటరన్ స్టార్ రోహన్ బోపన్న, యుకీ భాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ డబుల్స్‌లో వేర్వేరు భాగస్వాములతో కలిసి బరిలోకి దిగుతుండగా.. సుమిత్ నగాల్ సింగిల్స్‌లో తలపడుతున్నాడు.



అల్కారజ్

ఆ ఇద్దరిపై..



సిన్నర్

● సిన్నర్, అల్కారజ్‌పై భారీ అంచనాలు
● అండర్ డాగ్‌గా జొకోవిచ్
● మహిళల ఫేవరెట్ సబలెంక

నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్

ఉదయం 5.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో



సబలెంక



జొకోవిచ్

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నవతరం స్టార్ల హవా కొనసాగే అవకాశం ఉంది. ఆదివారం నుంచి జరిగే ఈ మేజర్ టోర్నీలో డిఫెండింగ్ చాంప్, ఇటలీ ఆటగాడు జానిక్ సిన్నర్ (23), మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్ (21) పురుషుల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. ఏళ్ల తరబడి బిగ్-3 రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, నొవాక్ జొకోవిచ్ టెన్నిస్‌ను ఏలారు. ఫెడెక్స్, నడాల్ కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించగా.. జొకోవిచ్ ఒక్కడే ప్రస్తుతం పోటీలో ఉన్నాడు. అయితే, 24 గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గి చరిత్ర సృష్టించిన జొకో గతేడాది ఒకే ఒక గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌లో మాత్రమే ఫైనల్ చేరగలిగాడు. ఈమధ్య జొకో.. సిన్నర్, అల్కారజ్‌ల నుంచి దీటైన ప్రతిఘటన ఎదుర్కొంటున్నాడు. కుర్రాళ్ల హవా సాగుతున్న ఈ పరిస్థితుల్లో 37 ఏళ్ల జొకోను మెల్‌బోర్న్‌లో అండర్ డాగ్‌గా టెన్నిస్ పండితులు విశ్లేషిస్తున్నారు. కానీ, ఇక్కడ 11వ టైటిల్ వేటలో ఉన్న ఏడో సీడ్ జొకో ఈసారి నెగ్గి తనలో సత్తా తగ్గలేదని నిరూపించుకోవాలని ఆరాటపడుతున్నాడు. టాప్ సీడ్ సిన్నర్, అల్కారజ్‌లు గత సీజన్‌లో చెరో రెండు గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గి నువ్వానేనా? అన్నట్టుగా ఉన్నారు. ఇటీవలి కాలంలో డోపింగ్ ఆరోపణలతో ఒత్తిడికి గురైనా.. జానిక్ మాత్రం ఆటలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకొన్నాడు. కాగా, సీజన్ చివర్లో అల్కారజ్ ఫామ్ తగ్గింది. తొలి రౌండ్‌లో నికోలస్ జెర్రీ (చిలీ)తో సిన్నర్ తలపడనున్నాడు. మరోవైపు టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా ఉన్న అల్కారజ్ తన సర్వీస్‌లో మార్పులు చేసుకొని బరిలోకి దిగుతున్నాడు. సిన్నరే తనకు ప్రత్యర్థి అని ప్రకటించాడు కూడా. దీంతో ఈసారి టైటిల్ ఫైట్ వీరిద్దరి మధ్యనే జరుగుతుందన్నది విశ్లేషకుల అంచనా. గతేడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), యూఎస్ ఓపెన్ రన్నరప్ టేలర్ ఫ్రిట్జ్, ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) ఈసారి టైటిల్ నెగ్గాలనే పట్టుదలతో ఉన్నారు. జొకోవిచ్ ఆరంభ రౌండ్లో తెలుగు మూలాలున్న అమెరికా కుర్రాడు నిషేష్ బసవారెడ్డితో తలపడనున్నాడు. మరోవైపు మహిళల సింగిల్స్‌లో గతేడాది విజేత అర్యానా సబలెంక టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతోంది. గతవారం బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ టైటిల్ నెగ్గి జోరుమీదున్న సబలెంకకు మాజీ చాంప్, పోలెండ్ భామ ఇగా స్వియటెక్, ఇటలీ సంచలనం జాస్మిన్ పౌలినీ గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.. 2024లో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీలో పౌలినీ ఫైనల్ చేరినా.. రెండుసార్లూ నిరాశే ఎదురైంది. ఇక, తొలి రౌండ్‌లో స్లోన్ స్టీఫెన్స్‌తో సబలెంక, సినికొవాతో రెండో సీడ్ స్వియటెక్, చైనా ప్లేయర్ వీ యూతో పౌలినీ అమీతుమీ తేల్చుకోనున్నారు.



అందరూ ఎంజాయ్ చేస్తారు

వెంకటేశ్



'నా కెరీర్‌కి ఇది మరో సంక్రాంతి. ఒక క్లీన్ ఎంటర్‌టైనింగ్ చిత్రంతో వస్తున్నందుకు ఆనందంగా ఉంది. లిటిల్ క్రైమ్ ఎలిమెంట్‌తో కూడిన కొత్త జానర్ మూవీ ఇది. సినిమా జర్నీని చాలా ఎంజాయ్ చేశాను. అంతా పాజిటివ్‌గా ఉంది. నా కెరీర్‌లో సంక్రాంతికి వచ్చిన చాలా సినిమాలు విజయం సాధించాయి. ఈ సినిమా కూడా అద్భుతంగా ఆడుతుంది. అందరూ ఎంజాయ్ చేస్తారు. క్లయిమాక్స్ చాలా ఉత్కంఠకు గురిచేస్తుంది' అని అన్నారు హీరో దగ్గుబాటి వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా రూపొందిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వెంకటేశ్ మీడియాతో మాట్లాడుతూ ' చిత్ర కథ విషయానికొస్తే..ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్..ఈ లైనే చాలా ఫ్రెష్‌గా అనిపించింది. మినిమమ్ గ్యారెంటీ అని అక్కడే తెలిసిపోయింది. అనిల్, నాది సూపర్‌హిట్ కాంబినేషన్. ఈ చిత్రంలో కామెడీ స్టయిల్ కొంచెం డిఫరెంట్‌గా ఉంటుంది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ చాలా మంచి క్యారెక్టర్స్ చేశారు. క్లయిమాక్స్‌లో చెప్పే డైలాగ్స్ చాలా క్రేజీగా ఉంటాయి. ఆడియన్స్ చాలా ఎంటర్‌టైన్ అవుతారు. భీమ్స్ చాలా హార్డ్ వర్క్ చేసి బెస్ట్ మ్యూజిక్ ఇచ్చాడు. గోదారి గట్టు పాట 85 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసింది. ప్రతి సినిమా నా సొంత సినిమాగా చేస్తాను. ప్రతి ఒక్కరూ హ్యాపీగా ఉండాలని కోరుకుంటాను. సిన్సియర్‌గా పని చేస్తాను. దిల్ రాజు ప్రొడక్షన్స్‌లో 'సీతమ్మ వాకిట్లో' నుంచి ట్రావెల్ అవుతున్నాను. మేము చేసిన అన్ని సినిమాలు బాగా ఆడాయి. వారికి మరిన్ని విజయాలు రావాలని కోరుకుంటున్నాను. 'రానా నాయుడు-2' డబ్బింగ్ పూర్తయింది. మార్చిలో రావొచ్చు' అని అన్నారు.


కొత్త బాలకృష్ణని చూస్తారు

- బాబీ కొల్లి



నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'డాకు మహారాజ్'. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నేడు విడుదలవుతున్న ఈ సినిమాలో బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు. ఈ నేపథ్యంలో బాబీ కొల్లి మీడియాతో మాట్లాడుతూ 'బాలకృష్ణ ఇమేజ్‌ని, ప్రేక్షకుల్లో ఆయన సినిమాపై ఉండే అంచనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని రూపొందించాం. బాలకృష్ణ గత చిత్రాలకు భిన్నంగా కొత్తగా చూపించడానికి ప్రయత్నించాం. బాలయ్య సెటిల్డ్‌గా డైలాగ్‌లు చెప్తే చాలా బాగుంటుంది. 'నరసింహనాయుడు', 'సమరసింహారెడ్డి' తర్వాత 'సింహా' ఎలా అయితే గుర్తుండిపోయిందో..'డాకు మహారాజ్' కూడా అలాంటి పేరు తెచ్చుకుంటుందనే నమ్మకం ఉంది. బాలకృష్ణపై అభిమానంతో నాగవంశీ ఈ సినిమా వైవిధ్యంగా ఉండాలని భావించారు. హీరోకి ఆయుధం అనేది కీలకం. ముఖ్యంగా బాలకృష్ణ సినిమాల్లో గొడ్డలి వంటి పవర్ ఫుల్ ఆయుధం బాగా ఫేమస్. ఈ సినిమాలో అలాంటి శక్తిమంతమైన ఆయుధాలను డిజైన్ చేయించాం. నా గత సినిమాలతో బాబీ కథకథనాలు బాగా రాస్తాడు అనే పేరు తెచ్చుకోగలిగాను. అయితే హాలివుడ్ స్థాయిలో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని మాట్లాడుకునేలా చేయలేకపోయాను. ఇప్పుడు 'డాకు మహారాజ్'తో విజువల్స్ పరంగా గొప్ప పేరు వస్తుంది. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ వారి పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. రెగ్యులర్ విలన్ పాత్రలా కాకుండా బాబీ డియోల్ పాత్ర కొత్తగా ఉంటుంది' అని వివరించారు.









డ్రోన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

డ్రోన్ల హబ్‌గా రాష్ట్రం

- సుముఖంగా ఉన్న సీఎం: రామ్మోహన్ నాయుడు
- సెంచూరియన్‌లో డ్రోన్ల తయారీ యూనిట్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి

నెల్లిమర్ల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రం డ్రోన్ల హబ్‌గా మారనుంది. అందుకు సీఎం చంద్రబాబు సుముఖంగా ఉన్నారు' అని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సూపర్ బి ఏరోనాటిక్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ల తయారీ యూనిట్‌ను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో డ్రోన్‌ల తయారీ కేంద్రాలను ఏర్పాటుచేసి వాటి వాడకాన్ని పెంపొందించాలన్న ఆలోచనలో సీఎం చంద్రబాబు ఉన్నారు. భవిష్యత్తులో డ్రోన్‌లకు సంబంధించి ఉత్తరాంధ్రలో సెంచూరియన్ ప్రధాన కేంద్రంగా మారబోతుంది. ఇక్కడ డ్రోన్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు వాటిపై అవగాహన పెరగడంతో పాటు పరిశ్రమలు, మార్కెట్ అవసరాలను తీర్చడానికి దోహదపడుతుంది. వ్యవసాయ రంగంలో పురుగు మందు వాడకాన్ని తగ్గించాలన్నా, వ్యవసాయ సాగు ఖర్చులు తగ్గాలన్నా డ్రోన్ వినియోగం పెరగాలి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ డ్రోన్‌ల వాడకాన్ని పెంపొందించేందుకు పీఎల్ఐ పథకాన్ని ప్రవేశ పెట్టారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో డ్రోన్‌ల హబ్ ఏర్పాటు చేసేందుకు డ్రోన్ పాలసీ తీసుకువచ్చారు' అని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం సాధించిన అభివృద్ధి గురించి వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు వారికి వివరించారు.

కంసమామ మోసం.. చంద్రన్న న్యాయం



- జగన్ ఫీజు బకాయిలపై మంత్రి లోకేశ్ ట్వీట్
- రూ.788 కోట్లు చెల్లించనున్నట్లు వెల్లడి

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజుల విషయంలో కంసమామ(జగన్) మోసం చేసి పోతే, చంద్రన్న సాయం చేస్తున్నారని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. జగన్‌రెడ్డి ఫీజులు బకాయిల పెట్టి లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడారన్నారు. ఆయన పెట్టిన బకాయిలు ప్రజా ప్రభుత్వం తీర్చాలని రోడ్డెక్కిన ఘనత కూడా జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యార్థులకు ఫీజుల విడుదలపై శనివారం ఆయన ఎక్స్ ద్వారా స్పందించారు. గత పాలకులు చేసిన పాపాలకు విద్యార్థులు బలి కాకూడదన్న ఉద్దేశంతో తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కాలేజీల యాజమాన్యాలతో చర్చలు జరిపి, సర్టిఫికెట్లు ఆపకుండా చూశామని పేర్కొన్నారు. దశలవారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చామని, అందులో భాగంగానే ఇప్పుడు రూ.788 కోట్లు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పండుగ వేళ విద్యార్థులకు తీపి కబురు చెప్పిన సీఎం చంద్రబాబుకు కతజ్ఞతలు తెలిపారు.

స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణ

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్కూల్ కాంప్లెక్స్‌లను పునర్వ్యవస్థీకరిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4034 కాంప్లెక్స్‌లు ఉంటాయని తెలిపారు. పాఠశాల నుంచి కాంప్లెక్స్. గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 కి.మీ. దూరంలో, పట్టణ ప్రాంతాల్లో 5 నుంచి 10కి.మీ. దూరంలో ఉంటాయన్నారు. ప్రతి కాంప్లెక్స్‌కు పట్టణాల్లో 8 నుంచి 10 పాఠశాలు, గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 పాఠశాలలను అనుసంధానం చేస్తారన్నారు. 40 నుంచి 50 మంది టీచర్లు సభ్యులుగా ఉంటారని వివరించారు.

'కేబినెట్ హోదా'కు జీతాల పెంపు

- జీతం, అలవెన్సుల కింద రూ.4.50 లక్షలు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేబినెట్ హోదా కలిగిన వారి జీతాలు, అలవెన్సులను ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం వారి జీతాలు, అలవెన్సులు కలిపి రూ.1.5 లక్షలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కేబినెట్ హోదా కలిగిన వ్యక్తులకు రూ.2 లక్షల వరకూ జీతం చెల్లించనుంది. ఇవి కాకుండా పీఏ, పీఎస్, ఓఎస్, డ్రైవర్ జీతాల కింద రూ.70 వేలు, వాహన అలవెన్సుల కింద రూ.60 వేలు, మొబైల్ ఫోన్ డేటా కనెక్షన్ నిమిత్తం రూ.500, ప్రయాణాల నిమిత్తం ఇంటర్నేషనల్ అయితే బిజినెస్ క్లాస్, దేశీయంగా విమానాలు, రైలులో తిరిగేందుకు అలవెన్సులతో కలిపి రూ.4.50 లక్షల వరకూ ప్రభుత్వం వారికి చెల్లించనుంది. ఈ మేరకు శుక్రవారం రాత్రి సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కార్పొరేషన్ల ఛైర్మన్లకు జీతాలు ఖరారు

- ఏ కేటగిరి ఛైర్మన్‌కు రూ.2,77,500, బీ కేటగిరికి 1,93,500

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ ఛైర్మన్ల జీతాలు, అలవెన్సులను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కేటగిరి - ఏ, కేటగిరి - బీ ఛైర్మన్లకు జీతాలను పెంచింది. కేటగిరి ఏ కార్పొరేషన్‌కు చెందిన ఛైర్మన్‌కు రూ.1.25 లక్షల జీతంగా నిర్ణయింది. కేటగిరి బీ కార్పొరేషన్‌కు చెందిన ఛైర్మన్లకు రూ.60 వేలు జీతంగా ప్రకటించింది. వ్యక్తిగత సిబ్బంది జీతాలు, కారు అలవెన్సు, ఇల్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ట్రావెల్ అలవెన్సు మొత్తం కలుపుకొని కేటగిరి ఏ కార్పొరేషన్ ఛైర్మన్‌కు రూ.2,77,500, కేటగిరి బీ కార్పొరేషన్ ఛైర్మన్‌కు రూ.1,93,500లుగా నిర్ణయించింది. కేటగిరి ఏ కింద 34 కార్పొరేషన్లు, కేటగిరి బీ కింద 28 కార్పొరేషన్లు ఉన్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం రాత్రి సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఒక్క సచివాలయ ఉద్యోగినీ తొలగించలేదు

- అర్హతున్న ఏ ఒక్కరి పింఛనూ తీసేయలేదు
- ప్రజలను రెచ్చగొట్టడమే నీలి మీడియా లక్ష్యం: మంత్రి స్వామి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఏ ఒక్క సచివాలయ ఉద్యోగినీ ప్రభుత్వం తొలగించలేదు. అర్హత ఉన్న ఒక్కరి పెన్షన్‌ని కూడా ప్రభుత్వం తీసేయడం లేదు. నీలి మీడియా పనికట్టుకొని విషప్రచారం చేస్తున్నది' అని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. కులం, మతం, పార్టీ అన్నది చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పింఛన్ తీసుకుంటున్న వారిలో అనర్హులు ఉంటే పరిశీలించాలని మాత్రమే ఆదేశాలు జారీ చేశాం. కానీ సచివాలయ ఉద్యోగులను, అర్హుల పింఛన్‌లను తొలగిస్తున్నట్లు జగన్ పత్రిక రోత రాతలు రాస్తున్నది. విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నది. ఇది మంచి పద్ధతి కాదు' అని స్వామి హితవు పలికారు.

మహిళా నైపుణ్యానికి ప్రతీకలు ముగ్గులు

ప్రతి ముగ్గులో అనేక దృక్కోణాలు: హోం మంత్రి అనిత

ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



ప్రథమ బహుమతి విజేత భార్గవికి చెక్కును అందజేస్తున్న హోంమంత్రి అనిత, జెడ్పీ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ

తమిళనాడుకు చెందిన భార్గవికి ప్రథమ బహుమతి

కడప, తూర్పు, పశ్చిమగోదావరి మహిళలకు ద్వితీయ స్థానం

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ధనుర్మాసంలో తెలుగు లోగిళ్లలో వాకిళ్ల ముందు తీర్చిదిద్దే ముగ్గులు మహిళల్లోని నైపుణ్యాన్ని, సమర్థతను ప్రతిబింబిస్తాయని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) రాష్ట్రస్థాయి ఫైనల్స్ శనివారం జరిగాయి. విజయవాడలో నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి మహిళలు హాజరయ్యారు. కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. బహుమతి ప్రదానోత్సవానికి హోం మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపునేని ఉషారాణి వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని తమిళనాడుకు చెందిన కె.భార్గవి గెలుచుకున్నారు. ఆమెకు రూ.30 వేల బహుమతిని హోం మంత్రి అనిత అందజేశారు. ద్వితీయ బహుమతిని కడప జిల్లాకు చెందిన పి.రమ్య, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వేణుభార్గవి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పి.సావిత్రి గెలుచుకున్నారు. విజేతల్లో పి.రమ్యకు అబ్బూరి రత్నలక్ష్మి, వేణుభార్గవికి సూరపనేని ఉషారాణి, పి.సావిత్రికి గద్దె అనురాధ రూ.10 వేల చొప్పున బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. మహిళలు వేసిన ప్రతి ముగ్గులోనూ అనేక దృక్కోణాలు ఉంటాయన్నారు. నవమాసాలు మోసి ఒక బిడ్డకు జన్మనిచ్చి కంటికి రెప్పలా ఎలా కాపాడుకుంటారో ఆ విధంగా ముగ్గులను తీర్చిదిద్దుతారన్నారు. మహిళల్లో ఉన్న సమర్థత, నైపుణ్యానికి ఇది గొప్ప నిదర్శనమన్నారు. మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని, అత్యంత శక్తిమంతులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. తనతో తన తండ్రి చిన్నతనం నుంచి డిగ్రీ చదివే వరకు ముగ్గులు వేయించారని బాల్యస్మృతులను గుర్తు చేసుకున్నారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషిని గద్దె అనురాధ అభినందించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి 18 ఏళ్లుగా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోందని న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' విజయవాడ బ్రాంచ్ మేనేజర్ వి.మురళి, ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేశ్ కుమార్, 'ఆంధ్రజ్యోతి' అడ్వర్టైజ్‌మెంట్, సర్క్యులేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ముగ్గు



ద్వితీయ బహుమతి విజేతలు

పి.రమ్య, కడప జిల్లా | వేణుభార్గవి, పశ్చిమగోదావరి | పి.సావిత్రి, తూర్పుగోదావరి

బీసీల పథకాలన్నీ పునఃప్రారంభిస్తాం: సవిత



గుంటూరు(విద్య), జనవరి 11(ఆంధ్రజ్యోతి): బీసీలు రాజకీయంగా, విద్యాపరంగా మరింత అభివృద్ధి సాధించాలని, ఇందుకు కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత చెప్పారు. గతంలో అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలు పునఃప్రారంభించడంతో పాటు వారి సమగ్ర వికాసానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఉద్ఘాటించారు. స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంత్యుత్సవాన్ని గుంటూరులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సవిత మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బీసీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.39వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. ప్రతి జిల్లాలో డీఎస్సీ కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు, రాష్ట్రస్థాయిలో విజయవాడలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమయ్యేలా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. వడ్డెరలను ఎస్సీల్లో చేర్చే ప్రతిపాదనలు మరోసారి పునఃపరిశీలిస్తామన్నారు. వడ్డెరలకు మైనింగ్‌లో ప్రత్యేక కోటా కేటాయించడంతో వారు ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించడానికి చేయూత ఇస్తామని తెలిపారు. గుంటూరు నగరంతోపాటు, రాజధాని ప్రాంతంలో వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ తదితరులు ప్రసంగించారు.

'సౌర' భారం!



వాటిలోని కాడ్మియం, టెల్యూరియం వంటివి భూమిలోకి

వాటివల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికీ ప్రమాదం

భారత్‌లో 2023కే పోగుపడ్డ లక్ష టన్నుల సోలార్ వేస్ట్

రానున్న దశాబ్దాల్లో మరింత భారీగా పెరిగిపోయే ముప్పు

ముందు జాగ్రత్త పడకపోతే ప్రమాదం: నిపుణుల హెచ్చరిక

సౌరఫలకాల రీసైక్లింగ్ దిశగా ఈయూ పటిష్ఠ నిబంధనలు

మన ప్రభుత్వాలు కూడా జాగ్రత్తపడాలని నిపుణుల సూచన

దేశంలో పెరుగుతున్న సౌరవిద్యుత్ వినియోగంతో పేరుకుపోతున్న సోలార్ సెల్స్ మాడ్యూళ్ల వ్యర్థాలు

మృత్యుసముద్రంగా పేరొందిన కబుకీ ఎడారిలో.. 400 కిలోమీటర్ల పొడుగున.. 5 కిలోమీటర్ల వెడల్పున 'సోలార్ గ్రేట్‌వాల్'ను నిర్మిస్తోంది చైనా! దాని ద్వారా 100 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది డ్రాగన్ దేశం లక్ష్యం. మన తెలుగు రాష్ట్రాలు కూడా.. సౌర విద్యుత్తుకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి!! సౌర విద్యుత్తు పర్యావరణ హితం అని భావించడమే ఇందుకు కారణం. ఆ మాట కొంతవరకూ నిజమేగానీ, కాలం చెల్లిన సౌర ఫలకాల వల్ల పర్యావరణానికి ముప్పు పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సౌర విద్యుత్తు అనగానే మనకు గుర్తొచ్చేది.. ఇంటి పైభాగంలో అమర్చే ఆ నల్లటి సౌరఫలకాలే (ఫోటోవోల్టాయిక్ సెల్స్). అన్ని వస్తువుల్లాగానే వాటికి కూడా ఎక్స్‌పైరీ తేదీ ఉంటుంది. అమర్చిన 20-25 ఏళ్లకు వాటికి కాలం చెల్లిపోతుంది. అలా 2030 నాటికి మనదేశంలో 3.4 లక్షల టన్నుల సౌర వ్యర్థాలు పోగుపడతాయని.. 2050 నాటికి అవి 1.9 కోట్ల టన్నులకు చేరుతాయని 'ద కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ)' గత ఏడాది హెచ్చరించింది. ప్రస్తుతానికి మనదేశంలో కాలం చెల్లిన సోలార్‌ప్యానెళ్లను మామూలు తుక్కు కింద మాత్రమే అమ్ముతున్నారు. వాటిని కొనేవారు కూడా.. ఆప్యానెళ్లలోని అల్యూమినియం, రాగి, గ్లాస్ భాగాలను మాత్రమే తీసుకుని.. సిలికాన్, కాడ్మియం టెల్యురైడ్ వంటి వాటిని, పాలిమర్లను పారేస్తున్నారు. అవి భూగర్భంలోకి.. అక్కణ్నుంచీ భూగర్భ జలవనరుల్లోకి చేరి ప్రమాదకరంగా మారుతున్నాయి. వచ్చే దశాబ్దానికి ఆ వ్యర్థాలు ఇప్పటితో పోలిస్తే నాలుగైదు రెట్లు పెరుగుతాయని అంచనా. కాబట్టి పటిష్ఠ నిబంధనలు రూపొందించి ఇప్పటి నుంచే జాగ్రత్తపడాలని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు.. ప్రపంచ విద్యుత్తు వినియోగంలో కేవలం 3 శాతంగా ఉన్న సౌర విద్యుత్తు ప్రపంచంలోని టెల్యూరియం నిల్వల్లో 3 శాతాన్ని, వెండిలో 15%, ఇంకా.. ఇండియమ్, జింక్, టిన్, గాలియం, సెమీకండక్టర్ గ్రేడ్ క్వార్ట్జ్‌ను గణనీయంగా వినియోగించుకుంటున్నట్టు అంచనా.

★ లక్ష టన్నులు!

సౌర విద్యుత్‌కు సంబంధించి.. 2023 నాటికి భారతదేశ స్థాపిత సామర్థ్యం 66.7 గిగావాట్లు. ప్రస్తుతం దాదాపు 75 గిగావాట్లు. 2070 నాటికి 5,600 గిగావాట్లకు చేరుతుందని.. 2070కల్లా భారతదేశం సున్నా కర్బన ఉద్గారాల లక్ష్యాన్ని సాధిస్తుందని సీడబ్ల్యూఈఈ గత ఏడాది ఒక నివేదికలో వెల్లడించింది. దీనికి అనుగుణంగానే సౌరఫలకల వ్యర్థాల పెరుగుదల కూడా ఉంటుందని పేర్కొంది. సీడబ్ల్యూఈఈ నివేదిక ప్రకారం.. 2023 ఆర్థిక సంవత్సరం నాటికే మనదేశంలో పోగుపడ్డ సౌర వ్యర్థాలు లక్ష టన్నులు. కానీ, మనదేశంలో.. సౌర వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కేంద్ర పర్యావరణ, అటవీ, పర్యావరణ మార్పు శాఖ 'ఈ-వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, 2022'లో సోలార్ సెల్స్, మాడ్యుల్స్‌ను కూడా చేర్చింది తప్ప.. వాటి రీసైక్లింగ్‌కి నిబంధనలు రూపొందించలేదు.

★ యూపీ రైతు పిటిషన్..

'కుసుమ్ యోజన' కింద తమ గ్రామంలో పంట పొలాలకు నీళ్లు అందించేందుకు వినియోగిస్తున్న సౌర విద్యుత్ ఫలకాలు పాడైపోతే, వాటిని పంటపొలాల్లో పాతిపెడుతున్నారని, వాటివల్ల భూసారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తూ.. యూపీకి చెందిన ఆశిష్ సింగ్ చందేల్ అనే రైతు జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు ఒక లేఖ రాశారు. ఆ లేఖలోని విషయ తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న ఎన్జీటీ కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. 'సోలార్ వేస్ట్‌'పై వైఖరి తెలపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

★ ఈయూ ముందంజ..

సౌర విద్యుత్తు వ్యర్థాల నిర్వహణకు సంబంధించి యూరోపియన్ యూనియన్(ఈయూ) చాలా ముందంజలో ఉంది. "ద వేస్ట్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ డైరెక్టివ్(డబ్ల్యూఈఈఈ)" పేరుతో రూపొందించిన మార్గదర్శకాల్లో.. సౌర వ్యర్థాల నిర్వహణ బాధ్యతను యూరోపియన్ యూనియన్ ఉత్పత్తిదారులు, పంపిణీదారులపైనే పెట్టింది. సౌరఫలకాల జీవిత కాలం ముగిసే సమయంలో.. వాటిని తిరిగి సేకరించి, సోలార్ మాడ్యూళ్లను పద్ధతిప్రకారం రీసైక్లింగ్ చేసే బాధ్యత వారిదే. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు ఈ దిశగా ఇప్పటికే కసరత్తు చేస్తున్నాయి.

పర్యావరణం.. ఆరోగ్యం.. గుల్ల!

భూగర్భంలోకి, జలవనరుల్లోకి చేరే కాడ్మియం, టెల్యురైడ్ కారణంగా.. పర్యావరణానికి మేలు చేసే ఎన్నోరకాల సూక్ష్మజీవులు చనిపోతాయి. ఫలితంగా పంటల దిగుబడి తగ్గిపోతుంది. ఆ అవశేషాలు మనం తాగే నీటి ద్వారా, పండించే తిండిగింజల రూపంలో మన శరీరంలోకి చేరితే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా.. కాడ్మియం అవశేషాలు ఒంట్లోకి చేరితే మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. శ్వాసకోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంటుంది. అంతేకాదు.. కాడ్మియం క్యాన్సర్ కారకం కూడా.

\- సెంట్రల్ డెస్క్

తిరిగి వాడుకోవచ్చు..



అంతర్జాతీయ పునరుత్పాదక ఇంధనాల సంస్థ (ఐఆర్ఈఏ) అంచనాల ప్రకారం.. కాలం చెల్లిన సౌర ఫలకాల నుంచి సేకరించే ముడిపదార్థాల విలువ 2030 నాటికి 450 మిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.3,860 కోట్లు) ఉండనుంది. అలా సేకరించిన ముడిపదార్థాలతో కొత్తగా 6 కోట్ల సౌరఫలకాలను తయారుచేసి వాటితో 18 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని అంచనా. అలాగే.. 2050 నాటికి అలా సేకరించే ముడిపదార్థాల విలువ 15 బిలియన్ డాలర్లని (దాదాపు రూ.1.28 లక్షల కోట్లు).. వాటితో 200 కోట్ల సోలార్‌ప్యానెళ్లు నిర్మించి 630 గిగావాట్ల విద్యుదుత్పత్తి చేయొచ్చని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు.

ఇండియా క్లైమేట్ అండ్ ఎనర్జీ డాష్‌బోర్డు ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో సౌర విద్యుత్ గణాంకాలు..

రాష్ట్రం	సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం	ఉత్పత్తి అవుతున్న విద్యుత్
ఆంధ్రప్రదేశ్	4,653.6 మెగావాట్లు	5,098.89 మిలియన్ యూనిట్లు
తెలంగాణ	4,842 మెగావాట్లు	4,417.79 మిలియన్ యూనిట్లు

మరో వివాదంలో కొలికపూడి

ఆస్తి తగాదాలో తల దూర్చిన ఎమ్మెల్యే

- ఎస్టీ దంపతులపై దాడి, దూషణలు
- ఆత్మహత్యాయత్నం చేసిన బాధితురాలు



ఆత్మహత్య యత్నం చేసిన చంటి

ఎ.కొండూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వివాదాలకు చిరునామాగా మారిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరో వివాదంలో చిక్కుకున్నారు. గ్రామంలో రెండు కుటుంబాల నడుమ నెలకొన్న ఆస్తి తగాదాలో తలదూర్చిన ఎమ్మెల్యే... ఎస్టీ దంపతులపై దాడి చేశారు. తీవ్ర మనస్థాపానికి గురైన భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం గోపాలపురం గ్రామంలో కొత్తగా సీసీ రోడ్డు నిర్మించారు. ఇది అన్నదమ్ముల మధ్య భూ వివాదానికి కారణమైంది. గ్రామానికి చెందిన భూక్యా రాంబాబు, భూక్యా కృష్ణ అన్నదమ్ముల బిడ్డలు. వీరిలో భూక్యా రాంబాబు టీడీపీ నాయకుడు కాగా భూక్యా కృష్ణ వైసీపీ నేత. కృష్ణ భార్య చంటి పంచాయతీలో 5వ వార్డు సభ్యురాలు. ఈ రెండు కుటుంబాల నడుమ చాలాకాలంగా భూ వివాదం నడుస్తోంది. తాజాగా కృష్ణకు చెందిన ప్రైవేటు భూమిలో రాంబాబు సీసీ రోడ్డు వేశారు. దీన్ని ప్రశ్నిస్తూ కృష్ణ రోడ్డుకు అడ్డంగా కంచె వేశారు. ఈ వివాదం ఎమ్మెల్యే కొలికపూడి దృష్టికి వెళ్లడంతో ఆయన శనివారం సాయంత్రం గ్రామానికి వచ్చారు. రాంబాబు ఎమ్మెల్యే అనుచరుడు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సీసీ రోడ్డును పరిశీలించి అనంతరం భూక్యా కృష్ణ, చంటి దంపతులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని దూషిస్తూ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దంపతులపై దాడి చేసి గాయపరిచారు. ఆ సమయంలో పోలీసులు కూడా అక్కడే ఉన్నారు. ఈ ఘటనతో మనస్థాపానికి గురైన చంటి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను తిరువూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించారు. ఘటనపై ఆగ్రహించిన గామస్తులు, వైసీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరగడంపట్ల ఆగ్రహంతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో మైలవరం ఏసీపీ ప్రసాదరావు, తిరువూరు సీఐ గిరిబాబు తదితరులు గ్రామానికెళ్లి పరిస్థితిని అదుపు చేస్తున్నారు.

చంద్రబాబు అసంతృప్తి.. వివాదం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో ఆయన ఎమ్మెల్యే నుంచి వివరణ తీసుకోవాలని పార్టీ నేతలను ఆదేశించినట్లు సమాచారం. ఏది ఏమైనా ఘటనకు ఎమ్మెల్యే కారణం కావడంపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిసింది.



ఊరు చేరేదెట్లా?

సంక్రాంతికి సరిపడా బస్సులు ఏర్పాటు చేయని ఆర్టీసీ.. బస్టాండ్లలో గంటల తరబడి నిరీక్షణ



- అధికారులపై ప్రయాణికుల ఆగ్రహం
- విద్యాసంస్థల బస్సులు వాడుకోవాలన్న సీఎం చంద్రబాబు
- ముఖ్యమంత్రి ఆదేశాలతో అప్రమత్తమైన ఎండీ తిరుమలరావు
- ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌తో మాట్లాడి తక్షణ ఏర్పాట్లు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రులకు అతిపెద్ద పండగైన సంక్రాంతికి సరిపడా బస్సులు ఏర్పాటు చేయడంలో ఏపీఎస్ఆర్టీసీ విఫలమైంది. రాష్ట్రంలోని ముఖ్యమైన నగరాల నుంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు తగినన్ని బస్సుల్లేక బస్టాండ్లలో గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. విజయవాడ, గుంటూరు, ఏలూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి ఊళ్లకు ప్రయాణం కొనసాగే దారి కనబడటంలేదు. ఉన్న ఒకటి రెండు బస్సుల్లో వందలాది మందిని తరలించలేని పరిస్థితి. ప్రయాణికుల ఇబ్బందుల విషయం తెలియడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుతో మాట్లాడారు. ఐదేళ్ల నుంచి కొత్త బస్సులు కొనుగోలు చేయనందున సరిపడా బస్సుల్లేవని, అందుబాటులో ఉన్న వాటిలో ఎక్కువ పొరుగు రాష్ట్రాలకు పంపామని చెప్పారు. ప్రతి రోజూ వందలాది ప్రత్యేక బస్సులు ఇతర ప్రాంతాలకు తిప్పుతున్నందున మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలకు బస్సుల కొరత ఏర్పడిందని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి కదా అంటూ చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. విద్యాసంస్థలకు సెలవులు ఉన్నందున తక్షణమే విద్యాసంస్థల బస్సుల్లో ఫిట్నెస్ ఉన్నవాటిని వినియోగించుకుని ప్రయాణికుల్ని గమ్యానికి చేర్చాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో మేల్కొన్న ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు సమకూర్చాలంటూ రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాను కోరారు. ఆగమేఘాల మీద మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లను రంగంలోకి దించి ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల్లో ప్రయాణికుల్ని జిల్లా కేంద్రాల నుంచి గమ్యస్థానాలకు తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆర్టీసీ అధికారుల తీరుపై ప్రయాణికులు పలుచోట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ బస్టాండ్లలో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందంటూ మండిపడ్డారు.

సీఎం ఆదేశించేదాకా..

సంక్రాంతి ప్రయాణికుల కోసం 7,200 బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ ఘనంగా ప్రకటించింది. ఈ ప్రకటన చూసి తగినన్ని బస్సులు ఉంటాయిలే అనుకున్న ప్రయాణికులకు నిరాశే మిగిలింది. తగినన్ని బస్సులు ఎందుకు లేవు అని ఆరా తీస్తే ఇక్కడి బస్సుల్ని స్పెషల్ సర్వీసులు కింద పొరుగు రాష్ట్రాలకు పంపినట్లు డిపో మేనేజర్లు చెప్పారు. ఈ సమస్య సోషల్ మీడియాలో వైరల్ అయ్యి ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లింది. ఆయన స్పందించే వరకు కూడా ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ఆర్టీసీ ఎండీతో సహా దాదాపు అందరూ ఇన్‌చార్జిలే ఉండటం, ఉన్నతస్థాయిలో సమన్వయ లోపం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆర్టీసీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ముఖ్యమంత్రి ఆదేశించే దాకా మా అధికారుల్లో చలనం లేదు అని సిబ్బందే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమ వద్ద ఖాళీగా ఉన్న ఆరు వోల్వో ఏసీ, నాలుగు సూపర్ లగ్జరీ బస్సులను అద్దె ప్రాతిపదికపైన వినియోగించుకోవాలని గత 20 రోజులుగా పర్యాటకశాఖ కోరుతున్నా ఆర్టీసీ ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. దీనిపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కండీషన్ బస్సులు తీసుకోండి: ఆర్టీసీ ఎండీ

బస్టాండ్లలో వేచి ఉన్న ప్రయాణికుల్ని గమ్య స్థానాలకు చేర్చేందుకు ఫిట్నెస్‌తో పాటు మంచి కండీషన్ ఉన్న బస్సులు మాత్రమే అవసరం మేరకు వినియోగించాలని ఎండీ తిరుమల రావు డిపో మేనేజర్లను ఆదేశించారు. రవాణా శాఖ అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న అన్ని రకాల బస్సుల్ని రోడ్డెక్కించి సిబ్బంది సహకారంతో నిరంతరం బస్సులు నడపాలని సూచించారు. మరోవైపు రోడ్లు, కూడళ్ల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జిల్లా ఎస్పీలు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి డీజీపీ హోదాలో జిల్లాల ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా స్థానిక పోలీసుల్ని సమాయత్తం చేయాలన్నారు.


విజయవాడ కంట్రోల్ రూమ్ జంక్షన్‌లో వాహనాల రద్దీ

సంక్రాంతికి సొంతూళ్లకు

- హైదరాబాద్ నుంచి ఒకేరోజు 4లక్షల మంది రాక

విజయవాడ, బస్‌స్టేషన్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను సొంతూరిలో జరుపుకునేందుకు హైదరాబాద్ నుంచి రికార్డు స్థాయిలో ప్రయాణికులు తరలివస్తున్నారు. దీంతో ప్రధాన రహదారులన్నీ రద్దీగా మారాయి. బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. రవాణా అధికారుల అంచనా ప్రకారం శనివారం ఒక్కరోజే 4లక్షల మంది హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరారు. గతేడాది ఇదేరోజున 3లక్షల మంది రాగా, ఈసారి వీరి సంఖ్య లక్ష పెరిగింది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, రైళ్లు, విమానాల ద్వారా దాదాపు 2లక్షల మంది వచ్చారని అంచనా. మరో 2లక్షల మంది తమ సొంత వాహనాలు, క్యాబ్‌ల్లో వస్తున్నారు. విపరీతమైన రద్దీ నేపథ్యంలో చిల్లకల్లు, కీసర టోల్‌ప్లాజాల వద్ద భారీ సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. శనివారం ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు 16వేల వాహనాలు వచ్చాయి. అర్ధరాత్రికి ఈ సంఖ్య 20 వేలు దాటుతుందని అంచనా వేస్తున్నారు. ఆదివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. ప్రయాణికులతో విజయవాడ బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ కిటకిటలాడుతున్నాయి. షెడ్యూల్ రైళ్లతో పాటు అదనంగా 58 సంక్రాంతి ప్రత్యేక రైళ్లు నడిపినా కూడా సరిపోని పరిస్థితి నెలకొంది. ఏలూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నానికి ఆర్టీసీ అధికారులు 200కు పైగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. విజయవాడ నుంచి రాజమహేంద్రవరానికి ఎన్ని బస్సులు పెట్టినా చాలకపోవడంతో విజయవాడలో తిరిగే సిటీ బస్సులు, అద్దె బస్సులు కూడా పంపిస్తున్నారు.

కొక్కొరో.. కో



కాలు దువ్వుతున్న కోళ్లు.. సిద్ధమైన బరులు .. కోస్తా జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి.. ఇతర రాష్ట్రాల నుంచీ రాక

(భీమవరం, కాకినాడ, మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి)

ఈసారి సంక్రాంతి 'డే'లన్నీ డేగవే.. కాదు కాదు.. నెమలి దెబ్బకు తట్టుకునే పుంజేలేదు.. సీతువా బరిలో దిగితే ఎదురుండదు.. కాకి డేగకు తిరుగుండదు.. ఇలా ఓ పక్క కుక్కుట శాస్త్రం లెక్కలు జోరుగా కొనసాగుతున్నాయి. మరో పక్క బరులు సిద్ధమవుతున్నాయి. పందెం కోళ్లు పోరాటానికి కాలు దువ్వుతున్నాయి. ఇంకోపక్క కోడి పందేలకు తోడు గుండాట, పేకాట టేబుళ్లు రెడీ అవుతున్నాయి. కోస్తా జిల్లాల్లో ఎటు చూసినా సంక్రాంతి సంబరాల జోష్ కనిపిస్తోంది. పలు ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి పందెం రాయుళ్లు బరుల ప్రాంతాలకు చేరుకుంటున్నారు. హోటళ్లు అన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీల కోసం ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. పెద్ద బరుల వద్ద విందు, వినోద కార్యక్రమాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ఆఫర్లలో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పశ్చిమంలో పెద్ద బరులు..

పందేలకు కేరాఫ్ అడ్రస్ అయిన గోదావరి జిల్లాల్లో బరులు ఇప్పటికే సిద్ధమయ్యాయి. పశ్చిమ గోదావరిలో భారీ బరులకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఈసారి అధిక సంఖ్యలో పందెం రాయుళ్లు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈసారి ఐదు రోజుల వరకు జిల్లాలోని అన్ని హోటళ్లు భర్తీ అయిపోయాయి. భీమవరం రూరల్ మండలంలో ఎల్ఈడీ బల్బులతో, వినోద కార్యక్రమాలతో పెద్ద ఎత్తున బరి నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. పెదఅమిరంలో ప్రారంభ పందాన్ని రూ.కోటితో నిర్వహిస్తారని చెబుతున్నారు.

కలగంపూడి కథే వేరు..

పాలకొల్లు నియోజకవర్గంలోని కలగంపూడిలో పెద్ద బరి వద్ద కుటుంబ సమేతంగా కోడి పందేలను వీక్షించడానికి గతంలోలాగే ఏర్పాట్లు పూర్తయ్యాయి. సమీపంలోని యలమంచిలిలో విందు కూడా ఏర్పాటు చేస్తున్నారు. కుటుంబాలతో సహా వచ్చే వారికి ఫొటో సెషన్ ఉంటుంది. పెద్దమొత్తంలో పందేలు కాసేవాళ్లు ఇదే బరికి వెళుతుంటారు.

పందేలకు 'తూర్పు' సై

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోడిపందేలకు ఏర్పాట్లు భారీగా జరుగుతున్నాయి. కరపలో ఓ బరిలో మూడు రోజులకు కలిపి 63 జతల జోడు పందేలు నిర్వహించనున్నారు. ఇందులో అత్యధిక పందేలు గెలిచిన విజేతకు మహీంద్రా థార్ జీపు బహుమతిగా ఇవ్వనున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, అనపర్తి, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు.

పండగ జోష్‌కు కృష్ణా సిద్ధం

ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా సంక్రాంతి పండగకు కోడిపందేల బరులు సిద్ధమవుతున్నాయి. బరుల వద్ద పేకాట, గుండాట కేంద్రాలు ఏర్పాటుచేశారు. కోడి పందేలతోపాటు పేకాట రాయుళ్లను ఆకర్షించేందుకు నిర్వాహకులు పెద్దఎత్తున సౌకర్యాలు సమకూర్చేపనిలో ఉన్నారు. బాపులపాడు మండలంలోని అంపాపురంలో హైటెక్ హంగులతో భారీ బరిని ఏర్పాటుచేశారు. కేసీనోని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఇక్కడి పెద్దబరుల్లో ఒక్కో పందేనికి రూ20 లక్షలుగా నిర్ణయించారు. కాగా, కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.


భీమవరంలో ఏర్పాటు చేసిన బరి

సంక్రాంతి సంబరాల్లో ఈగల్ చీఫ్ రవికృష్ణ


స్లో సైక్లింగ్ పోటీలో సైకిల్ తొక్కుతున్న రవికృష్ణ

దేవనకొండ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ గడ్డ కప్పట్రాళ్లలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో 'ఈగల్' విభాగం చీఫ్, ఐజీ ఆకే రవికృష్ణ సందడి చేశారు. కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల గ్రామంలో జరిగే సంక్రాంతి వేడుకల్లో ఆయన ప్రతి ఏటా పాల్గొంటారు. శనివారం జరిగిన సంబరాలకు రవికృష్ణ కుటుంబసమేతంగా హాజరయ్యారు. ఆయనకు గ్రామ ప్రజలు పూల వర్షంతో ఘనస్వాగతం పలికారు. వేడుకల్లో భాగంగా రవికృష్ణ స్థానిక యువకులతో కలసి కబడ్డీ, బ్యాడ్మింటన్, స్లో సైక్లింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల ముగ్గుల పోటీలను ఆసక్తిగా తిలకించారు.


కాకినాడ జిల్లా వెంకటకృష్ణాపురంలో పందాలకు సిద్ధంగావున్న కోడిపుంజులు

సంక్రాంతికి స్వగ్రామానికి చంద్రబాబు

- భువనేశ్వరి పట్టుదలతోనే పాతికేళ్లుగా వెళ్తున్నా
- తెలుగువారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు: సీఎం

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు తన స్వగ్రామం నారావారిపల్లికి వెళ్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో ముచ్చటించారు. 13, 14 తేదీల్లో తమ గ్రామంలో గడపనున్నట్లు చెప్పారు. 'నా సతీమణి భువనేశ్వరి పట్టుదలతోనే పాతికేళ్లుగా క్రమం తప్పకుండా సంక్రాంతికి మా ఊరికి వెళ్లి అక్కడ ఉంటున్నాను. సమాజంలో పైనున్నవారు ఒక సంప్రదాయం పాటిస్తే అది మిగిలిన ఒక ప్రేరణగా ఉంటుంది. ఈ రోజుల్లో మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయి. ఏదో ఒక సందర్భంలో నలుగురూ ఒకచోట కలవడం, మాట్లాడుకోవడం అవసరం. దానికి ఈ పండగ ఒక సందర్భం కావాలని ఆశిస్తున్నాను. తెలుగువారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ పండగ తెలుగువారందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ఆనందం పంచాలని కోరుకొంటున్నాను' అని ఆయన అన్నారు. మన ఊళ్లో ఆనందంగా పండగ చేసుకొనే సమయంలో అదే గ్రామంలో పేదవాడు కూడా ఆనందంగా ఉండేలా చూసుకోవాలని, ఈ విషయంలో కలిగిన వారి పాత్ర పెంచడానికి పీ4 విధానాన్ని తీసుకురాబోతున్నామని తెలిపారు. 'ఆర్థికంగా స్థిరపడినవారు తమ గ్రామంలో ఒకటి లేదా కొన్ని పేదల కుటుంబాలను దత్తత తీసుకొని ఆర్థికంగా వారిని పైకి తేవాలి. అదే పీ4 విధానం. దీనిపై కాన్సెప్ట్ పత్రాన్ని ఒకటి రెండు రోజుల్లో విడుదల చేయబోతున్నాం. ఈ పనిని బాగా చేసినవారిని ఎంపిక చేసి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అవార్డులు కూడా ఇస్తాం' అని వివరించారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో రోడ్లపై గుంతలు పూడ్చాలని అనుకొని చాలావరకూ చేశామని, మిగిలిన వాటిని వచ్చే నెలాఖరు నాటికి బాగు చేస్తామని, అవసరమైతే అదనపు బడ్జెట్ ఇస్తామని చంద్రబాబు వివరించారు. కాగా, సీఎం సతీమణి భువనేశ్వరితో పాటు ఆమె సోదరి లోకేశ్వరి, తోడికోడలు నారా ఇందిర, బంధువులు కంఠమనేని శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీమాన్ తదితరులు శనివారం మధ్యాహ్నం నారావారిపల్లి చేరుకున్నారు. ఆదివారం రాత్రికి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్, ఎమ్మెల్యే బాలకృష్ణ ఆయన భార్య వసుంధర రానున్నారు.

నేడు తిరుపతికి సీఎం రాక

తిరుపతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు తిరుపతి రానున్నారు. విజయవాడ నుంచి విమానంలో బయల్దేరి మధ్యాహ్నం 3.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన తిరుచానూరు చేరుకుంటారు. అక్కడ ఏజీ అండ్ పీ (అట్లాంటిక్ గల్ఫ్ అండ్ పసిఫిక్) కంపెనీకి సంబంధించి ఇళ్లకు పీఎన్‌జీ (పైప్డ్ నాచురల్ గ్యాస్) సరఫరాను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఓ వినియోగదారుడి ఇంటికి వెళ్లి గ్యాస్ సరఫరాను పరిశీలిస్తారు. 4.30 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుని ఆ కంపెనీ ఏర్పాటు చేసిన సీఎన్‌జీ ఆటో, ఎల్పీజీ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తారు. హోటల్‌లో ఆ కంపెనీ ప్రతినిధులతోనూ, జపాన్‌కు చెందిన పెట్టుబడిదారులతోనూ సమావేశమవుతారు. సాయంత్రం 6 గంటలకు బయల్దేరి స్వగ్రామమైన నారావారిపల్లికి చేరుకుంటారు. 15న విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారు. సీఎం చంద్రబాబు మూడు రోజుల పాటు జిల్లాలో గడపనుండడంతో జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది.

రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులు

- హరిత ఇంధన రంగంలోకి వస్తున్నాయి
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా హ్యాపీ సండే కార్యక్రమాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కనీవిని ఎరుగని రీతిలో హరిత ఇంధన రంగంలో రాష్ట్రానికి రూ.పది లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, కంప్రెస్డ్ బయో గ్యాస్, సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ తదితర రంగాల్లో ఇంత భారీ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. ఇందులో మొదటి భారీ పెట్టుబడిగా విశాఖపట్నం వద్ద పూడిమడకలో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్టీపీసీ భాగస్వామ్యంతో రూ.లక్షా ఎనభై ఐదు వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు కాబోతోందని, దీనికి ప్రధాని మోదీ ఇటీవల శంకుస్థాపన చేశారని వివరించారు. శనివారం ఆయన ఇక్కడి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పలు రంగాల్లో కొత్త ఆలోచనల దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తున్న అంశాలను వివరించారు. ఆయన చెప్పిన అంశాలు సంక్షిప్తంగా....


టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

గ్రీన్ హైడ్రోజన్ హబ్

"పూర్తిగా హరిత ఇంధనంతోనే ఇక్కడ హైడ్రోజన్ తయారవుతుంది. సముద్రపు నీటిని రసాయనిక ప్రక్రియ ద్వారా విడగొట్టి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తారు. ఈ హబ్‌లో రసాయనాలు, ఎరువులు వంటివి తయారుచేసి ఎగుమతి చేస్తారు. హరిత ఇంధనంతో తయారైన రసాయనాలు, ఎరువులకు విదేశాల్లో డిమాండ్ ఉంది. దీనికి పొరుగునే ఉన్న ఎన్టీపీసీ థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గు మండించడం వల్ల వెలువడే కార్బన్ డై ఆక్సైడ్‌నూ ఈ ప్లాంట్‌లో హైడ్రోజన్ తయారీకి వాడతారు. దీనివల్ల వాతావరణంలోకి విడుదలయ్యే కర్బన ఉద్గారాలు తగ్గిపోతాయి. సంప్రదాయ విద్యుత్‌తో కాకుండా హైడ్రోజన్‌తో ఉక్కు, అల్యూమినియం తయారుచేయడం వల్ల ఆ సమయంలో వెలువడే వేడి కూడా తగ్గుతుంది. దీనివల్ల వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. పర్యావరణాన్ని కాపాడటంలో మన దేశ లక్ష్యాలను సాధించడానికి ఇది ఉపయోగపడుతుంది. గ్రీన్ కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీని టేకోవర్ చేసి గ్రీన్ అమ్మోనియా తయారుచేసి ఎగుమతి చేయబోతోంది. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ ద్వారా ఉత్పత్తి అయిన పునరుత్పాదక విద్యుత్‌ను కాకినాడ తీసుకువచ్చి దాని ద్వారా గ్రీన్ అమ్మోనియా తయారు చేస్తారు. ఈ ప్లాంట్‌పై ఈ కంపెనీ రూ.25వేల కోట్లు పెట్టుబడి పెట్టబోతోంది"

రిలయన్స్ బయో గ్యాస్ కేంద్రాలు

"రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో 500 కంప్రెస్డ్ బయో గ్యాస్ కేంద్రాలు ఏర్పాటు చేయబోతోంది. ఒక్కోటి రూ.130 కోట్ల పెట్టుబడితో పెట్టనున్నారు. వృథా భూముల్లో గడ్డి పెంచి దానిద్వారా ఈ కేంద్రాల్లో బయోగ్యాస్ ఉత్పత్తి చేస్తారు. రైతుల నుంచి భూమిని కౌలుకు తీసుకుంటారు. ఎకరానికి ఏడాదికి రూ.30వేలు కౌలు ఇస్తారు. బయోగ్యాస్ తయారీలో ఉత్పత్తయ్యే వృథా పదార్థం ఎరువుగా వినియోగించి భూసారం పెంచడానికి వాడుకొనే వీలుంది. ఈ కేంద్రాల ఏర్పాటు ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కూడా వస్తాయి"

కుప్పంలో బ్యాటరీ శ్వాపింగ్ చార్జింగ్ పథకం

"కుప్పం నియోజకవర్గంలో ప్రతిఇంటి మీదా సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఇళ్లలో విద్యుత్ వాహనాల బ్యాటరీలను చార్జింగ్ చేయించుకోవడానికి బెంగళూరుకు చెందిన సంస్థ ముందుకొచ్చింది. చార్జింగ్ అయిన బ్యాటరీలను విద్యుత్ వాహనాల్లో వినియోగించుకోవడానికి అద్దెకు ఇస్తుంది. విద్యుత్ వాహనాలను వాడేవారు తమ బ్యాటరీలో చార్జింగ్ అయిపోయిన వెంటనే ఈ సంస్థకు దానిని ఇస్తే, ఫుల్ చార్జింగ్ ఉన్న మరో బ్యాటరీ అద్దెకు ఇస్తారు. అలా అవసరం వచ్చినప్పుడల్లా బ్యాటరీలు మార్చుకోవచ్చు. దీనికి ఆ సంస్థ కొంత మొత్తం వసూలు చేస్తుంది. దీనికోసం తమ వద్ద వేల సంఖ్యలో ఉన్న బ్యాటరీలను కుప్పం నియోజకవర్గంలోని ఇళ్లలో చార్జింగ్ చేయించుకొని దానికి ఆ ఇంటివారికి ఆ సంస్థ కొంత మొత్తం చెల్లిస్తుంది. ఆ ఇంటి యజమానికి ఇది అదనపు ఆదాయం తెచ్చిపెడుతుంది. సౌర ఫలకాల వల్ల ఉచిత విద్యుత్ వస్తే దానిని చార్జింగ్‌కు వాడుకోవడం వల్ల అదనపు ఆదాయం వస్తుంది. కుప్పంలో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేసి బాగుంటే రాష్ట్రం అంతా విస్తరిస్తారు"

ప్రతి ఇంటికీ సౌర ఫలకాలు

"ప్రభుత్వ ఖర్చుతో ప్రతిఇంటికీ సౌర ఫలకాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. సూర్యఘర్ పథకం కింద ప్రస్తుతం ఈ ఫలకాల ఏర్పాటుకు కేంద్రం సబ్సిడీ ఇస్తోంది. ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి ప్రభుత్వం మొత్తం ఖర్చు భరించి వారి ఇళ్లపై సౌర ఫలకాలు ఏర్పాటు చేయిస్తోంది. తాజాగా అన్ని వర్గాలవారి ఇళ్లపైనా వీటిని ఏర్పాటు చేయడంపై యోచిస్తున్నారు. ప్రభుత్వం తన ఖర్చుతో వీటిని ఏర్పాటు చేస్తుంది. వీటి ద్వారా తయారయ్యే విద్యుత్‌లో కొంత భాగం ప్రభుత్వం తీసుకుంటుంది. ప్రభుత్వం పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేవరకూ తీసుకొని, తర్వాత మొత్తం యూనిట్‌ను ఇంటి యజమానికి అప్పగించేస్తారు. అప్పటినుంచి మొత్తం విద్యుత్ యజమానికే చెందుతుంది. సుమారుగా ఐదేళ్లపాటు కొంత వాటా విద్యుత్‌ను ప్రభుత్వం తీసుకొనే అవకాశం ఉంది. దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకు వచ్చే సౌర విద్యుత్ లభ్యత పెరుగుతుంది"

బ్యాటరీ చార్జింగ్ స్టేషన్లు

"విద్యుత్ వాహనాలకు ఉపయోగపడేలా రాష్ట్రవ్యాప్తంగా 5వేల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. దీనితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఫుల్‌చార్జింగ్ బ్యాటరీని అప్పటికప్పుడు మార్చుకొనే శ్వాపింగ్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేయబోతున్నాం"

మరికొన్ని కొత్త ఆలోచనలు...

"ప్రభుత్వపరంగా మరికొన్ని కొత్త ఆలోచనలు చేస్తున్నాం. కుప్పం నియోజకవర్గంలో వినికిడి సమస్యలు, మానసిక ఎదుగుదల సమస్యలు, మాట్లాడటంలో సమస్యలు ఉన్న పిల్లలకు వివిధ అంశాలను యాప్‌ల సహాయంతో నేర్పే టెక్నాలజీని ఒక సంస్థ తెచ్చింది. దానిని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వాడి చూస్తున్నాం. ఇది బాగుందని, ఉపయోగకరంగా ఉందని అంగన్‌వాడీ కార్యకర్తలు చెబుతున్నారు. ఫలితాలు బాగుంటే రాష్ట్రం అంతా అమలు చేస్తాం. ఆర్గానిక్‌ఉత్పత్తులు ఏ పొలంలో, ఏ ప్రాంతంలో పండాయో తెలిపే కొత్త టెక్నాలజీని ఒక సంస్థ తెచ్చింది. ప్యాకింగ్‌పై ఉన్నగుర్తులను ఫొటో తీస్తే అది ఏ ఊరి పొలంలో పండిందో ఆ టెక్నాలజీ చెబుతుంది. రాష్ట్రంలో సుమారుగా పదివేల ఎకరాల భూమికి ఆర్గానిక్ పంటలు పండించడానికి సర్టిఫికెట్ అనుమతి ఉంది. ఈ విస్తీర్ణం ఇంకా పెంచడానికి ప్రయత్నిస్తున్నాం. సర్టిఫైడ్ పంటలను కొనుగోలు చేయడానికి చాలా సంస్థలు ముందుకొస్తున్నాయి. రాష్ట్రాన్ని మార్కెట్ చేయడానికే దావోస్ పర్యటనకు వెళుతున్నాను. ఇక్కడ ఉన్న అవకాశాలను అక్కడకు వచ్చినవారికి వివరిస్తాం. కంపెనీల యాజమాన్యాలతో నెట్‌వర్కింగ్ చేసుకొని రాష్ట్రానికి ఆహ్వానిస్తాం".

సచివాలయాల్లో సిబ్బంది క్రమబద్ధీకరణ

"గ్రామ, వార్డు సచివాలయాలను 3విభాగాలుగా వర్గీకరిస్తున్నాం. 2,500 జనాభా ఉన్నవి ఒక విభాగం, 2,500- 5,000 జనాభా ఉన్న ప్రాంతాలు రెండో విభాగం, 5వేలు పైన జనాభా ఉన్న ప్రాంతాలు మూడో విభాగం చేశాం. జనాభాను బట్టి సచివాలయాల్లో సిబ్బంది సంఖ్య నిర్ణయం అవుతుంది. మిగులు సిబ్బందిని వారి విధులకు సంబంధించిన ప్రభుత్వ శాఖలకు అప్పగిస్తున్నాం. ఉదాహరణకు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను ఇంజనీరింగ్ శాఖలకు అప్పగిస్తాం. ప్రభుత్వ శాఖల్లో పనిభారం ఎలా ఉందో శాస్త్రీయంగా అధ్యయనం చేస్తున్నాం. చిత్తూరు జిల్లాలో జరిగిన ఒక అధ్యయనంలో ఆ జిల్లా జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా కేవలం 2శాతం ఉంది. అదే ఉద్యానవన పంటల వాటా 18శాతం, పాడిపరిశ్రమ వాటా 18శాతం ఉంది. వ్యవసాయ శాఖలో సిబ్బంది మాత్రం పుష్కలంగా ఉన్నారు. దీనిని ఎలా సర్దుబాటు చేయాలన్నదానిపై ఆలోచన చేస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఇంటిని...అందులోని వ్యక్తులను నిర్దిష్టంగా గుర్తించే పనిని చేపట్టనున్నాం. ప్రతి వ్యక్తినీ ఆధార్‌తో అనుసంధానిస్తాం. ఆ వ్యక్తులు ఉన్న ఇళ్లను జియో ట్యాగింగ్ చేస్తాం. దీంతో ఏ ఇంటిలో ఎవరు ఉంటున్నారు... ఎందరు ఉంటున్నారన్నది పక్కాగా తెలుస్తుంది. ఇటీవల విజయవాడ వరదల్లో నష్టపోయినవారికి ఇచ్చిన పరిహారంలో 10శాతం వారి ఖాతాల్లో పడలేదు. వారి బ్యాంక్ ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదు. ఈ సమస్యను రాష్ట్రం అంతా సవరిస్తున్నాం. సిసి కెమేరాలు, ఐవోటీ పరికరాలు, డ్రోన్లు వంటివాటికి ఈ డేటాను అనుసంధానిస్తాం. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా వ్యక్తికి మందులు పంపాలంటే చిరునామా వెతుక్కోవాల్సిన పనిలేకుండా డ్రోన్ సరాసరి అతని ఇంటికి వెళ్లి అందజేసే సౌలభ్యం వస్తుంది. ప్రభుత్వ పథకాల అమల్లో చికాకులు కూడా తగ్గుతాయి".



విజయవాడలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలనే తీర్మాన ప్రతితో పీసీసీ చీఫ్ షర్మిల, లెఫ్ట్ నేతలు రామకృష్ణ, బాబూరావు తదితరులు

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- బీజేపీ కుల, మత రాజకీయాలు చేస్తోంది: షర్మిల
- అఖిలపక్ష నిర్ణయాన్ని రాష్ట్రపతి ముర్ముకు పంపాలని తీర్మానం

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'బీజేపీ మత పిచ్చి పార్టీ. కుల మతాలతో ఆ పార్టీ రాజకీయం చేస్తోంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను బీజేపీ పనిముట్టులా వాడుకుంటోంది' అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. శనివారం విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో అఖిలపక్ష సమావేశం జరిగింది. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ విధానాలు, అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వాఖ్యలపైన వివిధ పార్టీల నేతలు మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఇతర ప్రజాసంఘాలు, కులసంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్న ఆ సమావేశం... అంబేడ్కర్‌ను ఎగతాళి చేసిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతి పంపాలని తీర్మానించింది. షర్మిల మాట్లాడుతూ... 'దేశం మొత్తాన్ని కాషాయమయం చేసే కుట్రలు బీజేపీ చేస్తోంది. మహాత్మాగాంధీని విలన్‌గా, గాడ్సేను హీరోలా చిత్రీకరిస్తోంది. రాజ్యాంగాన్ని రాసిన అంబేడ్కర్‌ను కించపరచేలా అమిత్‌షా మాట్లాడితే.. ప్రధానితో సహా బీజేపీ నేతలంతా మద్దతు పలకడం ఏమిటి? అంబేడ్కర్‌ను, అమిత్‌షా ఎగతాళి చేస్తే బీజేపీ ఎంపీలు పకపకా నవ్వుతూ ఎంజాయ్ చేశారు' అని ఆరోపించారు.

4.5 కోట్ల బంగారు ఆభరణాలతో చెక్కేశాడు

- యజమానులను మోసగించి పరారైన డ్రైవర్

జగ్గయ్యపేట/ నందిగామ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రూ.4.5కోట్ల విలువ చేసే 6.5 కేజీల బంగారు అభరణాలతో కారు డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగింది. విజయవాడలోని బీఎస్ఆర్ జ్యూయలర్స్ సంస్థ ప్రతినిధులు హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని శ్యాంబాబు జ్యుయలర్స్ వద్ద బంగారు అభరణాలు తీసుకొని కారులో బయల్దేరారు. కారులో డ్రైవర్ జితేశ్‌తో బీఎస్ఆర్ జ్యూయలర్స్ ఉద్యోగులు బాలకృష్ణ, అంబుదాస్ ఉన్నారు. మధ్యాహ్నం జగ్గయ్యపేట సమీపంలోని ఫుడ్‌ప్లాజాలో టిఫిన్ చేద్దామని జితేశ్ అనటంతో బాలకృష్ణ, అంబుదాస్ కారుదిగారు. కారు పార్క్ చేసి వస్తానని చెప్పిన డ్రైవర్... అటునుంచి అటే పరారయ్యాడు. జితేశ్ ఎంతసేపటికీ రాకపోవటంతో ఉద్యోగులు ఫోన్ చేసినా స్పందించలేదు. పార్కింగ్ ప్రదేశంలో కారు కూడా లేకపోవడంతో నందిగామ ఏసీపీ తిలక్‌కు ఫిర్యాదు చేశారు. భారీ మొత్తంలో బంగారు అభరణాలతో డ్రైవర్ పరార్ కావటంతో బీఎస్ఆర్ జ్యూయలర్స్ ప్రతినిధులు సీపీని కూడా కలిసి సంఘటనను వివరించినట్టు సమాచారం.



పాడేరులో శనివారం ఉదయం పొగమంచు

జి.మాడుగులలో గజగజ

3.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి ప్రభావం అధికమవుతోంది. దీంతో గిరిజనులు గజగజ వణుకుతున్నారు. శనివారం జి.మాడుగులలో 3.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో 4 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదుకావడం ఇది రెండోసారి. అలాగే డుంబ్రిగుడలో 4.2, హుకుంపేట, అరకు లోయల్లో 4.9, పాడేరులో 7.5, అనంతగిరిలో 7.6, చింతపల్లిలో 7.9, పెదబయలులో 8.2, ముంచంగిపుట్టులో 9, కొయ్యూరులో 10.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శనివారం ఉదయం పది గంటల వరకూ పొగమంచు దట్టంగా అలముకోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.

దక్షిణ కోస్తా, రాయలసీమలకు వర్ష సూచన

విశాఖపట్నం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం శనివారానికి నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతోంది. దీని ప్రభావంతో సముద్రం నుంచి తూర్పుగాలులు తమిళనాడు, దానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల వైపు వీస్తున్నాయి. దీంతో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, సీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

ఏప్రిల్ 27 నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

- 8 నోటిఫికేషన్లకు పరీక్షల తేదీలు ఖరారు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జారీ చేసిన ఎనిమిది నోటిఫికేషన్లకు ఏపీపీఎస్సీ పరీక్షల తేదీలు ఖరారు చేసింది. వైసీపీ హయాంలో నోటిఫికేషన్లు జారీ చేసిన తర్వాత ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఆయా నోటిఫికేషన్లకు సంబంధించి ఏపీపీఎస్సీ ఇప్పుడు రాత పరీక్షలు నిర్వహించనుంది. మొత్తం 8 నోటిఫికేషన్లకు కామన్‌గా నిర్వహించే జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ పరీక్షను ఏప్రిల్ 28న నిర్వహించనున్నారు. ఏపీ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ పరీక్ష ఏప్రిల్ 28న, వైద్య శాఖలో లైబ్రేరియన్ పరీక్ష 27న, గిరిజన సంక్షేమ సహాయ అధికారి పరీక్ష 30న, దివ్యాంగులు-సీనియర్ సిటిజన్ శాఖలో సహాయ డైరెక్టర్ పరీక్ష 27న, భూగర్భ జలవనరుల శాఖలో అసిస్టెంట్ కెమిస్ట్, విద్యుత్ శాఖలో సహాయ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష 28న, సహాయ గణాంక అధికారి పరీక్ష 29న, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి పరీక్ష 30న నిర్వహించనున్నారు.

వైఎస్ అభిషేక్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి

- పులివెందులలో జగన్ దంపతుల నివాళి



వైఎస్ అభిషేక్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ సీఎం జగన్

పులివెందుల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన వైఎస్ అభిషేక్‌రెడ్డి భౌతికకాయం వద్ద మాజీ సీఎం జగన్ దంపతులు నివాళులు అర్పించారు. అనంతరం అభిషేక్‌రెడ్డి అంత్యక్రియలను పులివెందులలో పూర్తిచేశారు. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పెదనాన్న మనవడైన అభిషేక్ రెడ్డి వైసీపీ వైద్యవిభాగ రాష్ట్ర కార్యదర్శిగా, గత సార్వత్రిక ఎన్నికల్లో లింగాల మండల వైసీపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో మృతిచెందారు. అదేరోజు రాత్రి అభిషేక్‌రెడ్డి భౌతికకాయాన్ని పులివెందులలోని అంబకపల్లె రోడ్డులోని స్వగృహానికి తీసుకువచ్చారు. శనివారం మధ్యాహ్నం మాజీ సీఎం జగన్, భారతీ దంపతులు బెంగళూరు నుంచి పులివెందుల వచ్చారు. అభిషేక్ రెడ్డి భార్య సౌఖ్య, కుమార్తెలు అక్షర, ఆకర్ష.. అభిషేక్ తండ్రి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, తాత వైఎస్ ప్రకాశ్‌రెడ్డిలను జగన్ ఓదార్చారు. పులివెందుల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఉదయం అభిషేక్‌రెడ్డి స్వగృహానికి వెళ్లి నివాళులు అర్పించారు.

రాళ్ల సీమలో

పవర్ ప్రాజెక్టు.. అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటుచేస్తోంది. నిర్మాణాన్ని దాదాపుగా పూర్తిచేసుకున్న ఈ ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పవన్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "ఐఆర్‌ఈపీ కోసం 2,800 ఎకరాలకుగాను 1,700 ఎకరాలను ప్రభుత్వం, రైతుల నుంచి గ్రీన్‌కో కంపెనీ సేకరించింది. మరో 902 ఎకరాలను కేంద్ర ప్రభుత్వ అనుమతితో అటవీ శాఖ భూమి తీసుకొని, అందుకు సమానమైన భూమి నెల్లూరు జిల్లాలో అటవీ శాఖకు ఆ కంపెనీకి అప్పగించింది. మొక్కలు పెంచడానికి మరో రూ.36 కోట్లు కూడా ఇచ్చింది. ఈక్రమంలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య దాదాపు 111 ఎకరాల భూమి విషయంలో వివాదం మొదలైంది. ఇది నా దృష్టికి వచ్చినప్పుడు.. క్షేత్రస్థాయిలో నే పరిస్థితిని గమనించాలని భావించి ఇక్కడకు వచ్చాను. ఈ వివాదం పరిష్కరించాలని కేంద్రాన్ని కోరాం. సీఎం చంద్రబాబు, మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లి గ్రీన్‌కో కంపెనీకి సహకరిస్తాం. రానున్నకాలంలో ఈ ప్రాంతం పర్యటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. భూములు ఇచ్చిన పిన్నాపురం, గుమ్మటంతండా గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు, సేంద్రియ వ్యవసాయం, గో సంరక్షణ కార్యక్రమాలు గ్రీన్‌కో చేపట్టాలి. విద్యా ప్రగతికి తోడ్పాటు అందించాలి" అని పవన్ కోరారు. పిన్నాపురం ఐఆర్‌ఈపీ ప్రాజెక్టు దేశానికే తలమానికమన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఇదే తొలిసారి ప్రాజెక్టు అని వివరించారు. గ్రీన్‌కో సంస్థ దేశంలో గ్రీన్ ఎనర్జీ కోసం ఇప్పటివరకు రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టగా, అందులో 30 వేల కోట్లు రాష్ట్రంలో పెట్టిందన్నారు. మరో రూ.20 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. పిన్నాపురం ప్రాజెక్టులో రూ.12 వేల కోట్లు పెట్టుబడి పెట్టగా, మరో రూ.10 వేల కోట్లు పెట్టాల్సి ఉందని తెలిపారు. ఆ ప్రాజెక్టు 12 వేల మందికి ఉపాధి కల్పిస్తుందని పవన్ చెప్పారు. దీనికి ముందు.. ఆయన ఐఆర్‌ఈపీలో భాగంగా నిర్మించిన అప్పర్ ఇన్‌టెక్ పాయింట్, లోయర్ ఇన్‌టెక్ పాయింట్‌తో పాటు పవర్ హౌస్‌ను పరిశీలించారు. టన్నెల్‌లో స్వయంగా రేంజ్‌రోవర్ కారు నడిపారు. ప్రాజెక్టు నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి.. తదితర వివరాలను పవర్ పాయింట్ ద్వారా పవన్‌కు కంపెనీ ఇంజనీర్లు వివరించారు.

అన్ని జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్ పెట్టాలి

కడప జిల్లాలో వైసీపీ ముఖ్యనాయకుడు అటవీ భూమిని కబ్జా చేసిన వ్యవహారంలో ఇప్పటికే ఓ ఫారెస్ట్ అధికారిని సస్పెండ్ చేశామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో అటవీ భూములు అన్యాక్రాంతమైనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలుస్తోందన్నారు. అన్ని జిల్లాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అటవీశాఖ భూములు ఎక్కడెక్కడ అన్యాక్రాంతం అయ్యాయో నిగ్గు తేలుస్తామని చెప్పారు. దీనిపై త్వరలోనే అధికారులతో సమీక్షించి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. కర్నూలు అద్భుతమైన నగరంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన ఎనర్జీ ఇక్కడే (పిన్నాపురం ఐఆర్‌ఈపీ) ఉందని, మేధావుల సలహాలు తీసుకొని ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, గ్రీన్‌కో గ్రూప్ సీఈవో, ఎండీ చలమలశెట్టి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌కో ఎనర్జీ ప్రాజెక్టు టన్నెల్‌ను కారులో వెళుతూ పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

3 లక్షల విలువైన పుస్తకాలు కొన్న పవన్ కల్యాణ్

- పిఠాపురంలోని గ్రంథాలయానికి బహూకరణ?

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సుమారు రూ.3 లక్షలు విలువ చేసే పుస్తకాలను కొనుగోలు చేశారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న పుస్తక మహోత్సవాన్ని శనివారం సందర్శించారు. దాదాపు రెండున్నర గంటలపాటు ప్రతి స్టాల్‌కు వెళ్లి పుస్తకాలను పరిశీలించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు పుస్తకాలను కొనుగోలు చేశారు. తెలుగు సాహిత్యానికి సంబంధించిన పలు పుస్తకాలు పరిశీలించారు. ప్రముఖ రచయితల నుంచి యువ రచయితల వరకూ పలువురి రచనలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా తనకు ఎంతో నచ్చిన 'మ్యాన్స్ సెర్చ్ ఫర్ మీనింగ్' పుస్తకాన్ని చూసి సంతోషించారు. ఈ పుస్తకం చదివితే నిరాశా నిస్పృహలను అధిగమించి ఆశావాద భావన కలుగుతుందన్నారు. బహుమతిగా ఇవ్వడానికి ఉంటాయని ఎక్కువ సంఖ్యలో ఈ పుస్తకాలను కొనుగోలు చేశారు. పిఠాపురంలో ఒక భారీ గ్రంథాలయాన్ని నిర్మించే యోచనలో పవన్ కల్యాణ్ ఉన్నట్టు సమాచారం. దానికి ఈ పుస్తకాలను ఇవ్వనున్నట్టు ప్రచారం జరుగుతోంది.



జల వనరుల శాఖ ఇంజనీర్లకు పదోన్నతులు

- ఎస్‌ఈలుగా.. 43 మంది ఈఈలు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జల వనరుల శాఖలో 43 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు సూపరింటెండింగ్ ఇంజనీర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2918లో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన ప్రమోషన్లు తప్ప, గత ఐదేళ్లూ ఎలాంటి పదోన్నతులూ కల్పించలేదు. వైసీపీ ప్రభుత్వం సీనియారిటీ జాబితాను తయారు చేయలేదు. కానీ, వైసీపీకి సానుకూలంగా ఉన్న అధికారులకు అదనపు బాధ్యతల పేరిట 2 నుంచి మూడేసి చోట్ల కొలువులు అప్పగించారు. అదికూడా ఆ పార్టీకి అనుకూలంగా ఉన్న ఒక్క సామాజికవర్గానికే పెద్దపీట వేస్తూ వచ్చారు. బహిరంగ సభల్లో నా ఎస్సీ, ఎస్టీ అని జగన్ చెబుతూ వచ్చారు. కానీ, ఎస్సీ ఎస్టీ ఇంజనీరింగ్ అధికారులకు పదోన్నతులు గానీ, అదనపు బాధ్యతలు గానీ ఇవ్వకుండా మూలన కూర్చోబెట్టారు. ఇటీవల జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌లను కలసి తమకు పదోన్నతులు కల్పించాలని విజ్ఞ ప్తి చేశారు. అయితే, తాము పదోన్నతులు ఇస్తుంటే కొంద రు న్యాయస్థానాలను ఆశ్రయించడం వల్ల సాహసించలేకపోతున్నామని వారు చెప్పారు. దీంతో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించబోమంటూ ఇంజనీరింగ్ అధికారులు హామీ ఇవ్వడంతో 43 మంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను సూపరింటెండింగ్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పిస్తూ శనివారంనాడు సాయిప్రసాద్ ఉత్తర్వు జారీ చేశారు.

తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలి: ఎస్టీయూ

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) ప్రభుత్వానికి సూచించింది. తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఏపీలో తెలుగు మీడియంలో బోధన లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేసింది. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో రెండు రోజులపాటు కొనసాగనున్న ఎస్టీయూ 78వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించినట్లు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బకాయిలు క్లియర్..!

రూ.6,700 కోట్లు చెల్లింపునకు సీఎం ఆమోదం

- ఇందులో ఒక్క ఉద్యోగులకే 1,300 కోట్లు.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు788 కోట్లు
- చిన్న కాంట్రాక్టర్ల బిల్లులకు 586 కోట్లు.. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌కు 400 కోట్లు
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి



ఆర్థిక శాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి కేశవ్, సీఎస్ విజయానంద్

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కానుకగా వివిధ వర్గాలకు చెల్లించాల్సిన రూ.6,700 కోట్ల మేర పెండింగ్ బకాయిలు, బిల్లుల విడుదలకు సీఎం చంద్రబా బు ఆమోదం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై శనివారం ఉండవల్లిలోని నివాసంలో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉద్యోగులు, పోలీసు శాఖ, చిన్న కాం ట్రాక్టర్ల బకాయిలను చెల్లించాలని నిర్ణయించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ.. సంక్రాంతి కానుకగా పెండింగ్ బిల్లులను చెల్లిస్తున్నామన్నా రు. గత వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు, రూ.1.30 లక్షల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలేసి వెళ్లిందని విమర్శించారు. ఈ క్రమంలో రూ.6,700 కోట్ల పెండింగ్ బిల్లు లు చెల్లించేందుకు ఆమోదించారని తెలిపా రు. దీనిలో ఉద్యోగులకు రూ.1300 కోట్లు విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. 26 వేల మంది చిన్న కాంట్రాక్టర్లకు ఊరట కలిగించే లా రూ.586 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

వివిధ వర్గాలకు చెల్లింపులు ఇలా..

- ఉద్యోగులకు జీపీఎఫ్- రూ.519 కోట్లు
- పోలీసులకు ఒక విడత సరెండర్ లీవ్ బకాయిలు- రూ.214 కోట్లు
- సీపీఎస్‌కు- రూ.300 కోట్లు
- టీడీఎస్ చెల్లింపులకు- రూ.265 కోట్లు
- 6.5 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్- రూ.788 కోట్లు
- రూ.10 లక్షల్లోపు బిల్లులున్న చిన్న కాంట్రాక్టర్లకు- రూ.586 కోట్లు
- అమరావతి రైతులు, గన్నవరం ఎయిర్‌పోర్టు విస్తరణకు భూములిచ్చిన రైతులకు కౌలు బకాయిలు- రూ.241 కోట్లు
- విద్యుత్ శాఖలో డిస్కమ్‌లకు- రూ.500 కోట్లు
- కేంద్ర ప్రాయోజిత పథకాలకు- రూ.627 కోట్లు
- ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌కు- రూ.400 కోట్లు
- ఔషధాలకు- రూ.100 కోట్లు
- ఎంఎస్ఎంఈలకు- రూ.90 కోట్లు
- వివిధ శాఖల్లో నిర్వహణ బిల్లులు- రూ.366 కోట్లు

టీడీపీ కార్యకర్త ఇంటి గేటుకు అడ్డంగా గోడ

- గుంటూరు జిల్లా నందివెలుగులో వైసీపీ నేతల ఆగడాలు

గుంటూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త కుటుంబం ఊరెళ్లి, వచ్చే సరికి వారి ఇంటి గేటుకు అడ్డంగా రోడ్డుపై గోడ నిర్మించి ఉంది. వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ సిలార్ జానీ బాషా, వైసీపీ యువజన నాయకుడు షేక్ అలీముద్దీన్ కలిసి ఈ దారుణానికి పాల్పడ్డారని బాధితుడైన టీడీపీ కార్యకర్త షేక్ అక్బర్ వలి ఆరోపిస్తున్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం నందివెలుగు గ్రామానికి చెందిన అక్బర్ వలి కుటుంబం 2 రోజుల క్రితం ఊరెళ్లింది. శనివారం తిరిగి గ్రామానికి వచ్చేసరికి ఇంటికి అడ్డుగా గోడ నిర్మించి ఉంది.

14 వేల కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ

ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో ఏర్పాటు చేయనున్న ఇండిచిప్

- దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ సెమీకండక్టర్ ఫాబ్
- మంత్రి లోకేశ్ సమక్షంలో అవగాహన ఒప్పందం

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ.14వేల కోట్ల పెట్టుబడితో సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఇండిచిప్ లిమిటెడ్ కంపెనీ.. జపాన్‌కు చెందిన తన భాగస్వామ్య సంస్థ యితో మైక్రో టెక్నాలజీ లిమిటెడ్‌తో కలిసి దేశంలోనే మొట్టమొదటిసారిగా ప్రైవేట్ సెమీ కండక్టర్ తయారీ కేంద్రాన్ని ఏపీలో స్థాపించడానికి ముందుకొచ్చింది. కంపెనీ ప్రతినిధులు గత నెలలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి చర్చలు జరిపారు. కంపెనీ ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో అవసరమైన భూమిని కేటాయించి, మౌలిక సదుపాయాలు, ఎకోసిస్టమ్‌ను అందజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో కంపెనీ ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో మంత్రి లోకేశ్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) చేసుకున్నారు. ఒప్పందంపై ఇండిచిప్ మేనేజింగ్ డైరెక్టర్ పీయూష్ బిచ్చేరియా, ఏపీ ఈడీబీ సీఈవో సాయికాంత్‌వర్మ సంతకాలు చేశారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ దేశంలో గ్లోబల్ సెమీ కండక్టర్ అభివృద్ధిని మరింత బలోపేతం చేయడానికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. ఈ ప్రాజెక్టును రెండున్నరేళ్లలో పూర్తి చేయాలనే కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో ఓర్వకల్లు పారిశ్రామికవాడలో నూతన ఆవిష్కరణలతోపాటు అనుబంధ పరిశ్రమల అభివృద్ధి ద్వారా వేలాది ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్, ఇండిచిప్ డైరెక్టర్లు డాక్టర్ సందీప్‌గార్డ్, వెబ్‌చాంగ్, యితో మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్ చైర్మన్ డేవిడ్ యార్క్ యువాన్ చాంగ్, సీఈవో మోటోసుగి కీసుకె తదితరులు పాల్గొన్నారు.

భారీ పెట్టుబడులకు ఎస్ఐపీసీ ఆమోదం

కాకినాడలో సీఐఎల్ ప్లాంట్ ఏర్పాటుకు సమ్మతి

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ(ఎస్ఐపీసీ) ఆమోదం తెలిపింది. సీఎస్ కె.విజయానంద్ అధ్యక్షతన సచివాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పలు పెట్టుబడులకు సమ్మతించింది. ఆమోదం పొందిన ప్రాజెక్టులు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) ఆమోదంతో పాటు మంత్రిమండలి సమ్మతి పొందుతాయి. కాకినాడలో రూ.1,539 కోట్ల పెట్టుబడులతో ఇంటిగ్రేటెడ్ పాస్ఫేటిక్ ఫెర్టిలైజర్ ప్లాంట్, మరో రూ.1,700 కోట్లతో అనుబంధ ప్లాంట్ల ఏర్పాటుకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సీఐఎల్) పంపిన ప్రతిపాదనలకు ఎస్ఐపీసీ ఆమోదం తెలిపింది. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో 2017లో కేటాయించిన భూముల్లో న్యాయపరమైన సమస్యలు ఉన్నందున అనకాపల్లిలోని కోడూరులో ఏపీఐఐసీ భూములు కేటాయించాలని మెస్సర్స్ అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా(గతంలో ఎలీప్) చేసిన ప్రతిపాదనను ఎస్ఐపీసీ ఆమోదించింది. కడప జిల్లా కొప్పర్తి ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్(ఈఎంసీ)లో రూ.748.76 కోట్లతో 540 ఎకరాల్లో చేపట్టే ప్రాజెక్టుకు ఇప్పటిదాకా ధర నిర్ధారణ కాలేదు. ఈ క్లస్టర్‌లో కేటాయించిన స్థలాలకు స్టాంప్ డ్యూటీ మినహాయించాలన్న వినతికి ఆమోదం లభించింది. చిత్తూరు జిల్లా మురుకంబట్టులో అపోలో హాస్పిటల్స్‌కు 8.17 ఎకరాలు కేటాయింపునకు సమ్మతించింది. ప్రాజెక్టు సిక్స్‌టీన్ రెన్యువబల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ 194.70 మెగావాట్లు, సెవెన్ రెన్యువబుల్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ 148.50 మెగావాట్లు, ప్రాజెక్టు ఎలెవన్ రెన్యువబుల్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ 102.30 మెగావాట్లు, అయన రెన్యువబుల్ పవర్ ఫోర్ ప్రైవేటు లిమిటెడ్ 52.80 మెగావాట్ల ప్రాజెక్టులకు ఎస్ఐపీసీ ఆమోదం తెలిపింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.